
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 196
శుక్రవారం 6-10-2023
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | CHENNAI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



మన బాణం.. బంగారం

ఆర్చరీలో భారత్‌కు రెండు స్వర్ణాలు.. మెరిసిన జ్యోతి సురేఖ బృందం - 14లో



గెలుపు 'రచిన్'చాడు

వరల్డ్ కప్ తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై న్యూజిలాండ్ ఘన విజయం - 14లో



భారత్‌ను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది

భారత దేశ గళాన్ని ప్రపంచ దేశాలు వింటు న్నాయని.. ఇది చూసి కాంగ్రెస్ తట్టుకోలేక పోతోందని ప్రధాని మోదీ విమర్శించారు.

వివరాలు 6లో ▸



మధ్యప్రదేశ్‌లో మహిళా రిజర్వేషన్

అటవీ శాఖ మినహా అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మధ్యప్రదేశ్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది.

వివరాలు 6లో ▸



సిక్కింలో 18కు చేరిన మరణాలు

సిక్కిం ఆకస్మిక వరదల్లో మృతుల సంఖ్య 18కు చేరుకుంది. అలాగే 22 మంది జవాన్లు సహా గల్లంతైన వారి సంఖ్య 98కు పెరిగింది.

వివరాలు 6లో ▸



ఉగ్రవాదాన్ని అణచివేయాలి

ఉగ్రవాదులతో పాటు వారి నెట్‌వర్క్‌ను అణచివేయాలని జాతీయ సదస్సులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు.

వివరాలు 6లో ▸

పోలవరం ఫలాలు త్వరగా అందాలి

ప్రాజెక్టు తాజా అంచనాలకు ఆమోదం తెలపండి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి

రూ.55,548.87 కోట్లకు సాంకేతిక సలహా కమిటీ ఆమోదం

దీనిని కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదించేలా చూడండి

అడ్‌హక్‌గా సొమ్ములు విడుదల చేయాలి

తొలి దశ పూర్తికి ఇంకా రూ.17,144 కోట్లు ఇవ్వాలి

విద్యుత్‌కు సంబంధించి కేంద్ర మంత్రి ఆర్కే సింగ్‌తోనూ సీఎం చర్చలు

రాష్ట్రంలో విద్యుత్ రంగం పనితీరు బాగుందని కేంద్ర మంత్రి కితాబు

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన అంచనాలకు వెంటనే ఆమోదం తెలపాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా ప్రాజెక్టు పూర్తి చేసి, ఫలితాలు అందించడానికి కేంద్రం సహకరించాలని కోరారు. గురువారం సాయంత్రం సీఎం జగన్.. కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్ బకాయిలపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రజలకు ప్రాజెక్టు ఫలితాలు అందించడానికి సహకరించాలని కోరారు. పూర్తి నిర్మాణ వ్యయంపై తాజా అంచనాలకు ఆమోదం తెలపాలన్నారు. 2017–18 ధరల సూచీ ప్రకారం పోలవరం ప్రాజెక్టు వ్యయం రూ.55,548.87 కోట్లుగా ఇప్పటికే సాంకేతిక సలహా కమిటీ ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. దీనికి ఆర్థిక శాఖ ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు

మిగతా 2వ పేజీలో ▶



ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

వాట్సాప్ చానల్లో సీఎం వైఎస్ జగన్

ఇక నేరుగా సోషల్ మీడియా ద్వారా ప్రజలతో మమేకం

2లో

నార్వే రచయితకు సాహిత్య నోబెల్



నార్వే రచయిత జాన్ ఫోసేను సాహిత్యంలో నోబెల్ పురస్కారం వరించింది. బయటకు చెప్పుకోలేని ఎన్నో అంశాలకు తన నవలలు, నాటకాలు, చిన్న పిల్లల పుస్తకాల ద్వారా గళంగా నిలిచినందుకు ఫోసే ఈ ఏడాది ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. ఫోసే చేసిన రచనల్లో నార్వే సంస్కృతి, స్వభావం, భాషలో సరళత్వం ఉట్టిపడుతూ ఉంటుందని నోబెల్ లిటరేచర్ కమిటీ చైర్మన్ కొనియాడారు. నిత్య జీవితంలో ఎదురయ్యే ఘటనలను స్ఫూర్తిగా తీసుకొని జాన్ ఫోసే రచనలు చేశారు.

6లో

మత్స్యకారులకు మరింత మేలు..

- హార్బర్ల ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి
- గంగపుత్రులకు అధికాదాయం పొందే మార్గాలు అందుబాటులోకి
- జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ద్వారా ఏటా 41,250 టన్నుల మత్స్య సంపద
- వీటి ప్రాసెసింగ్‌కు 20 ఎకరాల విస్తీర్ణంలో ప్లాంట్ ఏర్పాటు
- హార్బర్‌లో 1,250 బోట్లు నిలుపుకునే అవకాశం



- ఇందుకోసం 5 ఎకరాల్లో బోట్ బిల్డింగ్ యార్డ్ నిర్మాణానికి ప్రతిపాదన
- బిడ్లకు ఏపీ మారిటైమ్ బోర్డు ఆహ్వానం

2లో

ఫ్యాక్ట్ చెక్



గురివింద కలగన్నారు..!

- కృష్ణమ్మ సాక్షిగా సీఎం జగన్‌పై విషం చిమ్మిన రామోజీ
- కృష్ణా జలాల పంపిణీకి మరిన్ని విధి విధానాలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం
- కానీ.. బచావత్ ట్రిబ్యునల్ అవార్డును పునఃసమీక్షిస్తున్నారంటూ ఈనాడు వక్రభాష్యం
- తద్వారా రాష్ట్ర హక్కులను మళ్లీ నిరూపించుకోవాల్సి వచ్చిందంటూ చిత్రీకరణ
- సీఎం నోరు మెదపడం లేదంటూ దుష్ప్రచారం
- ఈ అవార్డును పునఃసమీక్షించడం చట్టవిరుద్ధమని ఇప్పటికే సీఎం పలు లేఖలు
- ప్రధాని, హోంమంత్రి, కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రికి వినతులు

2లో

న్యూస్‌రీల్

ఈ నెల 14, 15 తేదీల్లో ఎస్ఐ మెయిన్స్



రాష్ట్రంలో ఎస్ఐ పోస్టుల భర్తీ కోసం ఈనెల 14, 15 తేదీల్లో మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని పోలీస్ నియామక మండలి నిర్ణయించింది. విశాఖ, ఏలూరు, గుంటూరు, కర్నూలులో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసింది.

వివరాలు 3లో ▸

వెంచర్ల వంచనపై చర్యలు



గత ప్రభుత్వ హయాంలో సీఆర్‌డీఏ పరిధిలో అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేసి వినియోగదారులను మోసం చేసిన సంస్థలపై సీఆర్‌డీఏకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వాటిని పరిశీలించిన సీఆర్‌డీఏ ఇప్పటికే 1,567 లేఅవుట్లపై చర్యలు చేపట్టింది.

వివరాలు 3లో ▸

ఊరూ వాడా.. 'ఆరోగ్య సురక్ష'

నాలుగు రోజుల్లో 2,427 వైద్య శిబిరాల నిర్వహణ

7.16 లక్షల మందికి సొంత గ్రామాల్లో ఉచితంగా స్పెషాలిటీ వైద్యం

సేవలు వినియోగించుకున్న వారిలో మహిళలే అత్యధికం

ఇప్పటివరకు 20,798 మంది పెద్దాస్పత్రులకు రిఫర్

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా స్పెషలిస్టు డాక్టర్ల పర్యవేక్షణలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య శాఖ షెడ్యూల్ ప్రకారం వైద్య శిబిరాలను జోరుగా నిర్వహిస్తోంది. శిబిరాల్లో ప్రజలు రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా స్పెషలిస్ట్ వైద్యుల సేవలను పొందుతున్నారు. డాక్టర్లు సూచించిన మందులను ప్రభుత్వం ఉచితంగా

మిగతా 10వ పేజీలో ▶



పశ్చిమగోదావరి జిల్లా నడిపూడిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది

వైద్య రంగంలో ఏపీ సంస్కరణలు భేష్

ప్రశంసించిన అంతర్జాతీయ సంస్థ జె-పాల్ ప్రతినిధులు

10లో





రైతన్నలకు మరింత ఆదాయం

- పలు సంస్థలతో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మూడు కీలక ఒప్పందాలు
- 32 రకాల ఆహార ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపునకు కృషి
- ఇందుకు జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం సాంకేతిక సహకారం
- రాయలసీమలో 5 వేల సోలార్ డీ హైడ్రేషన్ యూనిట్ల ఏర్పాటు
- వీటికి ఆర్థిక చేయూత అందించేందుకు ముందుకొచ్చిన ఏపీజీబీ
- రైతుల ఉత్పత్తులను కొనుగోలు చేయనున్న రోహెజా సోలార్ ఫుడ్ ప్రాసెసింగ్ లిమిటెడ్

2లో

చంద్రబాబు రిమాండ్ 19 వరకు పొడిగింపు




ఏసీబీ న్యాయస్థానం ఉత్తర్వులు

జైలు నుంచి వర్చువల్ విధానంలో కోర్టు ఎదుట బాబు హాజరు

3లో

'స్కిల్ స్కామ్' సూత్రధారి, లబ్ధిదారు చంద్రబాబే



- ఆధారాలతో సహా ఏసీబీ కోర్టుకు వివరించిన అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి
- కొల్లగొట్టిన రూ.371 కోట్లలో రూ.27 కోట్లు టీడీపీ ఖాతాకు చేరాయని వెల్లడి

3లో

రైతన్నలకు మరింత ఆదాయం

పలు సంస్థలతో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మూడు కీలక ఒప్పందాలు

- 32 రకాల ఆహార ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపునకు కృషి
- ఇందుకు జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం సాంకేతిక సహకారం
- రాయలసీమలో 5 వేల సోలార్ డీ హైడ్రేషన్ యూనిట్ల ఏర్పాటు
- వీటికి ఆర్థిక చేయూత అందించేందుకు ముందుకొచ్చిన ఏపీజీబీ
- రైతుల ఉత్పత్తులను కొనుగోలు చేయనున్న రహేజా సోలార్ ఫుడ్ ప్రాసెసింగ్ లిమిటెడ్



ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, రహేజా, దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీతో అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రానికే ప్రత్యేకమైన ప్రసిద్ధి చెందిన ఆహార ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు (జీఐ) తేవడంతో పాటు రైతులకు గిట్టుబాటు ధర, అదనపు విలువ చేకూర్చడం ద్వారా వారు మరింత ఆదాయం పొందేలా ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మరో కీలక ముందడుగు వేసింది. ఒకేసారి మూడు సంస్థలతో గురువారం మౌలిక అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకుంది. సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ సహకార, వ్యవసాయ, ఆహార శుద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి సమక్షంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ), రహేజా సోలార్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్ఎస్ఎఫ్‌పీఎల్), దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలతో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎంవోయూలు చేసుకుంది. ఈ మేరకు ఆయా సంస్థల ఉన్నతాధికారులతో కలిసి సొసైటీ సీఈవో ఎల్.శ్రీధర్ రెడ్డి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

భౌగోళిక గుర్తింపు కోసం సాంకేతిక సహకారం

రాష్ట్రానికే ప్రత్యేకమైన ఆహార ఉత్పత్తులకు బ్రాండింగ్, భౌగోళిక గుర్తింపు (జీఐ) తీసుకొచ్చేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం ముందుకొచ్చింది. ఇప్పటికే ఆత్రేయపురం పూతరేకులకు జీఐ ట్యాగ్ వచ్చింది. ఇదే రీతిలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో 32కు పైగా ఆహార ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు కోసం ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ చేస్తున్న కృషికి వర్సిటీ సాంకేతిక సహకారం అందించనుంది. తద్వారా రాష్ట్రానికే ప్రత్యేకమైన ఆయా గొప్ప వంటల వారసత్వాన్ని సంరక్షించడంతోపాటు ఖ్యాతిని భవిష్యత్ తరాలకు అందించేందుకు తగు రీతిలో ప్రచారం చేయడానికి వీలవుతుంది.

రైతుల ఉత్పత్తుల కొనుగోలుకు..

సోలార్ డీ హైడ్రేషన్ యూనిట్లకు అవసరమైన సాంకేతికతను ఇప్పటివరకు మహారాష్ట్రకు చెందిన ఎస్4ఎస్ అనే సంస్థ అందిస్తోంది. ఈ యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేసే ఉల్లి, టమాటా ఫ్లేక్స్ (ముక్కలు)ను కిలో రూ.2.50 చొప్పున కొనుగోలు చేస్తూ వారికి అండగా నిలుస్తోంది. అదే రీతిలో రాయలసీమ జిల్లాల్లో ఏర్పాటవుతున్న మిగిలిన యూనిట్లకు సాంకేతిక సహకారం, మద్దతు అందించేందుకు మధ్యప్రదేశ్‌కు చెందిన రహేజా సోలార్ ఫుడ్స్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. కనీసం 2 వేల యూనిట్లకు సహకారం అందిస్తుంది. ఉల్లి, టమాటాలను సమకూర్చడంతో పాటు రైతుల నుంచి ఉల్లి, టమాటా ఫ్లేక్స్‌ను తిరిగి కొనుగోలు చేస్తుంది. ఏపీజీబీ ఛైర్మన్ రాకేశ్ కష్యప్, జీఎం పీఆర్ పద్గెటావర్, దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జోగినాయుడు, రహేజా సంస్థ వైస్ ఛైర్మన్ సౌరబ్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ స్టేట్ లీడ్ సుభాష్, మేనేజర్ శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సోలార్ డీహైడ్రేషన్ యూనిట్లకు ఆర్థిక చేయూత



టమాటా, ఉల్లి పంటలకు అదనపు విలువ చేకూర్చడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర, పొదుపు సంఘాలకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా రాయలసీమ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ప్రత్యేకంగా 5 వేల సోలార్ డీహైడ్రేషన్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా సొసైటీ ముందుకెళ్తోంది. ఇప్పటికే కర్నూలు జిల్లాలో పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు మిగిలిన జిల్లాల్లో కూడా ఈ ప్రాజెక్టును విస్తరించేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందుకు అవసరమైన ఆర్థిక చేయూతనిచ్చేందుకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ) ముందుకొచ్చింది. సొసైటీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం.. ఆయా జిల్లాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారులకు రూ.10 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలను బ్యాంక్ అందించనుంది. యూనిట్ మొత్తంలో 35 శాతాన్ని సొసైటీ సబ్సిడీ రూపంలో అందిస్తుంది. 9 శాతం వడ్డీతో మంజూరు చేసే ఈ రుణాలపై అగ్రి ఇన్‌ఫ్రా ఫండ్ కింద అదనంగా మరో 3 శాతం వడ్డీ రాయితీ కూడా లభిస్తుంది.

క్లుప్తంగా...

వాట్సాప్ చానల్లో సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ప్రజలతో నేరుగా సామాజిక మాధ్యమాల ద్వారా మమేకం అయ్యే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వాట్సాప్ చానల్‌లో చేరారు. ఇక నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు మీద ఉన్న ఈ వాట్సాప్ చానల్ ద్వారా ప్రజలకు మరింత చేరువకానున్నారు. డిజిటల్ మీడియా వాట్సాప్ కమ్యూనిటీ ద్వారా ఈ విధంగా కలుస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని, ఇక నుంచి మీతో సన్నిహితంగా ఉంటానంటూ ముఖ్యమంత్రి ప్రారంభ సందేశంలో పేర్కొన్నారు. ఈ డైరెక్ట్ చానల్ ప్రభుత్వం – ప్రజల మధ్య అవినాభావ సంబంధాన్ని పెంచడంతోపాటు వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, విధాన ప్రకటనలు ఇతర సంబంధిత సమాచారాలను ప్రజలు తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని సీఎంవో గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. కొత్తగా వస్తున్న సమాచార సాంకేతిక మాధ్యమాలను వినియోగించుకోవడం ద్వారా మరింత పారదర్శక పరిపాలన అందించాలన్న ముఖ్యమంత్రి నిబద్ధతను ఇది తెలియచేస్తోంది. దిగువ పేర్కొన్న లింక్‌ను క్లిక్ చేయడం ద్వారా సీఎం వాట్సాప్ చానల్‌ను ఫాలో కావచ్చు.
https://whatsapp.com/channel-/0029Va4JGNi42DccmaxNjf0q

ఇలా చూడొచ్చు..

సామాజిక మాధ్యమాల్లో ఒకటైన వాట్సాప్ ఇటీవల చానల్‌ను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించింది. ఇందులో భాగంగానే సీఎం వైఎస్ జగన్ వాట్సాప్ చానల్ ప్రారంభించారు. ఒక్కసారి లింక్ ఓపెన్ చేసి ఫాలో అయితే చాలు. వాట్సాప్ స్టేటస్‌లోకి వెళ్లి చూస్తే సీఎం పోస్ట్ చేసిన ప్రతి సమాచారం మనకు కనిపిస్తుంది.

నేడు అమిత్‌షాతో ముఖ్యమంత్రి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేడు భేటీ కానున్నారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల సమావేశానికి ఆయన హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో బిహార్, ఒడిశా, మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ, మధ్యప్రదేశ్ ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల ముఖ్యమంత్రులు/హోంశాఖ మంత్రులు /అధికారులు హాజరు కానున్నారు. అనంతరం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో సీఎం వైఎస్ జగన్ భేటీ కానున్నారు. కాగా, రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు గురువారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయంలో ఎంపీలు విజయసాయిరెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆర్.కృష్ణయ్య, మార్గాని భరత్‌రామ్, బాలశౌరి, గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, ఎన్.రెడ్డప్పలు సీఎంకు స్వాగతం పలికారు. ఎంపీ మిథున్‌రెడ్డి ముఖ్యమంత్రి వెంట ఢిల్లీకి వచ్చారు.

వేగంగా ఇళ్ల నిర్మాణం

- గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ దొరబాబు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా నిర్మిస్తోన్న పేదల ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ దవులూరి దొరబాబు చెప్పారు. సంస్థ ఛైర్మన్‌గా ఆయన విజయవాడలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. నిర్దేశించిన లక్ష్యంలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఎండీ లక్ష్మీశా, ఇతర అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పోలవరం ఫలాలు త్వరగా అందాలి

▶ మొదటి పేజీ తరువాయి



కేంద్ర మంత్రి ఆర్కే సింగ్‌తో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అడహాక్‌గా నిధులు విడుదల చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు రూ.12,911.15 కోట్ల విడుదలకు ఆమోదం లభించడం సంతోషకరమని, అయితే దీన్ని పునఃపరిశీలించి తాజాగా అంచనాలను రూపొందించామని తెలిపారు. లైడార్ సర్వే ప్రకారం అదనంగా 36 ఆవాసాల్లో ముంపు కుటుంబాలను రక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉందని, 2022 జూలైలో వచ్చిన భారీ వరదల వల్ల తలెత్తిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తొలి దశ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చేయాల్సిన పనులపై ఈ అంచనాలు రూపొందించామని చెప్పారు. పోలవరం తొలి దశను పూర్తి చేయడానికి ఇంకా రూ.17,144.06 కోట్లు అవసరమవుతాయని, ఆ మేరకు నిధులు విడుదలచేయాలని కోరారు.

రూ.1,355 కోట్లు రీయింబర్స్ చేయాలి

ప్రాజెక్టు నిర్మాణం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధుల నుంచి ఖర్చు చేసిన రూ.1,355 కోట్లను రీయింబర్స్ చేయాలని సీఎం జగన్ కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలు సుదీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. రూ.7,359 కోట్లను తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ బకాయిల రూపంలో చెల్లించాల్సి ఉందన్నారు. 2014 జూన్ నుంచి 2017 జూన్‌వరకు సరఫరా చేసిన విద్యుత్‌కు ఇప్పటి వరకు ఛార్జీలు చెల్లించలేదని, తొమ్మిదేళ్లుగా ఈ సమస్య పెండింగులో ఉందని గుర్తు చేశారు. ఏపీ జెన్‌కోకు, డిస్కంలకు ఇది తీవ్ర గుదిబండగా మారిందని తెలిపారు. తద్వారా వివిధ సంస్థలకు చెల్లింపులు చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తెలంగాణ నుంచి సొమ్ము వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సొమ్ము ఇప్పించాలంటూ ఏపీ ప్రభుత్వం పలు మార్లు విజ్ఞప్తులు చేసిన తర్వాత 30 రోజుల్లోగా ఏపీకి బకాయిలు చెల్లించాలంటూ 2022 ఆగస్టు 29న కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. అయితే తెలంగాణ రాష్ట్రం హైకోర్టును ఆశ్రయించిందని, దీంతో ఈ అంశంలో కోర్టు పరిధిలోకి వెళ్లిందని తెలిపారు. ఏపీ విద్యుత్ సంస్థలకు ఆ సొమ్ము వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ రంగానికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు.

ఏపీలో విద్యుత్ రంగం బాగుంది

అనంతరం కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ మీడియాతో మాట్లాడారు. ఏపీలో విద్యుత్ రంగం అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో చర్చించానన్నారు. ఏపీలో విద్యుత్ రంగం పనితీరుపై కేంద్రం సంతృప్తిగా ఉందని స్పష్టం చేశారు. రీ వ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్‌డీఎస్ఎస్)కు ఏపీ క్వాలిఫై అయిందని తెలిపారు. తెలంగాణ విద్యుత్ బకాయిలపై మీడియా ప్రశ్నకు ఆయన సమాధానం ఇవ్వడానికి నిరాకరించారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల సదస్సులో మంత్రి అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం/తగరపువలస (విశాఖపట్నం): మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. విశాఖపట్నంలో రెండు రోజులు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల సదస్సును ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, వాటిలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని చెప్పారు. స్టార్టప్ కంపెనీలను స్థాపించే మహిళలకు ప్రోత్సాహకాలతోపాటు వినూత్న ఆలోచనలతో ముందుకువెళ్లేలా సహకారం అందిస్తున్నామని తెలిపారు. అనకాపల్లిలో 50 ఎకరాల్లో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 27 ఎమర్జింగ్ ఇన్నోవేషన్స్ హబ్‌లను ఎంపిక చేయగా, వాటిలో రాష్ట్రం నుంచి విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి ఉండడం గర్వకారణమన్నారు. ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతోపాటు ఆధునిక సాంకేతికతను కూడా వినియోగించుకుంటే మంచి ఫలితాలు సాధించగలరని సూచించారు. ఈ సదస్సులో ఎడ్–వెంచర్ స్కూల్ ప్రైవేట్ లిమిటెడ్, యాంటెన్నా వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, హెడ్ స్టార్ట్ నెట్‌వర్క్ ఫౌండేషన్, వ్యూ ఫౌండర్ సర్కిల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు పలు ప్రాజెక్టుల కోసం ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకున్నాయి. అనంతరం ఏపీఐఎస్ ఈ–మ్యాగజైన్‌ను మంత్రి అమర్‌నాథ్, ఐటీ కార్యదర్శి కోన శశిధర్ ఆవిష్కరించారు. ఈ సదస్సులో ఏపీఐఎస్ సీఈవో అనిల్‌కుమార్, ఏపీ, తెలంగాణ ఎస్టీపీఐ డైరెక్టర్ సీవీడీ రాంప్రసాద్, అదనపు డైరెక్టర్ సురేష్ బాతా, నీతి ఆయోగ్ సభ్యురాలు యశోధర, నాస్కాం సీఈవో సంజీవ్ మల్హోత్రా, సీఐఐ సదరన్ రీజియన్ ఉమెన్ నెట్‌వర్క్ ప్రెసిడెంట్ లక్ష్మి ముక్కవల్లి, స్టార్టప్ ఇండియా (న్యూఢిల్లీ) అసిస్టెంట్ మేనేజర్ ఖుష్బూ వర్మ, ఎన్ఆర్‌డీసీ డెవలప్‌మెంట్ ఇంజినీర్ శ్రీసుధ, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

'స్పేస్' స్టార్టప్‌లపై దృష్టి పెట్టాలి

అంతరిక్ష ప్రయోగాలు, ప్రాజెక్టులకు ప్రాధాన్యత పెరుగుతోందని, ఈ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యువత స్పేస్ స్టార్టప్‌లను ప్రారంభించే దిశగా అడుగులు వేయాలని రాష్ట్ర భారీ పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. భీమిలి మండలం దాకమర్రిలో ఉన్న రఘు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ దేశాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దగల సత్తా సాంకేతిక రంగానికి ఉందన్నారు. అంతరిక్ష ప్రయోగాలకు ప్రాధాన్యత పెరుగుతున్న కారణంగా ఈ రంగంవైపు పారిశ్రామికవేత్తలు అడుగులు వేయాలన్నారు. భవిష్యత్‌లో స్పేస్ టూరిజానికి మంచి డిమాండ్ ఉంటుందన్నారు. అంతరిక్ష రంగానికి సంబంధించిన స్టార్టప్‌లు ఏర్పాటు చేసే యువతకు సహకారం అందిస్తామని చెప్పారు. ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్‌బాబు మాట్లాడుతూ దేశ భవిష్యత్ అంతరిక్ష పరిశోధనలపై ఆధారపడి ఉందని అందరూ తెలుసుకోవాలన్నారు. స్టూడెంట్ కనెక్ట్ కార్యక్రమాల్లో షార్ శాస్త్రవేత్తలు ప్రత్యక్షంగా పాల్గొంటారన్నారు. యువత చిప్ మ్యానుఫ్యాక్చరింగ్‌పై దృష్టి సారించాలని సూచించారు. రఘు విద్యాసంస్థల ఛైర్మన్ కలిదిండి రఘు తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల మ్యాగజైన్‌ను మంత్రి ఆవిష్కరించారు.



ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబును సత్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

'కృష్ణా జలాల పంపిణీ'పై 9న సమావేశం

- ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన నీటిని 2 రాష్ట్రాలకు పునఃపంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయం
- దీనిపై అధికారులు, న్యాయ నిపుణులతో సమీక్షించనున్న సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పునఃపంపిణీ చేయాలని కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంపై సోమవారం జలవనరుల శాఖ అధికారులు, న్యాయ నిపుణులతో సీఎం వైఎస్ జగన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను పరిరక్షించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)–2కు మరిన్ని విధివిధానాలను ప్రతిపాదిస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం (ఐఎస్ఆర్‌డీఏ)–1956లో సెక్షన్–3 ప్రకారం ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయాలని తెలంగాణ సర్కార్ చేసిన ఫిర్యాదు మేరకు కేంద్ర మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకుందని కేంద్ర మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ ప్రకటించారు. అయితే కేంద్రం ప్రతిపాదించిన విధివిధానాలు ఏమిటో ఇప్పటిదాకా స్పష్టత రాలేదని సీఎం జగన్‌కు జలవనరుల శాఖ ఉన్నతాధికారులు వివరించారు. స్పష్టత వచ్చాక.. వాటి వల్ల రాష్ట్ర హక్కులపై పడే ప్రభావం, హక్కులను పరిరక్షించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయించారు.

గురివింద కలగన్నారు..!

కృష్ణమ్మ సాక్షిగా ముఖ్యమంత్రి జగన్‌పై విషం చిమ్మిన రామోజీ

సాక్షి, అమరావతి: ఎద్దు ఈనిందంటే దూడను గాటికి కట్టేయమన్నట్లుగా ఉన్నాయి రామోజీరావు తెలివితేటలు. కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం ఒకటైతే.. మరొకటిగా ఊహించుకుని.. అభూత కల్పనలతో సీఎం వైఎస్ జగన్‌పై బురదజల్లుతూ నీతి మాలిన రోత రాతలను యథావిధిగా అచ్చేశారు. రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాలను పంపిణీ చేయడానికి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు కేంద్ర జల్ శక్తి శాఖ ప్రతిపాదించిన మరిన్ని విధి విధానాలను కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదించింది. ఆ విధి విధానాలపై ఇప్పటిదాకా స్పష్టత లేదు. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను పునః సమీక్షించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించినట్లుగా కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ కూడా బుధవారం వెల్లడించలేదు. కానీ.. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను పునఃసమీక్షించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని.. దీని వల్ల దశాబ్దాల తరబడి రాష్ట్రానికి ఉన్న హక్కులను మళ్లీ నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని.. దీనిపై ఏ వేదికపై కూడా సీఎం జగన్ నోరు మెదపక పోవడం వల్ల రాష్ట్ర హక్కులకు విఘాతం కలుగుతోందంటూ 'కృష్ణా జలాలపై పునఃసమీక్ష' శీర్షికతో 'ఈనాడు'లో కథనాన్ని అచ్చేశారు. ఆ కథనంలో సీఎం జగన్‌పై రామోజీరావు అక్కసు తప్ప.. వీసమెత్తు నిజం లేదు. అసలు నిజం ఏమిటంటే..

రాష్ట్రంలో ఏం జరిగినా, రాష్ట్రానికి సంబంధించి ఎక్కడ ఏ అంశం చర్చకు వచ్చినా.. వెంటనే అందులో లోపాలంటూ దుష్ప్రచారం చేయడం, వాటిని సీఎం జగన్‌కు అంటగట్టడం ఈనాడు రామోజీకి నిత్యకృత్యమైపోయింది. తమ ఇష్టుడైన చంద్రబాబు అవినీతికి పాల్పడి అడ్డంగా దొరికిపోవడంతో సదరు రామోజీకి ఈ ప్రభుత్వంపై మరింత అక్కసు పెరిగిపోయింది. ఇది ప్రతిరోజూ ఈనాడులో కనిపిస్తూనే ఉంది. ఎలాగైనా సరే ప్రజలను తప్పుదోవ పట్టించి, ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచాలన్నదే ధ్యేయంగా రామోజీ ముందుకు వెళుతున్నారు. ఇందులో భాగంగా తాజాగా కృష్ణా జలాల పంపిణీ అంశాన్ని భుజానికెత్తుకున్నారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు కేంద్ర జల్ శక్తి శాఖ ప్రతిపాదించిన అంశాలను తానే దగ్గరుండి స్వయంగా చూసినట్లు కలగని ఓ తప్పుడు కథనాన్ని అచ్చేశారు.

■ విభజన తర్వాత 2014 జూలై 14న అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం (ఐఎస్ఆర్‌డబ్ల్యూఏ)–1956లో సెక్షన్–3 ప్రకారం కృష్ణా జలాలను పంపిణీ చేయడానికి కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్కార్ కేంద్రాన్ని కోరింది. ఇదే అంశంపై సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ 545/2015ను దాఖలు చేసింది. దీనిపై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా వాదనలు వినిపించడంతో ఎలాంటి ప్రయోజనం ఉండదని గ్రహించిన తెలంగాణ సర్కార్ ఆ రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకుంది.

■ తెలంగాణ కోరిన విధంగా సెక్షన్–3 కింద కృష్ణా జలాలను పంపిణీ చేస్తే.. అది చట్టవిరుద్ధమని కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తేల్చిచెబుతూ 2021 ఆగస్టు 17న.. 2022 జూన్ 25న సీఎం వైఎస్ జగన్ లేఖలు రాశారు.

■ ఢిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి షెకావత్‌లతో సీఎం వైఎస్ జగన్ సమావేశమైన ప్రతి సందర్భంలోనూ.. తెలంగాణ సర్కార్ కోరిన విధంగా సెక్షన్–3 ప్రకారం బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన కృష్ణా జలాలను పునఃసమీక్షించడానికి అవకాశమే లేదని స్పష్టం చేస్తూ వస్తున్నారు. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు సుప్రీంకోర్టు డిక్రీతో సమానమని గుర్తు చేస్తూ.. దాన్ని పునఃసమీక్షించడం చట్టవిరుద్ధమని తేల్చిచెబుతూ వస్తున్నారు.

■ రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి కేడబ్ల్యూడీటీ–2కు కేంద్ర మంత్రివర్గం ప్రతిపాదించిన మరిన్ని విధి విధానాలపై ఇప్పటిదాకా స్పష్టత లేదు. వాటిపై స్పష్టత వచ్చాక.. రాష్ట్ర హక్కులను పరిరక్షించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేయాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయించారు.

■ కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను పరిరక్షించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి, హోంశాఖ మంత్రిని కోరేందుకు సీఎం వైఎస్ జగన్ గురువారం ఢిల్లీకి వెళ్లారు.

మత్స్యకారులకు మరింత మేలు

- హార్బర్ల ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి
- జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ద్వారా ఏటా 41,250 టన్నుల మత్స్య సంపద



సాక్షి, అమరావతి: మత్స్య ఉత్పత్తుల పెంపు, మత్స్యకారులు చేపల వేటకు వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులను తప్పించడం, వారికి అధిక ఆదాయ మార్గాలను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా పది ఫిషింగ్ హార్బర్లను నిర్మిస్తోంది. ఇందుకు సుమారు రూ.3,500 కోట్లు వ్యయం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పుడు హార్బర్ల ఆధారంగా పనిచేసే పరిశ్రమల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా తొలి దశలో రూ.1,522.80 కోట్లతో నిర్మిస్తున్న జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల పనులు పూర్తి కావస్తున్నాయి. దీంతో ఈ హార్బర్ల నుంచి వచ్చే మత్స్య సంపద ద్వారా మత్స్యకారులు అధికాదాయం పొందే మార్గాలను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె వద్ద రూ.288.81 కోట్లతో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులు దాదాపు పూర్తికావడంతో ఇక్కడ ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్, బోట్ బిల్డింగ్ యార్డ్‌లను ఏపీ మారిటైమ్ బోర్డు ఏర్పాటు చేస్తోంది. ఒక్క జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ద్వారానే ఏటా 41,250 టన్నుల మత్స్య సంపద లభిస్తుందని అంచనా. ఇలా వచ్చే 30 ఏళ్లలో ఈ హార్బర్ ద్వారా మిలియన్ టన్నుల మత్స్య సంపద లభిస్తుందని ఏపీ మారిటైమ్ బోర్డు అంచనా వేసింది. దీనికి అనుగుణంగా హార్బర్‌కు వెలుపల 20 ఎకరాల విస్తీర్ణంలో ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి ఆసక్తి గల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది. వార్షిక ఆదాయంలో వాటా లేదా వార్షిక ప్రీమియం రూపంలో ఆదాయం పొందే పద్ధతిలో ఏపీ మారిటైమ్ బోర్డు ప్రతిపాదించింది. 30 ఏళ్ల కాలపరిమితి, ఆపైన పొడిగించుకునే విధంగా బిడ్లను ఆహ్వానించింది.

బోట్ తయారీ, మరమ్మతులు కూడా..

1,250 బోట్లు నిలుపుకునే విధంగా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో 9ఎం ఎఫ్ఆర్‌పీ రకం బోట్లు 1,000, 12 ఎం గిల్ నెట్టర్ బోట్లు 100, 15ఎం ట్రావెలర్ 100 బోట్లు, 24ఎం టూనా లాంగ్ లైనర్ బోట్లు 50 నిలుపుకునేలా హార్బర్‌ను తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడే బోట్ల తయారీ, మరమ్మతుల యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఏపీ మారిటైమ్ బోర్డు ప్రతిపాదించింది. ఇందుకోసం 5 ఎకరాల్లో బోట్ బిల్డింగ్ యార్డ్‌ను అభివృద్ధి చేయడానికి ఆసక్తి గల సంస్థల నుంచి టెండర్లను ఆహ్వానిస్తోంది. దీన్ని కూడా 30 ఏళ్ల కాలపరిమితికి లీజు రూపంలో ఇవ్వనుంది.

555 గ్రామాల్లో 6.3 లక్షల మంది మత్స్యకారులకు లబ్ధి

రాష్ట్రంలో మత్స్యకారులు చేపల వేట కోసం కుటుంబాలను వదిలి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే అవసరం లేకుండా సీఎం వైఎస్ జగన్ ఏకకాలంలో 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టారు. వీటి ద్వారా రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాల్లో 6.3 లక్షల మంది లబ్ధి పొందనున్నారు. కేవలం ఫిషింగ్ హార్బర్లు కట్టి వదిలేయడమే కాకుండా పట్టిన చేపలకు మంచి విలువతో పాటు స్థానిక మత్స్యకారులకు ఉపాధి లభించే విధంగా హార్బర్ ఆధారిత పరిశ్రమలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి ఫిషింగ్ హార్బర్ వద్ద ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్, బోట్ బిల్డింగ్ యార్డ్‌లతో పాటు ఇతర అవకాశాలను కూడా పరిశీలిస్తున్నాం. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా జువ్వలదిన్నె వద్ద ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్‌తోపాటు బోట్ బిల్డింగ్ యార్డ్ ఏర్పాటుకు టెండర్లు పిలిచాం. ఈ హార్బర్‌ను నవంబర్‌లో ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. అలాగే హార్బర్ల వద్ద పర్యాటకంగా ఉండే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నాం.

– ప్రవీణ్ కుమార్, సీఈవో, ఏపీ మారిటైమ్ బోర్డు, వీసీ–ఎండీ, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ

క్లుప్తంగా...

14, 15 తేదీల్లో ఎస్‌ఐ మెయిన్స్

హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు 12వ తేదీ వరకు అవకాశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్‌ఐ పోస్టుల భర్తీ కోసం ఈనెల 14, 15 తేదీల్లో మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని పోలీస్ నియామక మండలి నిర్ణయించింది. ఆబ్జెక్టివ్ విధానంలో రెండు పేపర్లు, డిస్క్రిప్టివ్ విధానంలో రెండు పేపర్లలో పరీక్షలు నిర్వహిస్తారు. మెయిన్స్‌కు మొత్తం 31,193 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. వారిలో పురుషులు 27,590 మంది, మహిళలు 3,603 మంది ఉన్నారు. మెయిన్స్ పరీక్షలను విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, కర్నూలు కేంద్రాల్లో నిర్వహించనున్నారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను ఈ నెల 6 నుంచి 12 వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని రాష్ట్ర పోలీసు నియామక మండలి చైర్మన్ అతుల్ సింగ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు పేపర్–1(డిస్క్రిప్టివ్), మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 వరకు పేపర్–2(డిస్క్రిప్టివ్) నిర్వహిస్తారు. 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు పేపర్–3(ఆబ్జెక్టివ్), మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు పేపర్–4(ఆబ్జెక్టివ్) నిర్వహించనున్నారు. slprb. ap. gov. in వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏమైనా సందేహాలుంటే 9441450639, 9100203323 నంబర్లను లేదంటే ఈమెయిల్ mail& slprb@ap.gov.in ద్వారా సంప్రదించవచ్చు.

చంద్రబాబు రిమాండ్ 19 వరకు పొడిగింపు

- ఏసీబీ న్యాయస్థానం ఉత్తర్వులు
- జైలు నుంచి వర్చువల్ విధానంలో కోర్టు ఎదుట బాబు హాజరు

సాక్షి, అమరావతి/సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు జ్యుడిషియల్ రిమాండ్‌ను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఈ నెల 19 వరకు పొడిగించింది. ఈ కేసులో నిందితుడైన చంద్రబాబును గత నెల 9వ తేదీన సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. 10వ తేదీ నుంచి ఆయనకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. అప్పటి నుంచి ఆయన రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆయనకు గత నెల 24న రిమాండ్‌ను న్యాయస్థానం పొడిగించింది. ఆ గడువు ముగియడంతో ఆయన్ని గురువారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి వర్చువల్ విధానంలో విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. ఆయన రిమాండ్‌ను పొడిగించాలని కోరుతూ సీఐడీ అధికారులు అప్పటికే మెమో దాఖలు చేశారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం చంద్రబాబు రిమాండ్‌ను మరో 14 రోజులు అంటే ఈ నెల 19 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు చంద్రబాబుతో కుటుంబ సభ్యుల ములాఖత్

సాక్షి, రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో జ్యుడిషియల్ రిమాండ్ అనుభవిస్తున్న మాజీ సీఎం చంద్రబాబుతో కుటుంబ సభ్యులు శుక్రవారం ములాఖత్ కానున్నారు. ఆయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి జైల్లో బాబును కలవనున్నట్లు సమాచారం. బాబుతో లోకేశ్ ములాఖత్ అవడం ఇది మూడోసారి. సుమారు 40 నిమిషాలు వారు బాబుతో మాట్లాడే అవకాశం ఉంది. గత 24 రోజులుగా ఢిల్లీలో చోటు చేసుకున్న పరిణామాలు, పార్టీ వ్యవహారాలు, రాష్ట్రంలో పార్టీ పరిస్థితిపై వారు చర్చించనున్నట్లు సమాచారం. అనంతరం రాజమండ్రిలోని లోకేశ్ శిబిరం వద్ద జనసేన, టీడీపీ నేతలతో సమావేశం కానున్నారు. ఇదిలా ఉంటే భువనేశ్వరిని నిమ్మకూరు గ్రామస్తులు కలిసి సంఘీభావం తెలిపారు.

బాబు పాపం వెలుగులోకి వస్తుంది

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



సాక్షి, న్యూఢిల్లీ: తాను చేసిన అవినీతి ఏంటో చంద్రబాబుకు తెలుసని.. 'చీకట్లో చేసిన పాపం' తప్పకుండా వెలుగులోకి వస్తుందన్నారు. దోచుకున్న డబ్బు ఎలా దాచుకోవాలా అని బాబు చూస్తున్నారని ఆరోపించారు. ఆయన బెయిల్ కోసం దేవుడిని ప్రార్థించుకోవాలన్నారు. గురువారం ఢిల్లీలో కేఏ పాల్ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు తాను జైలుకు వెళ్లను అని భావించారని తెలిపారు. టీడీపీ నుంచి బీజేపీలోకి వెళ్లిన తన వారు కాపాడతారని ఆయన అనుకున్నారన్నారు. అలాగే ప్యాకేజీ స్టార్ కూడా తనను అరెస్ట్ నుంచి కాపాడతారని భావించారని చెప్పారు. అయితే పవన్ కళ్యాణ్‌కి బీజేపీ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. 'ఢిల్లీ అధిష్టానం' జోక్యంతోనే చంద్రబాబు అరెస్టు జరిగిందన్నారు. చిరంజీవి కాంగ్రెస్‌కి అమ్ముడుపోతే పవన్ చంద్రబాబుకు అమ్ముడుపోయారని విమర్శించారు. బీజేపీకి చంద్రబాబు, కేసీఆర్, జగన్ సరెండర్ అయ్యారని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను, అమ్మకాన్ని తానే ఆపానని చెప్పారు. తాను బీజేపీకి అమ్ముడుపోలేదని.. ఇప్పటికీ ఆ పార్టీ విధానాలను వ్యతిరేకిస్తున్నానని తెలిపారు. తనకు బీజేపీ కేంద్ర మంత్రి పదవిని ఆఫర్ చేసిందని.. అయితే తనను కొనే డబ్బు ప్రపంచంలోనే లేదన్నారు.

వెంచర్ల వంచన

గత ప్రభుత్వ హయాంలో సీఆర్‌డీఏ పరిధిలో వందలాది అక్రమ లేఅవుట్లు

- అద్భుత నగరం ఆవిష్కృతమవుతుందని తప్పుడు ప్రచారం
- రెరా, సీఆర్‌డీఏ అనుమతులు తీసుకోని వెంచర్ల యజమానులు
- అన్నీ ఉన్నట్లుగా వినియోగదారులను నమ్మించిన వైనం
- తప్పుడు ఎల్పీ నంబర్లతో మోసం
- ఆకట్టుకొనే డిజైన్లు, ప్రచారాన్ని చూసి ముచ్చటపడిన వినియోగదారులు
- భవన నిర్మాణానికి అనుమతులు రాకపోవడంతో మోసం బట్టబయలు
- సీఆర్‌డీఏకు పలు ఫిర్యాదులు
- 1,567 అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకుంటున్న సీఆర్‌డీఏ
- వీటిలో ప్లాట్లు కొంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరికలు
- అక్రమంగా వెలసిన 3,072 నిర్మాణాలపైనా చర్యలు

సీఆర్డీఏ పరిధిలోని గుంటూరు జిల్లా వెంగళాయపాలెంలో 2020లో 5.50 ఎకరాల్లో కొందరు లే అవుట్ వేశారు. ఈ ప్రాంతం నగర శివారులో ఉండడం, కొత్తగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం కావడంతో సమీపంలోనే ఓ భారీ కంపెనీ వస్తున్నట్టు ప్రచారం చేసుకున్నారు. దాంతో పలువురు ప్లాట్లు కొన్నారు. వాటిల్లో నిర్మాణాలు చేపట్టాలని సీఆర్డీఏకి దరఖాస్తు చేసుకుంటే అసలు ఆ లేఅవుట్‌కు అనుమతి లేదని తేలింది. దాంతో ప్లాట్లు కొన్న వారు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. ఇదే కాదు.. సీఆర్డీఏ పరిధిలోని గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఇలాంటి లేఅవుట్లు చాలా వెలిశాయి. వాటి తొలగింపునకు సీఆర్డీఏ అధికారులు చర్యలు ప్రారంభించారు. వీటిలో ఎవరూ ప్లాట్లు కొని మోసపోకుండా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.



లాం పంచాయతీ పరిధిలో వేసిన అనధికార లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డు

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని పేరు చెప్పి ప్రజలను ఎన్ని రకాలుగా మోసం చేయాలో అన్ని రకాలుగా మోసం చేశారు. ఇందులో అక్రమ లేఅవుట్లు కూడా ప్రధాన పాత్ర పోషించాయి. అమరావతి రాజధాని నెపంతో రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ)ని ఏర్పాటు చేశారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని దాదాపు మొత్తం ప్రాంతాన్ని దీని పరిధిలోకి తెచ్చారు. ఈ ప్రాంతంలో అనేకానేక ప్రాజెక్టులు వస్తాయని ప్రచారం చేశారు. దీంతో ఈ రెండు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఇబ్బడిముబ్బడిగా రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిశాయి. ఎక్కడ స్థలం కనిపిస్తే అక్కడో లేఅవుట్ వేశారు. వీటిలో దాదాపు అన్నీ అక్రమంగా, అనుమతి లేకుండా వేసినవే. వీటికోసం ప్రచారం ఘనంగా చేశారు. కళ్లు చెదిరే నిర్మాణాలు, అంతర్జాతీయ పరిశ్రమలు వస్తున్నాయని ఊదరగొట్టారు. భారీగా అభివృద్ధి జరిగిపోతున్నట్లు గ్రాఫిక్స్ చూపించారు. దీంతో అనేక మంది ఇక్కడ ప్లాట్లు కొన్నారు. ధర ఎంత అన్నది చూడకుండా కొనేశారు. వీటిలో ఇళ్లు కట్టుకొనేందుకు అనుమతుల కోసం దరఖాస్తు చేయగా.. ఆ లేఅవుట్లకు అసలు అనుమతులే లేవని సీఆర్డీఏ అధికారులు వాటిని తిరస్కరించారు. దీంతో మోసం బయటపడింది. ప్లాట్లు కొనుక్కున్న వారు కన్నీటిపర్యంతమవుతున్నారు.

సీఆర్డీఏ పరిధిలో భారీ ప్రాజెక్టులు వస్తున్నాయని, అద్భుత నగరం ఆవిష్కృతమవుతుందని గత ప్రభుత్వ హయాంలో ప్రచారం చేసి ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో వందలాది వెంచర్లు వేశారు. విజయవాడ, గుంటూరు నగరాల మధ్య, అమరావతి – గుంటూరు మధ్య జాతీయ రహదారికి ఇరువైపులా, విజయవాడ పరిసర ప్రాంతాల్లోని ఇబ్రహీంపట్నం, నున్న, గన్నవరం, కంకిపాడు ప్రాంతాల్లో, చిలకలూరిపేట సమీపంలో.. ఇలా సీఆర్డీఏ పరిధిలోని 19 నియోజకవర్గాల్లో లేఅవుట్లు వేశారు. వీటిలో దాదాపు అన్నీ అనుమతుల్లేకుండా అక్రమంగా వేసినవే. ఈ వెంచర్ల యజమానులు రెరా, సీఆర్‌డీఏ అనుమతులు తీసుకోకుండానే అవన్నీ ఉన్నట్టుగా మభ్యపెట్టారు. వేరే చోట అనుమతి ఉన్న లే అవుట్ల ఎల్పీ నంబర్లను ఇక్కడి వాటికి జోడించి కొనుగోలుదారులకు తప్పుడు సమాచారం అందించారు. ఆకట్టుకొనే డిజైన్లు, వారు చేసిన ప్రచారం, బ్రోచర్లను చూసి ముచ్చటపడిన వినియోగదారులు ఎక్కువ ధర అయినా కొనేశారు. విదేశాల్లో ఉన్న వారు కూడా చాలా మంది వీటిని కొనుగోలు చేశారు. ఆ తర్వాత వీటి మోసం బయటపడటంతో సీఆర్డీఏకు పలు ఫిర్యాదులు అందాయి. ఇలా వచ్చిన వాటిలో 2020 వరకు 1,469 లేఅవుట్లను అక్రమమైనవిగా గుర్తించి చర్యలు తీసుకున్నారు. ఇటీవల మరో 98 అక్రమ లేఅవుట్లను గుర్తించారు. వాటిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. సీఆర్డీఏ పరిధిలో అక్రమ లేఅవుట్లతో పాటు అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలు మరో 3,072 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిపైనా చర్యలు తీసుకుంటున్నారు. అక్రమ లేఅవుట్లు, అక్రమ నిర్మాణాల యజమానులకు నోటీసులు కూడా జారీ చేశారు. అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దని, అలా చేస్తే వచ్చే నష్టాలను వివరిస్తూ ఆ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటి వాటిని కొనుగోలు చేస్తే భవిష్యత్‌లో ప్రభుత్వ అనుమతులు మంజూరు కావని సీఆర్డీఏ అధికారులు హెచ్చరిస్తున్నారు.

గుర్తింపులేని లేఅవుట్లతో ఇబ్బందులు

సీఆర్‌డీఏ పరిధిలో ప్రభుత్వ అనుమతి లేని లేఅవుట్లు, నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నాం. ఇలాంటి వాటిలో ప్లాట్లు కొంటే భవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రావు. కొనుగోలుదారులు ప్లాటు కొనే ముందు రెరా, సీఆర్‌డీఏ అనుమతి, ఎల్పీ నంబర్ వంటివి సరిచూసుకోవాలి. సీఆర్‌డీఏ కూడా అన్ని ప్రభుత్వ అనుమతులు, సదుపాయాలతో లేఅవుట్లను నవులూరు, నూజివీడులో అభివృద్ధి చేసింది. ఏ వివరాలు కావాలన్నా వినియోగదారులు సీఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

– సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్

సీఆర్‌డీఏ లేఅవుట్లు సేఫ్

కొనుగోలుదారుల అవసరం మేరకు అన్ని అనుమతులు, సౌకర్యాలను కల్పించి సీఆర్డీఏనే సొంతంగా లేఅవుట్లు వేస్తోంది. నవులూరు, నూజివీడులో ప్లాట్లను అభివృద్ధి చేసి, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ ఉద్యోగులకు రాయితీ సైతం కల్పిస్తోంది. ఇలా నవులూరులో 386 ప్లాట్లు అభివృద్ధి చేయగా ఇప్పటికే 164 అమ్ముడయ్యాయి. మిగిలిన ప్లాట్లలో 10 శాతం ప్రభుత్వ అవసరాలకు మినహాయించి 180 ప్లాట్ల వరకు ఈ–లాటరీకి ఏర్పాట్లు చేసింది. నూజివీడులోనూ సీఆర్‌డీఏ 40.78 ఎకరాల్లో 393 ప్లాట్లను అభివృద్ధి చేసింది.



ఇటీవల నున్న సమీపంలో వ్యవసాయ భూమిలో వేసిన అనధికార లే అవుట్‌ను తొలగిస్తున్న సీఆర్డీఏ అధికారులు

'స్కిల్ స్కామ్' సూత్రధారి, లబ్ధిదారు చంద్రబాబే

- ఆధారాలతో సహా ఏసీబీ కోర్టుకు వివరించిన అదనపు ఏజీ సుధాకర్ రెడ్డి
- కొల్లగొట్టిన రూ.371 కోట్లలో రూ.27 కోట్లు టీడీపీ ఖాతాకు చేరాయని వెల్లడి
- ఆ రికార్డులను న్యాయస్థానానికి సమర్పించిన అదనపు ఏజీ
- మిగిలిన నిధులూ షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకే చేరాయని స్పష్టీకరణ
- కీలక దశలో దర్యాప్తు.. కాబట్టి బాబుకు బెయిల్ ఇవ్వొద్దని వినతి
- విచారణ నేటికి వాయిదా



సాక్షి, అమరావతి : టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.371 కోట్లు కొల్లగొట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడే ప్రధాన సూత్రధారి, లబ్ధిదారు అనేందుకు ఆధారాలను సీఐడీ ఒక్కొక్కటిగా కోర్టు ముందుంచుతోంది. ఈ కుంభకోణంలో కొల్లగొట్టిన సొమ్ములో రూ. 27 కోట్లు టీడీపీ బ్యాంకు ఖాతాకు చేరిన బ్యాంకు స్టేట్‌మెంట్లు, రికార్డులను సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి గురువారం ఏసీబీ న్యాయస్థానం ముందుంచారు. ఈ కుంభకోణం ప్రధాన సూత్రధారి, లబ్ధిదారు చంద్రబాబేనని ఏఏజీ స్పష్టంచేశారు. దారి మళ్లించిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకే చేరాయని చెప్పారు. అందులో రూ.27 కోట్లు టీడీపీ బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయని చెబుతూ ఆ రికార్డులను న్యాయస్థానానికి సమర్పించారు. కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్న ప్రస్తుత తరుణంలో చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయకూడదని న్యాయస్థానాన్ని కోరారు.

ఈ కుంభకోణం కేసులో అరెస్టయి రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం వరుసగా రెండో రోజు గురువారం విచారించింది. సీఐడీ తరఫున ఏఏజీ సుధాకర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ కుంభకోణం ద్వారా అక్రమంగా తరలించిన నిధుల్లో రూ.27 కోట్లు టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకి చేరడం సాధారణ విషయం కాదని చెప్పారు. ఈ అంశంపై విచారించేందుకు టీడీపీ ఆడిటర్‌ను ఈ నెల 10న సీఐడీ విచారణకు పిలిచిందని తెలిపారు. ఈ కుంభకోణంలో మిగిలిన నిధులు కూడా షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు ఎలా చేరాయో వివరించారు. ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే నిధులు విడుదల చేశారని చెప్పారు. నిధుల విడుదలకు అప్పటి ఆర్థిక శాఖ కార్యదర్శి సునీత లిఖితపూర్వకంగా తెలిపిన అభ్యంతరాలను న్యాయస్థానానికి సమర్పించారు. ఈ కుంభకోణంపై సీఐడీ దర్యాప్తు కీలక దశలో ఉందన్నారు. ఈ తరుణంలో చంద్రబాబుకు బెయిల్ ఇస్తే సాక్షులను బెదిరించి కేసు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశాలున్నాయని తెలిపారు. నిధుల తరలింపులో కీలక పాత్ర పోషించిన చంద్రబాబు మాజీ పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌ను సీఐడీ విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇవ్వగానే ఆయన పరారైన విషయాన్ని మరోసారి న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు దారి మళ్లాయని గతంలో 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలం ఇచ్చిన అప్పటి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీవీ రమేశ్ ఇటీవల అందుకు భిన్నంగా వ్యాఖ్యలు చేస్తున్న విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. చంద్రబాబు సాక్షులను ప్రభావితం చేస్తున్నారనడానికి ఇవన్నీ ఉదాహరణలని చెప్పారు. దర్యాప్తు సక్రమంగా సాగి మొత్తం కుట్రను వెలికితీసే వరకూ చంద్రబాబుకు బెయిల్ ఇవ్వొద్దని కోరారు. రెండు రోజుల కస్టడీలో విచారణకు చంద్రబాబు సహకరించలేదని, అందువల్ల ఆయన్ని మరోసారి కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అనుమతించాలని కోరారు.

చంద్రబాబు తరఫున ఢిల్లీ నుంచి వచ్చిన న్యాయవాది ప్రమోద్ కుమార్ దూబే వాదనలు వినిపిస్తూ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఒప్పందంతో అప్పటి సీఎం చంద్రబాబు పాత్ర ముగిసిందని, ఆ తరువాత జరిగే అవినీతి, అక్రమాలతో ఆయనకు సంబంధం లేదని అన్నారు. సాంకేతికంగా ఈ ప్రాజెక్టుతో చంద్రబాబుకు సంబంధం లేదన్నారు. సీఎం హోదాలోనే చంద్రబాబు నిధుల మంజూరుకు అనుమతించారని చెప్పారు. కాబట్టి చంద్రబాబును మరోసారి కస్టడీకి ఇవ్వొద్దని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. చంద్రబాబు బెయిల్, కస్టడీ పిటిషన్లపై ఇరువర్గాల వాదనలను శుక్రవారం కూడా వింటామని ఏసీబీ న్యాయస్థానం తెలిపింది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

చంద్రబాబు కనుసన్నల్లోనే 'ఫైబర్ గ్రిడ్' అక్రమాలు

- ప్రాజెక్టు రూపకల్పన మొదలు టెండర్ అప్పగింత వరకు బాబు పాత్ర ఉంది
- నాసిరకం సామగ్రి వాడి ఖజానాకు రూ.115 కోట్లు నష్టం చేకూర్చారు
- ఆ మొత్తాన్ని టెరాసాఫ్ట్ హరిప్రసాద్ మొదట తమ ఖాతాలకు మళ్లించారు
- ఆ తరువాత చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించారు
- మౌఖిక ఆదేశాలతో టెండర్ చివరి తేదీకి ముందు రోజు టెరాసాఫ్ట్‌ను బ్లాక్‌లిస్ట్ నుంచి తొలగించారు
- చంద్రబాబు బయట ఉంటే సాక్ష్యాలను తారుమారు చేస్తారు
- దర్యాప్తు కీలక దశలో ఉంది.. ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు
- హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్
- ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు



సాక్షి, అమరావతి : ఏపీ ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టులో అక్రమాలన్నీ అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కనుసన్నల్లోనే జరిగాయని హైకోర్టుకు సీఐడీ నివేదించింది. ప్రాజెక్టు రూపకల్పన మొదలు అమలు వరకు ప్రతి దశలో చంద్రబాబు పాత్ర ఉందని సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వివరించారు. చంద్రబాబు ప్రోద్బలంతోనే ప్రాజెక్టు వ్యయాన్ని రూ.333 కోట్లకు పెంచారని చెప్పారు. ఈ విషయాన్ని పలువురు వాంగ్మూలాల్లో స్పష్టంగా చెప్పారన్నారు. ఫైబర్‌గ్రిడ్ ప్రాజెక్టులో అక్రమాలపై సీఐడీ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ చంద్రబాబు హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి గురువారం మరోసారి విచారణ జరిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇరుపక్షాలు పోటాపోటీగా వాదనలు వినిపించాయి. వాదనలు పూర్తవడంతో తీర్పును రిజర్వ్ చేస్తూ జస్టిస్ సురేష్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

అంతకు ముందు ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. టెండర్ నిబంధనలు, ఒప్పందంలో నిర్దేశించిన ప్రమాణాలకు భిన్నంగా కాంట్రాక్టు సంస్థ నాసిరకం సామగ్రిని ఉపయోగించిందని, దీనివల్ల ఖజానాకు రూ.115 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. ఈ మొత్తాన్ని టెరాసాఫ్ట్ అధినేత, చంద్రబాబుకు సన్నిహితుడైన వేమూరి హరిప్రసాద్ తొలుత తన కుటుంబ సభ్యుల ఖాతాలకు, అక్కడి నుంచి చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించారన్నారు. ఈ విషయంలో మరిన్ని వివరాలను రాబట్టేందుకు చంద్రబాబును కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అసలు వేమూరి హరిప్రసాద్ చంద్రబాబు సిఫారసుతోనే గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యుడు అయ్యారన్నారు. టెరాసాఫ్ట్‌కు లబ్ధి చేకూర్చేందుకే ఎలాంటి కారణం లేకుండా టెండర్ గడువును పొడిగించారని తెలిపారు. చంద్రబాబు కార్యాలయం మౌఖిక ఆదేశాలతో టెండర్ గడువు చివరి తేదీకి ముందు రోజు టెరాసాఫ్ట్‌ను బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించారని కోర్టుకు నివేదించారు. సంబంధిత శాఖకు ఇన్‌చార్జ్‌గా ఉన్న ఓ ఉన్నతాధికారి టెరాసాఫ్ట్‌కు ప్రాజెక్టు అప్పగించడంపై అభ్యంతరం తెలిపారని, దీంతో ఆయన్ని బదిలీ చేసి, నామమాత్రపు పోస్టు ఇచ్చారని తెలిపారు. చంద్రబాబు పాత్రకు సంబంధించి ప్రాథమిక దర్యాప్తులో ఆధారాలు లభించలేదని, ఆ తరువాత సీఐడీ పలువురు వాంగ్మూలాలను నమోదు చేసి, లోతైన దర్యాప్తు చేసిందన్నారు. దీంతో చంద్రబాబు పాత్రపై పలు ఆధారాలు లభించాయని, ఆయన్ని నిందితునిగా చేర్చామని అన్నారు. చంద్రబాబు కుమారుడు రెడ్ బుక్ పేరుతో అధికారులను బెదిరిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు చాలా పలుకుబడి కలిగిన వ్యక్తే కాక, బయట ఉంటే సాక్షులను ప్రభావితం చేసి, సాక్ష్యాలను తారుమారు చేయగల సమర్థత ఉన్న వ్యక్తి కూడానని కోర్టుకు వివరించారు. దర్యాప్తు కీలక దశలో ఉన్నందువల్ల ఈ కేసులో చంద్రబాబుకు ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని కోర్టును కోరారు. చంద్రబాబుపై కేసు నమోదు వెనుక ఎలాంటి రాజకీయ కారణాలు లేవన్నారు.

చంద్రబాబు లబ్ధి పొందినట్లు ఒక్క ఆధారం చూపలేదు

చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ.. సీఐడీ ఈ కేసు నమోదు చేసి రెండేళ్లయిందని, ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేయలేదని, చార్జిషీట్ దాఖలు చేయలేదని తెలిపారు. ప్రాజెక్టు వ్యయం పెంపు పూర్తిగా సంబంధిత శాఖ అంతర్గత విషయమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా చంద్రబాబు లబ్ధి పొందినట్లు సీఐడీ ఒక్క ఆధారం కూడా చూపడంలేదన్నారు. ఈ రెండేళ్లు చంద్రబాబు బయటే ఉన్నారని, ఒక్క సాక్షిని కూడా ప్రభావితం చేయలేదని చెప్పారు. కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ప్రభుత్వ ప్రోద్బలంతో సీఐడీ ఈ కేసు నమోదు చేసిందన్నారు. ప్రతి కేసులో చంద్రబాబును జైలులోనే ఉంచాలన్నది ప్రభుత్వ ఎత్తుగడగా కనిపిస్తోందన్నారు.

ఆటో అన్న.. నిజాయితీలో మిన్న



ఆటోడ్రైవర్ కట్టా సుబ్బయ్యకు రివార్డు అందిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు (సబర్బన్):తనకు దొరికిన రూ.లక్షల విలువైన బంగారు ఆభరణాల బ్యాగ్‌ను పోలీసులకు అప్పగించాడు ఓ ఆటో డ్రైవర్. ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్పీ మలికాగర్గ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒంగోలుకి చెందిన ఆటోడ్రైవర్ కట్టా సుబ్బయ్య (26) ఈ నెల 3వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో బస్టాండ్ సమీపంలో ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా.. రోడ్డుపై ఓ బ్యాగ్ కనిపించింది. దాన్ని తీసి చూడగా.. పెద్దమొత్తంలో బంగారు ఆభరణాలు కనిపించాయి. వెంటనే ఆ బ్యాగ్‌ను తీసుకెళ్లి ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. ఆ బ్యాగ్‌లో రూ.8.50 లక్షల విలువైన 21 సవర్ల బంగారు ఆభరణాలు ఉన్నాయి.

పోగొట్టుకున్న వ్యక్తికి అందజేత

ఆభరణాలను పోగొట్టుకున్నది ఎవరనే విషయంపై పోలీసులు ఆరా తీయగా.. ఒంగోలు మండలం కరవదికి చెందిన పాట్టీళ్ల భాస్కరరావు హైదరాబాద్‌లోని తన కుమార్తె వద్దకు వెళ్లేందుకు ఒంగోలు వచ్చి ఆ బ్యాగ్‌ను జారవిడుచుకున్నట్టు తేల్చారు. గురువారం అతడిని పిలిపించి.. జిల్లా ఎస్పీ మలికాగర్గ్ చేతుల మీదుగా బ్యాగ్ అప్పగించారు. తన నిజాయితీని చాటుకున్న ఆటోడ్రైవర్ కట్టా సుబ్బయ్యను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సుబ్బయ్యకు నగదు రివార్డు అందించారు.

మధ్యాహ్నం సూర్యుడు వాలినప్పటి నుండి, రాత్రి అయి చీకటి పడేవరకూ నమాజ్‌లను సలుపు. ప్రాతఃకాలంలో (నమాజ్‌లో ఖుర్‌ఆన్) పఠించు. ప్రాతఃకాల పఠనం (దేవదూతల ద్వారా) వీక్షింప బడుతుంది. – ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 6 అక్టోబర్ 2023

నలభయ్యారు రోజుల పండుగ!

నలభై ఆరు రోజులు... 48 మ్యాచ్‌లు... దేశంలోని 10 వేర్వేరు నగరాలు... 10 అంతర్జాతీయ క్రికెట్ జట్లు. ఒక క్రీడా సంరంభానికి ఇంతకు మించి ఇంకేం కావాలి? అక్టోబర్ 5న ఆరంభమైన ఐసీసీ పురుషుల క్రికెట్ వరల్డ్ కప్–2023 కచ్చితంగా మరో పెద్ద ఆటల పండుగ. ఒక పక్కన చైనాలో ఆసియా క్రీడోత్సవాల హంగామా సాగుతుండగానే మన గడ్డపై మరో సందడి మొదలైపోయింది. నాలుగేళ్ళకు ఓసారి సాగే అంతర్జాతీయ వన్డే ప్రపంచ కప్ షురూ అయింది. నిరుటి ఛాంపియన్ ఇంగ్లండ్ ఈసారీ బలమైన జట్టుగా ముందుకు వస్తుంటే, సొంతగడ్డపై సాగుతున్న పోటీలో కప్పు కొట్టాలనే ఒత్తిడి భారత జట్టుపై ఉంటుంది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్లు సైతం బలమైన పోటీదార్లుగా నిలుస్తుంటే, ఆఖరు నిమిషంలో తడబడతారనే పేరున్న దక్షిణాఫ్రికా జట్టు 'అనూహ్యమైన గెలుపుగుర్రం' కావచ్చని ఓ అంచనా. గత వరల్డ్ కప్‌లో లానే పోటీలో పాల్గొనే పది జట్లూ లీగ్ దశలో పరస్పరం తలపడే ఈ ప్రపంచపోటీ రానున్న నెలన్నర కాలంలో విస్తృత చర్చనీయాంశం కానుంది.

యాభై ఓవర్ల ఈ వన్డే మ్యాచ్‌ల వరల్డ్ కప్‌కు గతంలో 1987, 1996, 2011ల్లో భారత్ ఆతిథ్యమిచ్చింది. అయితే, అప్పుడు ఉపఖండంలోని ఇతర దేశాల సహ ఆతిథ్యంలో అవి సాగాయి. కానీ, ఈసారి పూర్తిగా మనమే ఆతిథ్యమిస్తున్నాం. సరిగ్గా దసరా, దీపావళి పండుగ సీజన్‌లోనే వరల్డ్ కప్ రావడంతో తమకు కలిసొస్తుందని ప్రకటనకర్తలు భావిస్తున్నారు. తమ ఉత్పత్తుల కొనుగోళ్ళు పెరుగుతాయని బ్రాండ్‌లన్నీ ఉత్సాహపడుతున్నాయి. దానికి తోడు ఆతిథ్య దేశం భారత్ కావడంతో ఉత్పత్తుల ప్రచారం మరింతగా జనంలోకి చొచ్చుకుపోతుందని భావిస్తున్నాయి. ఈ వాణిజ్య ప్రకటనల ఆదాయంలో సింహభాగం తాజా వరల్డ్ కప్‌కు అధికారిక మీడియా హక్కులున్న డిస్నీ స్టార్‌కు చేరుతుంది. పలు బ్రాండ్లు టీవీ, డిజిటల్ వేదికల్లో స్పాన్సర్‌షిప్ కోసం డిస్నీస్టార్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. నాకౌట్ మ్యాచ్‌ల వేళ టీవీలో 10 సెకన్ల ప్రకటన ఇప్పుడు రూ. 30 లక్షల పైనే అని వార్త. ఈ వరల్డ్ కప్‌తో ప్రయాణ, పర్యాటక, ఆతిథ్య, ఆహార రంగాలు ప్రధానంగా లబ్ధి పొందుతాయని నిపుణుల విశ్లేషణ. మ్యాచ్‌ల పుణ్యమా అని ఇప్పటికే విమాన టికెట్ల రేట్లు, హోటల్ బస రేట్లు భారీగా పెరిగాయి. దేశ స్టాక్ మార్కెట్‌పైనా గణనీయమైన ప్రభావం ఉంటుందని అంచనా.

సినిమా, క్రికెట్‌లంటే ప్రాణాలిచ్చే భారత్‌లో మామూలుగా అయితే, వన్డే క్రికెట్ వరల్డ్ కప్ అంటే చంద్రమండల యాత్ర అంత సంబరం ఉండాలి. విచిత్రంగా ఈసారి ఎందుకనో ఆ క్రేజు వ్యాపారంలోనే తప్ప వ్యవహారంలో కనిపించట్లేదు. మన దేశమే పూర్తిగా ఆతిథ్యమిస్తున్నప్పటికీ, తాజా కప్‌కు ముందస్తు హంగామా అంతగా లేదు. దాదాపు లక్షా 30 వేల మంది కూర్చొనే సౌకర్యంతో ప్రపంచంలోనే పెద్ద క్రికెట్ స్టేడియమ్‌గా పేరొందిన అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియమ్‌లో గురువారం అంతా కలిపి 20 వేల మంది కూడా లేరు. ఆది నుంచీ ఆన్‌లైన్‌లో కొనడానికి టికెట్లు దొరకలేదు గానీ, తీరా మ్యాచ్ రోజున మైదానమంతా ఖాళీగా ఉంది. లార్డ్స్‌లో గత 2019 వరల్డ్ కప్ ఫైనల్‌లో హోరాహోరీగా తలపడ్డ న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్ల మధ్య మ్యాచ్‌తో ఈ తాజా ప్రపంచ కప్‌ను ప్రారంభించారు. కానీ లాభం లేకపోయింది. భారత జట్టుతో తొలి మ్యాచ్ మొదలుపెడితే ఊపు వచ్చేదేమో! నిజానికి, 1999 నుంచి ఐసీసీ వరల్డ్ కప్‌గా పేరుబడ్డ ఈ పోటీల్లో ఆతిథ్యదేశం ఆరంభమ్యాచ్‌లో పాల్గొనడం ఆనవాయితీ. అదెందుకు మార్చారో తెలియదు.

ఈసారి మ్యాచ్ టికెట్ల కొనుగోలు అసాధ్యమైపోయింది. ఆఖరి నిమిషంలో మ్యాచ్‌ల తేదీలు, వేదికలు మారిపోయాయి. ఇవి చాలదన్నట్టు 2000లల్లో టీ20 మ్యాచ్‌లకు అలవాటు పడ్డ కొత్త తరానికి ఐపీఎల్ సరికొత్త నంబర్ వన్ టోర్నమెంట్‌గా అవతరించింది. వెరసి, 2011లో భారత్ ఆతిథ్యమిచ్చినప్పటితో పోలిస్తే పన్నెండేళ్ళ తర్వాతి ఈ వరల్డ్ కప్ ఆ స్థాయి హడావిడి సృష్టించట్లేదు. అలాగే, గతంలో వరల్డ్ థీమ్‌సాంగ్ ప్రతి ఛానల్‌లో మోత మోగేది. ఈసారి రణ్‌బీర్ సింగ్‌తో చేసిన 'దిల్ జష్న్ బోలే...' పాట విఫలమైంది. ఇక, మైదానం వెలుపల అవలక్షణాలకు కొదవ లేదు. ఐసీసీ వార్షిక ఆదాయంలో భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ (బీసీసీఐ) వాటా 72 శాతానికి పెరిగింది. మిగతా దేశాల క్రికెట్ బోర్డులు బాగా వెనకబడ్డాయి. దాంతో, ఎప్పటిలానే బీసీసీఐ తన హజం చూపిస్తోంది. బీసీసీఐ అక్రమాలకు నెలవంటూ సుప్రీమ్ కోర్ట్ వేసిన ముగ్గురు సభ్యుల సంఘం నివేదిక లోపాలెత్తిచూపినా అది తన పంథా మార్చుకోలేదు. చిత్రంగా అధికారిక అమ్మకాలు మొదలైనా కాక ముందే టికెట్లు 'అమ్ముడైపోయాయి' అని బోర్డులు వెలిశాయి. మచ్చుకు, అహ్మదాబాద్‌లోని అదే భారీ స్టేడియమ్‌లో జరిగే భారత – పాకిస్తాన్ మ్యాచ్‌కు 8500 టికెట్లే అమ్మకానికి పెట్టారంటే ఏమనాలి?

భారీ క్రికెట్ వేదికలైన ముంబయ్, కోలకతాలను వెనక్కినెట్టి, ఈసారి అహ్మదాబాద్ ముందుకు రావడంలోనూ రాజకీయాలు కనిపిస్తున్నాయి. ఆటకు సంబంధం లేని ఇతర ప్రయోజనాలను పక్కనపెట్టి, భారత్ తన ప్రతిష్ఠను పెంచుకోవడానికి ఇది మరో అవకాశం. జీ20 సదస్సు నిర్వహణ తర్వాత అంతర్జాతీయ వేదికపై మరోసారి మన పేరు మోగడానికి మంచి సందర్భం. దాన్ని చేజార్చుకోకూడదు. 1975లో మొదలైనప్పటి నుంచి ఆతిథ్య దేశాలేవీ కప్ గెల్చుకోలేదన్న వాదనను 2011 ఏప్రిల్‌లో మన ధోనీ సేన సమర్థంగా తిప్పికొట్టింది. తర్వాత 2015లో ఆస్ట్రేలియా, 2019లో ఇంగ్లండ్‌లు అదే బాటలో నడిచాయి. కోహ్లీ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా లాంటి బ్యాట్స్‌మన్లు, బుమ్రా, షమీ, షిరాజ్ లాంటి పేసర్లు, అశ్విన్, కుల్దీప్ యాదవ్ లాంటి స్పిన్నర్లతో పటిష్ఠమైన రోహిత్ సేన ఆ కథ పునరావృతం చేయాలని ఆశ. రాజకీయాల కన్నా ఆట, వ్యక్తిగత రికార్డుల కన్నా దేశం గొప్పదని గ్రహిస్తే, నిర్వాహకులైనా, ఆటగాళ్ళైనా అద్భుతాలు చేయడం అసాధ్యమేమీ కాదు!

ఆకలిపై పోరాటం జరిపిన శాస్త్రవేత్త

సందర్భం



దేవీందర్ శర్మ

ఆయనను తరచుగా భారతదేశ హరిత విప్లవ పితామహుడిగా కీర్తిస్తారు. ఘనత వహించిన శాస్త్రవేత్త–వ్యవహర్త అయిన ప్రొఫెసర్ ఎం.ఎస్. స్వామినాథన్‌కు 'వరల్డ్ ఫుడ్ ప్రైజ్' తొలి అవార్డు వచ్చినప్పుడు, ఆయన్ని అప్పటి ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ కర్ట్ వాల్డ్‌హీమ్ ఒక లేఖలో 'లివింగ్ లెజెండ్' అని ప్రశంసించారు. స్వామినాథన్ మరణంతో ఒక శకం ముగిసింది. 'ఓడ నుండి నోటికి' అనే దుర్భర స్థితిలో ఉండిన దేశం ఆయన మార్గదర్శకత్వంలో వ్యవసాయంలో అద్భుతమైన విజయం సాధించింది. హరిత విప్లవ రూపశిల్పి అయినప్పటికీ ఎరువులు అధికంగా వాడితే కలిగే ప్రతికూల పరిణామాలు ఆయనకు తెలుసు. అలాగే రైతు క్షేమాన్నే ఎల్లవేళలా తలిచారు.

'హరిత విప్లవ చరిత్ర వాస్తవానికి నాటి ప్రధాని ఇందిరా గాంధీతో కలిసి నేను చేసిన అరగంట కారు ప్రయాణంలో లిఖితమైంది,' అని ఒకసారి స్వామినాథన్ నాతో చెప్పారు. వ్యవసాయ విప్లవానికి మద్దతు ఇవ్వడానికి కావలసిన రాజకీయ సంకల్పాన్ని పొందడం ఎంత కష్టమనే నా ప్రశ్నకు ఆయన జవాబిస్తూ, అప్పటి ప్రధాని ఇందిరా గాంధీతో కలిసి న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా పూసా కాంప్లెక్స్‌లో ఒక భవన ప్రారంభోత్సవానికి వెళ్లిన సంగతిని గుర్తు చేసుకున్నారు. దారిలో ప్రధాని ఆయన్ని అడిగారు: ''స్వామీ, మీరు చెబుతున్న కొత్త గోధుమ పొట్టి వంగడాల రకాలకు నేను అనుమతిస్తాను. కానీ, కొన్నేళ్లలో ఒక కోటి టన్నుల మిగులు గోధుమలు చూపుతానని మీరు నాకు మాటివ్వగలరా? ఈ 'బ్లడీ అమెరికన్ల' హింస నాకు తప్పాలి.'' స్వామినాథన్ మాటిచ్చారు, తర్వాతిదంతా చరిత్ర!

'ఓడ నుండి నోటికి' అనే దుర్భర స్థితిలో ఉండిన దేశం అనంతరం వ్యవసాయంలో అద్భుతమైన విజయం సాధించింది. భారతదేశాన్ని స్వయం సమృద్ధ దేశంగానే కాకుండా, నికర ఎగుమతిదారుగా మార్చింది. తగిన విధానాల ద్వారా మద్దతు లభ్యమైన హరిత విప్లవ వీరోచిత గాథ, ప్రధానంగా ఆకలి ఉచ్చు నుండి బయటపడే లక్ష్యంపై దృష్టి పెట్టింది. 1943 బెంగాల్ క్షామం తర్వాత కేవలం నాలుగు సంవత్సరాల లోపే స్వాతంత్ర్యం రావడంతో, ఆకలిని అధిగమించే సవాలు అప్పటికి ఎదుర్కోలేదు. దశాబ్దాలుగా, ఉత్తర అమెరికా నుండి పీఎల్–480 పథకం కింద భారత్‌కు ఆహారం వస్తూ ఉండేది.

1970ల మధ్య నాటికి భారతదేశంలోని సగం జనాభా కబేళాలకు దారి తీస్తుందని కొందరు నిపుణులు అంచనా వేశారు. ఆ తర్వాత దేశ క్షుద్బాధపై పోరాడేందుకు స్వామినాథన్ చేసిన తీవ్రాతితీవ్ర ప్రయత్నం, ప్రపంచం వీక్షించిన అత్యంత ముఖ్యమైన ఆర్థిక పరిణామాలలో ఒకటిగా చరిత్రలో నిలిచిపోతుంది. ఇది దేశంలోని కోట్లాది ప్రజల జీవితాలను మార్చడమే కాకుండా, మిగిలిన ప్రపంచానికి కూడా స్ఫూర్తిగా నిలిచింది.

హరిత విప్లవానికి రూపశిల్పిగా ఉన్నప్పటికీ కూడా, స్వామినాథన్‌కు వ్యవసాయంలో ఎరువులు అధికంగా వాడితే కలిగే ప్రతికూల పరిణామాల గురించి తెలుసు. ఆయన ప్రతి కోణంలోనూ దూరదృష్టి గలవారు. రాబోయే పరాజయం గురించి అనేకసార్లు ముందే హెచ్చరించారు. హరిత విప్లవం ప్రారంభమైన కొన్ని సంవత్సరాల తర్వాత, 1968 లోనే ఆయన ఇలా రాశారు: ''నేల సారాన్ని, నేల నిర్మాణాన్ని పరిరక్షించకుండా భూమిపై తీవ్ర ఒత్తిడి కలిగించే సేద్యం చేయడం అంతిమంగా ఎడారుల పుట్టుకకు దారి తీస్తుంది. పురుగు మందులు, శిలీంధ్ర (ఫంగస్) సంహారిణులు, కలుపు సంహారకాలను విచక్షణారహితంగా ఉపయోగించడం వలన ధాన్యాలు లేదా ఇతర తినదగిన భాగాలలో చేరే విషపూరిత అవశేషాల వల్ల క్యాన్సర్, ఇతర వ్యాధులకు సంబంధించిన ప్రతికూల మార్పులు సంభవించవచ్చు. భూగర్భ జలాలను అశాస్త్రీయంగా తోడిపారేయడం వల్ల ఈ అద్భుతమైన మూలధన వనరు వేగంగా తరిగిపోతుంది.''



ప్రొఫెసర్ ఎం.ఎస్. స్వామినాథన్

ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ ధాన్య పరిశోధనా సంస్థ (ఐఆర్‌ఆర్‌ఐ) డైరెక్టర్ జనరల్‌గా స్వామినాథన్ ఉన్న సమయంలోనే ఇండోనేషియా అధ్యక్షుడు సుహార్తో నుంచి ఆయనకు అసాధారణ కబురు వచ్చింది. ఇండోనేషియా వరి పంటను బ్రౌన్ ప్లాంట్‌హాపర్ తెగులు నాశనం చేయడంతో, స్వామినాథన్ ఒక పరిష్కార మార్గాన్ని అందించాలని సుహార్తో కోరారు. ఇండోనేషియాకు వెళ్లిన శాస్త్రవేత్తల బృందాన్ని ఒకచోట చేర్చి, వారికి మరిన్ని శక్తిమంతమైన పురుగు మందులను ఉపయోగించాలని సూచించడానికి బదులుగా, వరి పంటపై ఉపయోగించే పురుగు మందులను నిషేధించాలని సుహార్తోకు స్వామినాథన్ సలహా ఇచ్చారు. అదే సమయంలో సమీకృత తెగులు నిర్వహణను ప్రారంభించాలని చెప్పారు. సుహార్తో అధ్యక్ష హోదాలో 57 పురుగు మందులను నిషేధించారు.

ప్రొఫెసర్ స్వామినాథన్ టెక్నాలజీని గుడ్డిగా విశ్వసించేవారు కాదని చాలామందికి తెలియదు. జన్యుమార్పిడి పంటలకు వ్యతిరేకంగా ప్రచారం తారస్థాయికి చేరిన రోజుల్లో, బీటీ వంకాయల వాణిజ్యీకరణకు వ్యతిరేకంగా తాత్కాలిక నిషేధం విధించడంపై అప్పటి పర్యావరణ మంత్రి జైరాం రమేష్‌కు ఆయన ప్రతిస్పందన గమనించదగ్గది. చెన్నైలోని ఎం.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో జరిగిన ఒక సమావేశంలో, ఆయన ఒక మునగకాయ స్లైడ్‌ను ప్రదర్శించి, ఆ తర్వాత 'విటమిన్ ఏ'ని కలిగిన జన్యుమార్పిడి బియ్యం ఆవశ్యకతపై ఒక ప్రశ్నను సంధించారు. అన్నంతోపాటు కలిపి వండిన మునగ ఆకులు మన సాంప్రదాయ ఆహారంలో భాగమనీ, ఇవి తమకు తాముగా విటమిన్ ఏ అందించగలవనీ ఆయన ఉద్దేశ్యం. స్వామినాథన్ పదే పదే లేవనెత్తిన పర్యావరణ పరమైన ఆందోళనలను విధాన నిర్ణేతలు తగిన విధంగా పరిష్కరించినట్లయితే, భారతీయ వ్యవసాయరంగం తీవ్రమైన సంక్షోభంలో చిక్కుకునేది కాదు.

ఆయన అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రాల కన్సార్టియంకు చెందిన మొక్కల జన్యు వనరులపై సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్‌కు కూడా నాయకత్వం వహించారు. నేను ఆ సమయంలో మేధా సంపత్తి హక్కులపై సీజీఐఏఆర్ సెంట్రల్ అడ్వైజరీ బోర్డు సభ్యుడిని. ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులో ఉన్న మొక్కల జన్యు వనరులను ప్రైవేట్ కంపెనీలకు ఏకమొత్తంగా విక్రయించడాన్ని నిలువరించడంలో ఆయన పోషించిన పాత్ర గుర్తింపు పొందలేదు. ప్రపంచ జీవవైవిధ్యానికి చెందిన అపారమైన సంపదను ప్రైవేటీకరించడానికి జరిగిన ప్రతి ప్రయత్నాన్ని అడ్డుకోవడానికి ఆయన చేసిన తీవ్రమైన ప్రయత్నాలకు నేనే సాక్షిని.

స్వామినాథన్ 2004లో జాతీయ రైతుల కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమితులైనప్పుడు, కమిషన్ నివేదికకి చెందిన జీరో డ్రాఫ్ట్‌ను రాయమని నన్ను ఆహ్వానించారు. ఆ తర్వాత దేశవ్యాప్తంగా దానిపై చర్చించి, తుది నిర్ణయం తీసుకోవాలి. రైతును కేంద్ర స్థానంలో ఉంచి, ఆపై అతని పరిస్థితిని ఎలా మెరుగుపరచవచ్చో చూడాలని నాకు ఆదేశం ఇచ్చారు. అయితే కేవలం రైతుపై మాత్రమే దృష్టి పెట్టడం కాకుండా, వివిధ వాటాదారులను కూడా అందులో చేర్చాలని తర్వాత చెప్పినప్పుడు, నేను క్షమాపణలు చెప్పాను. అయితే, ఆ మొత్తం కాలం రైతులకు ఆదాయ భద్రత కల్పించడంపై స్వామినాథన్ దృష్టి సారించారు. ఆహారోత్పత్తిని పెంచడంలో రైతులు పోషిస్తున్న పాత్రను ఆయన అభినందించేవారు. కానీ రైతు సమాజం దుఃస్థితికి ఎప్పుడూ బాధపడేవారు.

2004, 2006 మధ్య ఐదు భాగాలుగా సమర్పించిన స్వామినాథన్ కమిషన్ నివేదిక, భారతీయ వ్యవసాయంలో ఉత్పాదకత, లాభదాయకత, స్థిరత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో రూపొందింది. ఇది దేశవ్యాప్తంగా రైతు సంఘాలకు కీలకమైన అంశంగా నిలుస్తోంది. సగటు(వెయిటెడ్ యావరేజ్) మీద 50 శాతం లాభం రైతులకు అందించాలన్న ఆయన సూచనను ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఈ గొప్ప దార్శనికుడికి దేశం అర్పించే అత్యుత్తమ నివాళి ఏమిటంటే, స్వామినాథన్ కమిషన్ నివేదికను అక్షరమక్షరం అమలు చేయడమే!

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ నిపుణులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఏం కానుందో!



అఫ్గాన్ వలసలందరినీ వెనక్కి పంపాలన్న పాకిస్తాన్ పథకానికి తాలిబన్ గట్టిగా ప్రతిస్పందిస్తోంది. తాలిబన్ రక్షణ మంత్రి ముల్లా యాకూబ్ దీన్ని అన్యాయం, క్రూరం, సహించలేని ఆటవికత అన్నారు. రానున్న రోజుల్లో పాకిస్తాన్‌కు పరిస్థితులు బాగున్నట్టు లేవు.

– సోనమ్ మహాజన్, పొలిటికల్ అబ్జర్వర్

సహనపు శిఖరం



క్రికెటర్ శిఖర్ ధవన్ మీద నా గౌరవం అమాంతం పెరిగింది. 11 ఏళ్లుగా విషపూరిత వివాహాన్ని తట్టుకున్నాడు. మారు తండ్రి అయినా తన మారు కూతుళ్లకు అన్నీ చూసుకున్నాడు. తన సొంత కొడుకును చూసుకోవడానికి పోరాటం చేశాడు. ఇన్ని ఒత్తిళ్లలోనూ నవ్వును కోల్పోలేదు. దేశానికీ, ఫ్రాంచైజ్ టీమ్స్‌కూ ఇవ్వాల్సినంత ఇచ్చాడు. ఇప్పటికైనా ఆ పెళ్లి నుంచి బయటపడ్డందుకు సంతోషం (విడాకులు మంజూరయ్యాయి).

– రోషన్ రాయ్, వ్యాఖ్యాత

మరో ఎమర్జెన్సీ



దిగ్భ్రమ! తమను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో కూడా జనానికి ఎఫ్ఐఆర్ కాపీ చూపరట. మోదీ రాజ్యంలో న్యాయ సూత్రాలు ఇంకా ఏమైనా మిగిలివున్నాయా? 1977 అత్యవసర పరిస్థితి కంటే ఇది దారుణంగా మారుతోంది.

– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

అనుభవ తత్వం



భారతదేశంలోని చాలామంది మధ్యతరగతి జీవులకు నిర్మాణంలో ఉన్న ఇంటిని కొనుగోలు చేసిన తర్వాత గానీ న్యాయ సంబంధ విద్య పట్టుబడదు.

– విశాల్ భార్గవ, రియల్ ఎస్టేట్ నిపుణుడు

రిస్కీ గేమ్



ఇండియా ప్రమాదకరమైన ఆట ఆడుతోంది. అది కెనడా పట్ల తన అసంతృప్తిని వెళ్లగక్కే సంకేతం ఇవ్వాలనుకుంటోంది. స్థూలంగా పాశ్చాత్య దేశాలకూ, మిగతా ప్రపంచానికీ మేము ఎదుగుతున్న శక్తి అని చాటాలనుకుంటోంది. కానీ బలహీనతలు స్థిరంగా ఉన్నప్పుడు దూకుడుతో కూడిన విదేశాంగ విధానంతో ఎదురుదెబ్బలు తగలొచ్చు.

– థామస్ జ్యూనో, అసోసియేట్ ప్రొఫెసర్

కొత్త పవర్



జనాభాలో ఇండియా ఈ ఏడాది చైనాను అధిగమించింది. అలాగే అది ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. పైగా మాంద్యపు సూచనలు ఏ కోశానా లేవు. ప్రస్తుతం ఇండియాకు పాశ్చాత్య దేశాల అవసరం కన్నా చైనాతో వ్యవహరించడానికి పాశ్చాత్య దేశాలకు ఇండియా అవసరం ఎక్కువ.

– వెలీనా చకరోవా, వ్యూహాత్మక అంశాల వ్యాఖ్యాత

ఎందుకు కుటుంబం?



కన్సల్టేషన్ కోసం తల్లిదండ్రులు తమ టీనేజ్ పిల్లల్ని వెంట తెచ్చుకుంటున్నప్పుడు నేనొకటి గమనిస్తున్నాను. తల్లిదండ్రులకు ఏమైందో చూడకుండా, వాళ్లు తమ ఫోన్లలో మునిగిపోతున్నారు. ఒక తండ్రితో ఆయనది క్యాన్సర్ అయివుంటుందేమోనని అంటున్నాను; వాళ్లబ్బాయి ఉదాసీనంగా ఫోన్ చూస్తున్నాడు. నన్ను పాతకాలపు మనిషి అనుకున్నాసరే, ఆ తండ్రి పట్ల బాధేసింది. చాలామందికి కుటుంబాలున్నాయి గానీ, అవి ఆచరణలో అనాథాశ్రమాలు.

– కార్తీక్ బాలచందర్, ఎండోక్రైనాలజిస్ట్

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.సప్తమి ఉ.9.11 వరకు, తదుపరి అష్టమి **నక్షత్రం:** ఆరుద్ర రా.12.44 వరకు, తదుపరి పునర్వసు **వర్జ్యం:** ఉ.8.19. నుండి 10.00 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.04 వరకు తదుపరి ప.12.13 నుండి 1.01 వరకు, **అమృతఘడియలు:** ప.2.11 నుండి 3.45 వరకు.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.44
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

ఇన్ బాక్స్

విస్తుగొలిపే వాస్తవాలు


బిహార్ రాష్ట్రం స్వతంత్ర భారతంలో కులాల లెక్కలు తీసిన మొదటి రాష్ట్రంగా నిలిచింది. 1931 తర్వాత జనాభా లెక్కల్లో కులం నమోదు కాలేదు. ఇంతకాలానికి మళ్లీ బిహార్ కులగణనకు పూనుకొని పూర్తిచేసింది. ఈ జనాభా లెక్కల ప్రకారం ఆ రాష్ట్రంలో 63 శాతం మంది బీసీలు ఉన్నారు. అందులో 36 శాతం మంది అత్యంత వెనుకబడిన వర్గాల వారే. సామాజిక, ఆర్థిక పరిస్థితులను బట్టి చూస్తే ఎనభై ఐదు శాతం మంది బలహీనులే అని తేలింది. ఈ తరహా గణన ద్వారా రాజకీయ పార్టీల ప్రాధాన్యతలు మారడం ఖాయం. ఇంతవరకూ దేశంలో వెనుకబడిన కులాలు 52 శాతం అనే ఉజ్జాయింపు లెక్కలున్నాయి. దేశ వ్యాప్తంగా కుల గణన జరిగితే ఆ శాతం పెరిగే అవకాశం ఎక్కువ. అప్పుడు వాటిననుసరించి విధానాలు అమలు చేయాలని డిమాండ్స్ పెరుగుతాయి.

జాతీయ స్థాయిలో అధికార పక్షానికి కుల గణనపై వ్యతిరేకత ఉంది. అయినా ఆ పార్టీ రాష్ట్ర శాఖ బిహార్‌లో కులగణనకు అనుకూలంగా మాట్లాడింది. ముందు ముందు దాదాపు అన్ని పార్టీలూ కులాల వారీ లెక్కలకు సానుకూలత వ్యక్తం చేస్తాయనిపిస్తోంది. అది మంచిది కూడా. భారత దేశం కుల రహిత సమాజంగా రూపు దిద్దుకోవాలనేది ఒక ఆదర్శం. అయినా అది ఇంకా చాలా దూరం. అంబేడ్కర్ మహాశయుడు అన్నట్టు మనం ఎటు తిరిగినా కనబడే భూతం కులం. అది వాస్తవం. ఏ కులాలు ఎన్ని ఉన్నాయో, అందులో కుదేలై ఉన్నవి ఎన్ని ఉన్నాయో సరైన లెక్కలుంటే అందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేసుకోవచ్చు. సరి చేసుకోవచ్చు. ఉజ్జాయింపు లెక్కల కన్నా వాస్తవ అంకెలు ఎప్పుడూ మెరుగైనవే. అయితే ఇన్నేళ్ళయినా జనాభాలో అధిక భాగం అత్యంత వెనుకబడిన వర్గాలుగా ఎందుకు మిగిలిపోయారన్నది ఆలోచిస్తే మంచిది.

– డా॥ డి.వి.జి. శంకరరావు; మాజీ ఎంపీ, పార్వతీపురం

ప్రజలను పక్కదారి పట్టించడానికే!

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

ఒక సమస్య వస్తే ఆ సమస్యకు పరిష్కారం కనుక్కోవాలి. కానీ ఆ సమస్య నుండి దృష్టి మరల్చడానికి అంతకంటే పెద్ద సమస్యను సృష్టించడం కొన్ని పార్టీలకు మామూలయిపోయింది. ఇలా ప్రజల దృష్టిని మరల్చడంలో బీజేపీ అందరి కంటె ముందుంది. అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతూంటే ఆ పార్టీ ఇప్పుడు దేశం పేరును మార్చడం ఒక అజెండాగా ఎన్నికల వేళ ముందడుగు వేస్తుందనిపిస్తోంది.

ఒకప్పుడు ఈ దేశం జంబూద్వీపంగా పిలువబడేది. ఈ దేశ మూలవాసులకు రాజైన ఆది జాంబవంతుని పరిపాలనలో మన భూభాగం ఉందని ఇతిహాసాలు చెబుతున్నాయి. ఇప్పటికీ ఏ శుభకార్యం జరిగినా 'జంబూద్వీపే, భరతవర్షే, భరతఖండే' అంటూ సంకల్పం చదవడం తెలిసిందే. అంటే ఈ దేశానికి ఆర్యులు రాకముందు దీని పేరు 'జంబూద్వీప'మే. ఈ జంబూ ద్వీపవాసులైన భారతీయులే ఆదిమ భారతీయులు. వీరే అద్భుతమైన సింధూ నాగరికతను నిర్మించారు. సింధు ప్రజలపై దండెత్తి వచ్చిన ఆర్యులు యజ్ఞయాగాది క్రతువులతో కూడిన విశ్వాస వ్యవస్థను నెలకొల్పారు. బుద్ధుడు దీన్ని నిరసించాడు. దుఃఖనివారణ ఔషధిగా బౌద్ధధర్మాన్ని ప్రపంచానికిచ్చాడు. 'ఐ యామ్ ఇండియన్' అన్న వ్యక్తితో ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పికాసో: 'ఓ యూ ఆర్ ఫ్రమ్ బుద్ధభూమి, బుద్ధాస్ కంట్రీ (మీరు బుద్ధభూమి, బుద్ధుని దేశం నుంచి వచ్చారా) అని అన్నాడు. అంటే భారతదేశం అంటే 'బుద్ధభూమి' అనేంతగా బుద్ధుడు ఈ దేశానికి పేరు తెచ్చాడు. అంటే జంబూద్వీపంగా ఉన్న గంగా సింధూ పరివాహక ప్రాంతం బుద్ధభూమి అయిందన్నమాట.

'ఇండియా' అనే పేరును వాడుకలోకి తీసుకువచ్చారు బ్రిటిష్‌వారు. ఆ పేరు ఎలా వచ్చిందనే విషయంపై కొంత పరిశోధన జరగాల్సి ఉంది. 'ఇండియా' పేరుతోనే ప్రపంచ వ్యాప్తంగా మనదేశానికి అత్యధిక గుర్తింపు ఉందనేది మరువరాదు. అటువంటి పేరును మార్చాలని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందనే విషయం ఇటీవలి పరిణామాలు రుజువు చేస్తున్నాయి.



ఈమధ్యే ముగిసిన 'జీ20' దేశాల శిఖరాగ్ర సమావేశాల సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రతినిధుల గౌరవార్థం ఏర్పాటు చేసిన విందుకు ఆహ్వానిస్తూ ఒక ఆహ్వాన పత్రం పంపారు. దానిపై 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' ఆహ్వానిస్తున్నట్లు పేర్కొనడం జరిగింది. సాధారణంగా ఇంగ్లిష్‌లో ఇన్విటేషన్ ఉంటే 'ఇండియా' అనీ, హిందీ వంటి భారతీయ భాషల్లో అయితే 'భారత్' అనీ దేశం పేరు ముద్రిస్తారు. కానీ ఈ సంప్రదాయాన్ని పక్కనపెట్టింది ప్రస్తుత భారత ప్రభుత్వం. జీ20 శిఖరాగ్ర సభా వేదికపై వివిధ దేశాధినేతలు, ఇతర ప్రతినిధులకు కేటాయించిన సీట్ల ముందు ఆయా దేశాల పేర్లు రాసి ఉంచిన నేమ్ బోర్డులు ఉంచారు. ఈ క్రమంలో మన దేశానికి సంబంధించినవారు కూర్చోవలసిన చోట 'భారత్' అని రాసిన నేమ్ ప్లేట్లు దర్శనమిచ్చాయి. అంటే ఈ అంతర్జాతీయ వేదిక మీద నుంచే త్వరలో మన దేశానికున్న 'ఇండియా' పేరును తొలగించి కేవలం 'భారత్' అని పిలిచేలా చర్యలు తీసుకోబోతున్నట్లు హిందూ జాతీయవాద బీజేపీ ప్రభుత్వం ఉప్పందించిందన్నమాట!

భారత రాజ్యాంగ ఇంగ్లిష్ ప్రతిలోని ప్రవేశికలో 'వియ్ ది పీపుల్ ఆఫ్ ఇండియా...' అని ఉంది. అలాగే రాజ్యాంగం మొదటి భాగంలో దేశం పేరు 'ఇండియా దట్ ఈజ్ భారత్...' అని పేర్కొనబడింది. అంటే ఇండియా అన్నా భారత్ అన్నా ఒకే అర్థంలో రాజ్యాంగ నిర్మాతలు ఈ పదబంధాన్ని ఉపయోగించారన్నమాట. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం ఇండియా అనే పేరు కనిపించకుండా చేయాలని సంకల్పించినట్లు అర్థమవుతోంది. ఇందుకు కారణం ఈసారి కాంగ్రెస్ నేతృత్వంలో ఎన్నికల బరిలోకి దిగుతున్న ప్రతిపక్షాల కూటమి పేరు 'ఇండియా' కావడమేనా? లేదా తన పేరులో ఉన్న భారతీయ పదాన్ని మాత్రమే దేశం పేరుగా ఉంచి జాతీయవాదాన్ని రేకెత్తించాలనా?

వ్యాసకర్త ప్రసిద్ధ కథారచయిత | 91829 18567

బుద్ధుడు – పతంజలి

బుద్ధుడు క్రీ.పూ. 6వ శతాబ్దివాడు కాగా, తరువాత వచ్చిన పతంజలి 2వ శతాబ్దివాడు. పతంజలి 'యోగసూత్రాలు' రచించే నాటికి బుద్ధుడి బోధనలు ప్రజల్లో ఇంకా ప్రచారంలో ఉనాయి. పతంజలి తన రచనావ్యాసంగమప్పుడు ఆ బోధనలను కూడా పరిగణన లోనికి తీసుకొని ఉండవచ్చు. ఆ కారణం చేత బుద్ధుడి బోధనలకు, పతంజలి యోగ సూత్రాల్లో చెప్పిన విషయాలకు పోలిక కనిపిస్తుంది.

బుద్ధుడి ప్రవచనాల్లో ముఖ్యమైనది దుఃఖం గురించినది. దుఃఖం, దుఃఖ సముదాయం, దుఃఖ నిరోధం, దుఃఖ నిరోధ మార్గం అనే నాలుగు ఆర్య సూత్రాలు దుఃఖం గురించినవే. బుద్ధుని ప్రకారం ప్రపంచం అంతటా దుఃఖమే పరుచుకుని ఉన్నది. సంతోషంలోనూ దుఃఖమే దాగి ఉన్నది. ఎలాగంటే, సంతోషం ఎప్పుడు అంతమవుతుందో అనే ఆందోళన సంతోషంగా ఉండనీయదు.



జ్యోతిర్మయం

సంయోగం చెందినవన్నీ వియోగం కాక తప్పదు. వియోగం దుఃఖ హేతువు. ఈ విధంగా సంతోషం కూడా పరిణామంలో దుఃఖంగా మారుతుంది. ఇదే విషయాన్ని పతంజలి తన 'యోగదర్శనం సాధనపాదం' 15వ సూత్రంలో 'దుఃఖమేవ సర్వం వివేకినః' అని చెబుతాడు. వివేకంతో యోచించే వానికి ప్రపంచమంతటా దుఃఖమే ఉన్నదని దీనర్థం.

సుత్తపిటకం 'అంగుత్తరనికాయం' ప్రకారం ఇతరుల యందు మైత్రీ భావన వంటి వాటిని దృఢంగా పెంపొందించుకున్న వానికి అనేక శక్తులు సమకూరుతాయి. విభూతి పాదం 23వ సూత్రంలో పతంజలి కూడా ఈ భావాన్ని' మైత్రి మొదలైన భావనల యందు సంయమము సిద్ధించిన వాని శక్తి అమోఘమవుతుంది' అని చెబుతాడు.

సుత్తపిటకం మధ్యమ నికాయంలో 'అజ్ఞాత్తసం పసాదో' అనే పదాన్ని ఆంతరంగిక ప్రశాంతత అనే అర్థంలో బుద్ధుడు వాడతాడు. సమాధి పాదం 47వ సూత్రంలో 'అధ్యాత్మ ప్రసాదః' అనే పదాన్ని అదే అర్థంలో పతంజలి 'నిర్విచార వైశారద్యే అధ్యాత్మ ప్రసాదః అని వాడాడు. ఎస్.ఎన్. టాండన్ బుద్ధవచనాలకు పతంజలి యోగసూత్రాలకు గల సామ్యం మీద ఈ వరకే ఇంగ్లీషులో ఒక గ్రంథాన్ని వెలువరించాడు.

– దీవి సుబ్బారావు

'పాణ్యం సిమెంట్స్'లో తమిళనాడు ఐటీ సోదాలు

బేతంచెర్ల (నంద్యాల): నంద్యాల జిల్లా సిమెంట్‌నగర్‌లోని పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీలో తమిళనాడు ఐటీ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. తమిళనాడుకు చెందిన పార్లమెంట్ సభ్యుడు జగద్‌రక్షన్ సంస్థ పాణ్యం సిమెంట్ పరిశ్రమలో 2021 జూలై నుంచి ఇప్పటి వరకు జరిగిన కంపెనీకి చెందిన పలు లావాదేవీలపై అధికారులు తనిఖీ చేసినట్లు సమాచారం. సోదాల్లో కర్నూలు జిల్లాకు చెందిన ఇద్దరు ఐటీ అధికారులు, తమిళనాడు నుంచి వచ్చిన నలుగురు ఐటీ అధికారులు పాల్గొన్నారు.

డ్రాప్ అవుట్.. నో చాన్స్!

ఈ విద్యా ఏడాదిలో బడి ఈడు పిల్లలందరూ బడుల్లోనే

38,677 మందిని తిరిగి బడిలో చేర్పించిన ప్రభుత్వం	తద్వారా బడి బయట ఉన్న పిల్లల గుర్తింపు
1వ తరగతి నుంచి 8వ తరగతిలోపు పిల్లల కోసం వలంటీర్ల సర్వే	మొత్తం 56,34,974 మంది విద్యార్థుల నమోదు



తిరిగి బడుల్లో చేరిన విద్యార్థులు

జిల్లా పేరు	సంఖ్య
వైఎస్సార్	7,252
అల్లూరి సీతారామరాజు	5,324
విశాఖపట్నం	3,839
అనకాపల్లి	3,703
ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు	2,666
తిరుపతి	2,633
పార్వతీపురం మన్యం	2,204
ఎన్టీఆర్	1,927
ప్రకాశం	1,465
శ్రీ సత్యసాయి	1,256
శ్రీకాకుళం	923
ఏలూరు	889
విజయనగరం	800
కృష్ణా	559
కాకినాడ	534
అంబేడ్కర్ కోనసీమ	472
పశ్చిమగోదావరి	341
అనంతపురం	307
నంద్యాల	269
అన్నమయ్య	264
పల్నాడు	261
చిత్తూరు	216
కర్నూలు	180
బాపట్ల	160
గుంటూరు	119
తూర్పు గోదావరి	114
మొత్తం	38,677



సాక్షి, అమరావతి: బడి ఈడు పిల్లలందరినీ బడుల్లోకి తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఫలితాలను ఇస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో (2023–24) ఇప్పటి వరకు గుర్తించిన 38,677 డ్రాప్ అవుట్ పిల్లలను తిరిగి బడుల్లో చేర్పించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో డ్రాప్ అవుట్ పిల్లలను తిరిగి బడుల్లో చేర్పించడం ఒక సూచికగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా బడి ఈడు పిల్లలందరినీ నూరు శాతం బడుల్లో చేర్పించేలా ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల కేంద్రంగా వలంటీర్ల ద్వారా ప్రత్యేకంగా 5 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలు బడుల్లో ఉన్నారా.. లేక బడి బయట ఉన్నారా అనే అంశంపై సర్వే నిర్వహించడం ద్వారా డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించారు. ఇప్పటి వరకు 38,677 మంది డ్రాప్ అవుట్ పిల్లలను తిరిగి బడుల్లో చేర్పించినట్లు ఇటీవల జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టం చేశారు. 1వ తరగతిలో చేరిన పిల్లలు ఆ మరుసటి సంవత్సరం రెండో తరగతి.. ఆ మరుసటి సంవత్సరం ఆపై తరగతిలో.. ఇలా 8వ తరగతి వరకు చేరుతున్నారా లేక మధ్యలో డ్రాప్ అవుట్ అవుతున్నారా.. అనే దానిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహణలో అసలు బడిలో చేరని, డ్రాప్ అవుట్, బాల కార్మికులను గుర్తించి వారి కోసం ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. పిల్లలను బడుల్లో చేర్పించడం ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించడం ద్వారా అవగాహన కల్పించే చర్యలను ప్రభుత్వం చేపట్టింది. తద్వారా బడి ఈడు పిల్లలందరూ బడుల్లో ఉండేలా ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంది. తద్వారా ఇప్పటి వరకు మొత్తం 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు స్కూల్స్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య 56,34,974కు చేరింది. ఈ విద్యా సంవత్సరంలో అత్యధికంగా 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు బడుల్లో చేరిన పిల్లలు కర్నూలు జిల్లాలో 3,78,564 మంది ఉండగా, ఆ తర్వాత అనంతపురం జిల్లాలో 3,06,667 మంది, నంద్యాల జిల్లాలో 2,29,280 మంది బడుల్లో చేరారు.

అవినీతి 'చక్రం'బాబాకు తగిన శాస్త్రి

1,103వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: తాను అధికారంలో ఉండగా.. అవినీతి అక్రమాలతో రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసిన చంద్రబాబుకు న్యాయస్థానాలు తగిన విధంగా బుద్ధి చెబుతున్నాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రూ.వేలకోట్లు వెచ్చించి లాయర్లను పెట్టుకున్నా.. స్కిల్ స్కాం కేసులో రిమాండ్ పొడిగించడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,103వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. 29 కేసుల్లో స్టేలు తెచ్చుకుని బయట తిరుగుతున్న గజదొంగ దేశంలో ఎవరైనా ఉన్నారంటే.. అది చంద్రబాబు నాయుడేనని అన్నారు. పక్కా ఆధారాలతో అవినీతి కేసుల్లో బాబు దొరికినా ఇన్నాళ్లూ వ్యవస్థలను మేనేజ్ చేసి తప్పించుకుని తిరుగుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశాడని మండిపడ్డారు. రాష్ట్రంలో మరే సమస్యలు లేనట్లు బాబు అరెస్టును మాత్రమే ఫోకస్ చేస్తున్న ఎల్లో మీడియా, కులవాదుల తప్పుడు ప్రచారాలను ప్రజలు ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మరన్నారు. అమరావతి ఉద్యమానికి తన రెండు గాజులిచ్చానని చెబుతున్న నారా భువనేశ్వరి రాష్ట్రంలో స్టీల్ ప్లాంట్ కోసం జరుగుతున్న ఉద్యమం, పేదల హక్కుల కోసం జరుగుతున్న బహుజన ఉద్యమం, ఇతర ప్రజా సమస్యల కోసం జరుగుతున్న ఉద్యమాలకు ఎందుకు విరాళాలు ఇవ్వలేదో చెప్పాలని ప్రశ్నించారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, పులి దాను తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు

వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉష



కొమ్మాది(భీమిలి): కళాకారులకు సీఎం జగన్ అత్యంత ప్రోత్సాహం కల్పిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉష స్పష్టం చేశారు. ప్రతి ఒక్క కళాకారుడికి త్వరలోనే గుర్తింపు కార్డులు ఇవ్వనున్నారని చెప్పారు. గురువారం ఎండాడలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. త్వరలోనే నాటక నంది అవార్డులను ప్రకటించనున్నట్లు తెలిపారు. వరుసగా రెండేళ్ల కరోనా కష్టకాలంలో అవార్డులు ఇవ్వలేకపోయారని, ఈ ఏడాది నుంచి అవార్డులు ప్రకటించనున్నట్లు చెప్పారు. స్కీమ్‌లు, స్కామ్‌లతో సతమతమవుతున్న చంద్రబాబు బాగోతాన్ని ప్రజలు చూస్తున్నారని అన్నారు.

చానల్‌ను మూసివేసి.. బైక్‌ను తగలబెట్టండి

- యూట్యూబర్ వాసన్ కేసులో పోలీసులకు మద్రాస్ హైకోర్టు ఆదేశం
- పబ్లిసిటీ కోసం యువతను రెచ్చగొట్టేవారికి ఈ కేసు ఓ గుణపాఠమని వ్యాఖ్య
- వాసన్‌కు బెయిల్ నిరాకరణ.. జైల్లోనే గాయాలకు చికిత్స అందించాలని ఆదేశం

సాక్షి, చెన్నై: పబ్లిసిటీ కోసం బైక్‌పై స్టంట్స్ చేస్తూ గాయపడిన ప్రముఖ యూ ట్యూబర్ టీటీఎఫ్ వాసన్‌పై మద్రాస్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అతడి బైక్‌ను దగ్ధం చేయాలని, యూట్యూబ్ చానల్‌ను మూసివేయాలని పోలీసులను ఆదేశించింది. సెప్టెంబర్ 17న చెన్నై–వేలూరు రహదారిపై బైక్‌పై స్టంట్స్ చేస్తూ వాసన్ ప్రమాదానికి గురై గాయపడ్డాడు. రోడ్లపై ఇతరులకు ఇబ్బంది కలిగిస్తూ బైక్‌తో రౌండ్స్ చేస్తోన్న వాసన్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పోలీసులు కేసు నమోదు చేసి వాసన్‌ను అరెస్ట్ చేశారు.ఈ క్రమంలో వాసన్ మద్రాస్ హైకోర్టులో బెయిల్ పిటిషన్ వేయగా..అది గురువారం న్యాయమూర్తి జస్టిస్ కార్తికేయన్ బెంచ్ ముందు విచారణకు వచ్చింది. ప్రచారం కోసం, పబ్లిసిటీ కోసం యువతను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే వారికి ఈ కేసు ఓ గుణపాఠంగా ఉండాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. వాసన్‌కు బెయిల్ నిరాకరిస్తూ..గాయానికి జైల్లోనే చికిత్స అందించాలని సూచించారు. కాగా, వాసన్ నడుపుతోన్న 'ట్విన్ త్రోట్లర్స్' యూట్యూబ్ చానల్‌కు 4.12 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు.

పోలేరమ్మ జాతర.. పోటెత్తిన భక్తజనం





వెంకటగిరిలో వైభవంగా ముగిసిన జాతర

సైదాపురం/వెంకటగిరి (తిరుపతి జిల్లా): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర గురువారం సాయంత్రం అత్యంత వైభవంగా ముగిసింది. ఐదురోజులపాటు నిర్వహించిన ఈ జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చి పోలేరమ్మ తల్లిని దర్శించుకున్నారు. జాతరలో భాగంగా చివరి రోజు అమ్మవారిని బుధవారం అర్ధరాత్రి తర్వాత అత్తిగారిల్లు అయిన చాకలి చావడి నుంచి ఊరేగింపుగా గుడి వద్దకు తీసుకువచ్చారు. అక్కడ పోలేరమ్మ తల్లిని గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం 5.30 గంటలకు భారీ భక్తజన సందోహం మధ్య ఊరేగింపుగా అమ్మవారిని తీసుకువెళ్లి 6.45 గంటలకు నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలేరమ్మ తల్లిని దర్శించుకున్న ప్రముఖుల్లో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమలత, రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు.

● నౌకలు, సబ్‌మెరైన్‌లకు రికార్డు సమయంలో మరమ్మతులు చేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందిన విశాఖపట్నంలోని హిందూస్థాన్ షిప్‌యార్డ్ (హెచ్‌ఎస్‌ఎల్) ప్రతిష్టాత్మక 'బెస్ట్ రిపేర్ కంపెనీ' అవార్డును సొంతం చేసుకుంది. మరో రెండు అవార్డులను సైతం కైవశం చేసుకుంది. ముంబైలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ మారీటైం ఎగ్జిబిషన్(ఇన్‌మెక్స్)లో భాగంగా గురువారం 'ఇండియన్ మారీటైమ్ ఎక్సలెన్స్–2023' అవార్డులను ప్రదానం చేశారు. ఈ మేరకు షిప్‌యార్డ్ అధికారులు బెస్ట్ రిపేర్ కంపెనీ, బెస్ట్ టెక్నాలజీ ఇన్నోవేషన్, మారీటైమ్ ఇండస్ట్రీలో ఉమెన్ లీడర్‌షిప్ అవార్డులను అందుకున్నారు. హెచ్‌ఎస్‌ఎల్ ఐదేళ్లలో 14 ప్రాజెక్టులను, 40 నౌకల రీఫిట్ పనులను పూర్తిచేసి రికార్డు సృష్టించింది.

STATE GAZETTEE
ఆంధ్రప్రదేశ్
Part-1 Extraordinary
Published by Authority

No. 200 ONGOLE dt.13-09-2023

RC. G1 /e.1703/2015 Dated : 01.09.2023

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జిల్లా కలెక్టరు వారి కార్యాలయము, ప్రకాశం జిల్లా, ఒంగోలు
ఫారం నెం- 6 (ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారము పొందే హక్కు, పారదర్శకతతో చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్ లో చూపబడిన ప్రకాశం జిల్లా పామూరు మండలం రావిగుంటపల్లి గ్రామము నందలి ఈదిగువ తెలియపరిచినభూములు ప్రజాహిత కార్యాలకు అనగా రహదారి విస్తరణ మరియు బలపరచు నిమిత్తం డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, నిర్మాణములు - యస్. సి. రైల్వే సికింద్రాబాద్ వారు కోరినందున, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపన పునరుపాధి కల్పన చట్టం-2013 నందలి, సెక్షన్ 11(1) నిబంధన అనుసరించి, ఈ విషయము గురించి చట్టము ఇందుకు సంబంధించి యావన్మందికి ఎరుక నిమిత్తము ఇందుమూలంగా నోటీసు జారిచేయడమైనది.

2018 భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్ట పరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం (2018 లోని 22వ చట్టం) ద్వార సవరించబడినవిధముగా 2013 భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్ట పరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం (2013 లో 30 వ చట్టం) సెక్షన్ 10 (ఎ) ప్రకారము సామాజిక ప్రభావ అంచనా ప్రకటనకు మినహాయింపు ఇవ్వడమైనది.

ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏమియూ లేవు.

శ్రీ జిల్లా కలెక్టర్, ప్రకాశం జిల్లా ఒంగోలు వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించేందుకు శ్రీ రెవిన్యూ డివిజనల్ అధికారి, కనిగిరి వారికి, వారి సిబ్బంది మరియు వారి పనివారలకుఈ భూముల భూసేకరణకై, పైసెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు, ఇందుమూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి జిల్లా కలెక్టరు, ప్రకాశం జిల్లా / శ్రీ రెవిన్యూ డివిజనల్ అధికారి, కనిగిరి వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన తేది నుండి ఏదేని లావాదేవీలు లేదా ఏదేని భూమియొక్క లావాదేవీల కారణం అంటే భూమిని ఏ విధమైన అమ్మకము మరియు కొనుగోలు (క్రయ విక్రయాలు) మున్నగునవి లేదా అట్టి భూమిపై ఏదేని తాకట్టులను సృష్టించడము, ఏవ్యక్తి చేయరాదు.

పైచట్టం లో సెక్షన్-15 ననుసరించి భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములులోగా జిల్లా కలెక్టర్, ప్రకాశం జిల్లా, ఒంగోలు / భూసేకరణ అధికారి మరియు శ్రీ రెవిన్యూ డివిజనల్ అధికారి, కనిగిరి వారి ఎదుట అభ్యంతరములు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : ప్రకాశం మండలము : పామూరు గ్రామము : రావిగుంటపల్లి

వ. నెం.	సర్వే నెం/సబ్ డివిజన్	భూమి స్థితి	మొత్తం విస్తీర్ణం యం.సెంట్స్	సేకరించిన విస్తీర్ణం	సంబంధించిన ఆసామి పేరు మరియు చిరునామా పట్టాదారు మరియు అనుభవదారు	సరిహద్దులు				చెట్లు కట్టడాల వివరాలు
						ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	
1	96/2	పట్టా	4.94	2.04	ఇతరులు	Village Boundary	98	96-3	96-1	--
2	97/2	పట్టా	3.08	0.01	ఇతరులు	Village Boundary	96-2	96-2	97-1	--
3	100/2	పట్టా	7.73	0.01	బసిరాజు కొండమ్మ W/o చిన మాలకొండయ్య	615	101	100-1	101	--
4	101/2	పట్టా	4.59	3.22	బసిరాజు కొండమ్మ W/o చిన మాలకొండయ్య	614	102	101-3	214	--
5	102/2	పట్టా	3.60	2.60	పుట్లూరి బయ్యన్న S/o రామయ్య	101	103	100-1	102-1	--
6	210/1	పట్టా	3.82	3.15	అంకే పల్లి సుబ్బమ్మ W/o వెంకటయ్య మరియు ఇతరులు	211	641	214	210-1	--
7	614/2	పట్టా	10.25	2.66	ఇతరులు	616	101	615	614-1	--
8	615/1	పట్టా	11.50	1.54	ఇతరులు	616	101	615-2	618-2	--
9	616/2	పట్టా	7.70	2.75	రాగి పిండి అంకయ్య S/o లక్ష్మి రెడ్డి	98	615-1	616-3	616-1	Artificial Fish Pond
	Total			17.98						

సం/- ఎ. ఎస్. దినేష్ కుమార్, ఐ.ఎ.ఎస్
కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేట్, ప్రకాశం జిల్లా, ఒంగోలు.

జాన్ ఫోసేకు సాహిత్య నోబెల్

మాటల్లో చెప్పలేని అంశాలకు గళంగా మారిన రచనలు

- నాటక రచయితగా ఎనలేని గుర్తింపు
- సెప్టాలజీ సిరీస్‌కు అత్యంత ప్రజాదరణ


నార్వే రచయిత జాన్ ఫోసేకు సాహిత్యంలో నోబెల్ పురస్కారం వరించింది. బయటకు చెప్పుకోలేని ఎన్నో అంశాలకు తన నవలలు, నాటకాలు, చిన్న పిల్లల పుస్తకాల ద్వారా గళంగా నిలిచినందుకు ఫోసే ఈ ఏడాది ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. నోబెల్ లిటరేచర్ కమిటీ చైర్మన్ ఆండర్స్ ఓల్సన్ గురువారం అవార్డును ప్రకటించారు. ఫోసే చేసిన రచనల్లో నార్వే సంస్కృతి, స్వభావాలు ఉట్టిపడుతూ ఉంటాయని కొనియాడారు. ఈ పురస్కారం కింద ఫోసేకు 1.1 కోట్ల స్వీడిష్ క్రోనర్లు (10 లక్షల డాలర్లు) లభిస్తాయి. సాహిత్యంలో నోబెల్ పురస్కారం లభించిందంటే తనని తాను నమ్మలేకపోయానంటూ జాన్ ఫోసే తీవ్ర ఉద్విగ్నానికి లోనయ్యారు. ''నోబెల్ కమిటీ ఫోన్ చేసి చెప్పగానే సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాను. మళ్లీ నన్ను నేనే నిలవరించుకున్నారు. గత పదేళ్లుగా నోబెల్ వస్తుందేమోనని ఎదురు చూస్తున్నాను. ఈ అవార్డు విపరీతమైన ఆనందాన్ని ఇస్తోంది. కాస్త కూడా భయం వేస్తోంది. '' అని నార్వే మీడియాకు చెప్పారు. నార్వేలో అత్యంత ప్రతిభావంతుడైన నాటక రచయితగా గుర్తింపు పొందిన ఫోసే 43 వరకు నవలలు, నాటకాలు, చిన్న కథలు, పిల్లల పుస్తకాలు, అనువాదాలు, పద్యాలు, గద్యాలు రచించారు. అయితే నాటక రచయితగానే ఆయనకు విశేషమైన గుర్తింపు లభించింది. మాటల్లో తమ బాధల్ని చెప్పుకోలేని ఎన్నో వర్గాలకు ఆయన తన రచనలతో ఒక గళంగా మారి సామాజిక పరిస్థితుల్ని అద్దంలో చూపించారంటూ ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

40 భాషల్లో పుస్తకాల అనువాదం

ఫోసే చేసిన రచనలు ప్రపంచవ్యాప్తంగా దాదాపుగా 40 భాషల్లోకి అనువాదమయ్యాయి. 2015లో ది డైలీ టెలిగ్రాఫ్ రూపొందించిన భూమ్మీద ఉన్న లివింగ్ జీనియస్‌లలో టాప్ 100 జాబితాలో ఫోసే 83వ స్థానంలో నిలిచారు. 2022లో ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ అవార్డు కోసం ఆయన రాసిన ''ఏ న్యూ నేమ్ :సెప్టాలజీ VI& VII'' షార్ట్ లిస్ట్‌లో నిలిచింది. జాన్ ఫోసేకు మూడు పెళ్లిళ్లయ్యాయి. ఆరుగురు పిల్లలకు తండ్రి. 64 ఏళ్ల వయసున్న జాన్ ఫోసే ఆస్ట్రియాలోని తన రెండో భార్యతో కలిసి ఉంటున్నారు. యువకుడిగా ఉన్నప్పుడు దేవుడ్ని నమ్మని జాన్ ఫోసే ప్రస్తుతం కాథలిజంలోకి మారి దానినే అనుసరిస్తున్నారు. ఫోసే చేసిన రచనల్లో బోట్‌హౌస్, మెలాంకలి, సెప్టాలజీ అత్యంత ప్రజాదరణ పొందాయి. ఫోసే రచించిన నాటకాలను వేలాది ప్రొడక్షన్ హౌస్‌లు వివిధ దేశాల్లో ప్రదర్శించాయి. ఇంగ్లిష్ భాషలోకి అనువదించిన ఫోసే సెప్టాలజీ సిరీస్‌లో ది అదర్ నేమ్, ఐ ఈజ్ అనదర్, ఏ న్యూనేమ్ ఆయనకు చాలా గుర్తింపు తీసుకువచ్చాయి.

రోజువారీ ఘటనలే కథా వస్తువు

నిత్యజీవితంలో మనకు ఎదురయ్యే ఘటనలే జాన్ ఫోసే రచనలకు ఆధారం. అలాంటి ఘటనల్ని సరళమైన భాషలో,, శక్తిమంతమైన భావ ప్రకటనతో రచనలు చేసి సామాన్యుల మనసుల్ని కూడా దోచుకున్నారు. మానవ సంబంధాల్లోని బలమైన భావోద్వేగాలను , సామాజిక పరిస్థితుల్ని చిన్నారులకి కూడా అర్థమయ్యేలా రచనలు చేసి సమాజంలో వివిధ వర్గాలపై ఎంతో ప్రభావాన్ని చూపించారు. నార్వేలో 1959లో క్రిస్టియన్ మతాచారాల్ని గట్టిగా ఆచరించే ఒక సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. విద్యార్థి దశలోనే ఆయన తన కుటుంబంపైన, మతంపైనా తిరుగుబాటు ప్రకటించారు. తాను నాస్తికుడినని ప్రకటించారు. చిన్నప్పట్నుంచి తిరుగుబాటు ధోరణి కలిగిన జాన్ ఫోసే రచనల్లో, నాటకాల్లో అది వ్యక్తమయ్యేది. 1983లో ఆయన రాసిన మొదటి నవల రెడ్, బ్లాక్‌లో ఆత్మహత్యల అంశాన్ని స్పృశించారు. అప్పట్నుంచి ఆయన వెనక్కి చూసుకోలేదు. నవలైనా, నాటకమైనా, పద్యాలైనా, గద్యాలైనా ఆ రచనల్లో ఆయన ముద్ర స్పష్టంగా కనిపించేది. **- సాక్షి, నేషనల్ డెస్క్**


జాన్ ఫోసే

భాషకు పట్టాభిషేకం

జాన్ ఫోసే రచనలు నార్వేజియన్ భాషలో రాస్తారు. నార్వేలో 10% మంది మాత్రమే ఈ భాష మాట్లాడే ప్రజలు ఉన్నారు. నార్వేలో ఉన్న రెండు అధికారిక భాషల్లో ఇదొకటి. గ్రామీణ ప్రాంత ప్రజలు మాట్లాడే మాండలికంలో ఉండే ఈ భాష 19వ శతాబ్దంలో డానిస్‌కు ప్రత్యామ్నాయంగా పుట్టింది. స్వచ్ఛమైన సెలయేరులాంటి భాషలో ప్రజలు రోజువారీ ఎదుర్కొనే సమస్యలకి తన రచనల్లో కొత్త కోణంలో పరిష్కారం మార్గం చూపించడంతో ఆయన పుస్తకాలు అపరిమితమైన ఆదరణ పొందాయి. అందుకే ఈ పురస్కారం తనకే కాకుండా, తన భాషకి కూడా పట్టాభిషేకం జరిగినట్టుగా ఉందని ఫోసే ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు.

వ్యతిరేకంగా సాక్ష్యాలున్నాయా?

సిసోడియా కేసులో సీబీఐను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు వ్యతిరేకంగా బలమైన ఆధారాలు ఏవైనా ఉన్నాయా? అని సుప్రీంకోర్టు సీబీఐను ప్రశ్నించింది. ఇదే కేసులో నిందితుడైన దినేశ్ అరోరా వాంగ్మూలం మినహా ఇంకా ఏం ఆధారాలున్నాయని అడిగింది. మద్యం కుంభకోణం కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సిసోడియా దాఖలు చేసిన రెండు పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ చేపట్టింది. కొందరు వ్యక్తులకు లబ్ధి చేకూర్చే విధంగా ఢిల్లీ మద్యం విధానాన్ని రూపొందించారని సీబీఐ పేర్కొంది. కొన్ని వాట్సాప్ సందేశాలను సాక్ష్యంగా కోర్టుకు సమర్పించింది. ఈ సాక్ష్యం ఆమోదయోగ్యమేనా? అప్రూవర్‌గా మారిన వ్యక్తి ఇచ్చిన వాంగ్మూలాన్ని సాక్ష్యంగా ఎలా భావించగలం? అని కోర్టు వ్యాఖ్యానించింది. మద్యం కుంభకోణం కేసులో సిసోడియాకు వ్యతిరేకంగా సరైన సాక్ష్యాధారాలు చూపించలేకపోయారని అభిప్రాయపడింది. సిసోడియా ముడుపులు తీసుకున్నారని కేంద్ర దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయని, మరి ఆ డబ్బులు ఆయనకు ఎవరిచ్చారు? డబ్బులిచ్చినట్లు ఆధారాలున్నాయా? ఈ కేసులో అరోరా వాంగ్మూలం కాకుండా సాక్ష్యాలున్నాయా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

సంజయ్ సింగ్‌కు ఐదు రోజుల కస్టడీ

బుధవారం అదుపులోకి తీసుకున్న ఆప్ నేత ఎంపీ సంజయ్ సింగ్‌ను ఈడీ అధికారులు గురువారం ప్రత్యేక కోర్టు జడ్జి నాగ్‌పాల్ ఎదుట హాజరుపరిచారు. ఈ కేసులో మిగతా నిందితులతో కలిపి ఆయన్ను విచారించాల్సి ఉందని ఈడీ పేర్కొంది. దీంతో జడ్జి నాగ్‌పాల్ ఆయన్ను విచారణ నిమిత్తం అయిదు రోజుల ఈడీ కస్టడీకి పంపుతూ ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా జడ్జి అనుమతి మేరకు సంజయ్ సింగ్ కోర్టులో మాట్లాడారు.

ఉగ్రవాదాన్ని నిర్దాక్షిణ్యంగా అణచేయాలి



- ఎన్ఐఏ, రాష్ట్రాల విభాగాలు కలిసికట్టుగా పనిచేయాలి
- జాతీయ సదస్సులో అమిత్ షా

న్యూఢిల్లీ: ఉగ్రవాదం పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాలని హోం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. దేశంలో మళ్లీ కొత్తగా ఉగ్ర గ్రూపు ఏర్పడకుండా కఠినమైన వైఖరిని అవలంబించాలని ఉగ్రవాద వ్యతిరేక విభాగాలను కోరారు. ఉగ్రవాదాన్ని మాత్రమే కాదు, ఉగ్రవాద నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతో పెకిలించివేయాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వంతోపాటు అన్ని విభాగాలు ఉమ్మడిగా ముందుకు సాగాలన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలో రెండు రోజుల జాతీయ ఉగ్ర వ్యతిరేక సదస్సునను అమిత్ షా ప్రారంభించి, ప్రసంగించారు. క్రిప్టో కరెన్సీలు, హవాలా, ఉగ్ర నిధులు, వ్యవస్థీకృత నేర ముఠాలు, డ్రగ్స్‌- ఉగ్ర లింకులు వంటి అనేక సవాళ్లను ఎదుర్కొనేందుకు తొమ్మిదేళ్లుగా ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యలు మంచి ఫలితాలు సాధించాయని ఆయన అన్నారు. ఎన్ఐఏ, ఉగ్ర వ్యతిరేక బృందాలు, రాష్ట్రాల టాస్క్‌ఫోర్స్‌లు కేవలం కేసుల దర్యాప్తునకే పరిమితం కారాదన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు తమ పరిధిని దాటి వినూత్నవిధానాలను ఆలోచించాలని కోరారు. ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలించివేసే క్రమంలో అంతర్జాతీయ సహకారంతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల సహకారం కూడా అవసరమని తెలిపారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం, రాష్ట్రాలు, వివిధ ఏజెన్సీల మధ్య సహకారం ఉండాలన్నారు. ఇందుకోసం కేంద్రం పలు డేటా బేస్‌లను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఎన్ఐఏ పరిధిలో మోడల్ యాంటీ టెర్రరిజం నిర్మాణాన్ని ఏర్పాటు చేయాలి, కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య మెరుగైన సమన్వయం కోసం అన్ని రాష్ట్రాల్లోని ఉగ్రవాద వ్యతిరేక విభాగాల అధికార క్రమం, నిర్మాణం, విచారణ, కార్యాచరణ విధానం ఏకరీతిగా ఉండాలన్నారు. 94 శాతం కంటే ఎక్కువగా నేరారోపణ సాధించిన ఎన్ఐఏ కృషిని షా ప్రశంసించారు. ఈ ఏడాదిలో ఎన్సీబీ చేపట్టిన ఆపరేషన్ సముద్రగుప్తతో రూ.12 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకోగలిగామన్నారు.

సిరియాలో భీకర డ్రోన్ దాడి..
100 మందికి పైగా మృతి

బీరుట్: పదమూడేళ్లుగా అంతర్యుద్ధంతో సతమతమవుతోన్న సిరియాలో భీకర డ్రోన్ దాడి సంభవించింది. హామ్స్ నగరంలో గురువారం మిలటరీ జవాన్ల స్నాతకోత్సవ కార్యక్రమం లక్ష్యంగా జరిగిన దాడిలో పౌరులు, సైనికులు కలిపి 100 మందికి పైగా చనిపోగా మరో 125 మంది గాయపడ్డారు. సిరియాలో ఇటీవలి సంవత్సరాల్లో జరిగిన దాడుల్లో ఇదే తీవ్రమైందని చెబుతున్నారు. ఘటన నేపథ్యంలో ప్రభుత్వం మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. 'మాకు తెలిసిన అంతర్జాతీయ బలగాల మద్దతు ఉన్న తిరుగుబాటుదారులే పేలుడు పదార్థాలు కలిగిన డ్రోన్లతో దాడికి పాల్పడ్డారు'అని సిరియా సైన్యం ఆరోపించింది. ఘటనకు తామే కారణమంటూ ఎవరూ ప్రకటించుకోలేదు.

డీఎంకే ఎంపీ ఇళ్లలో సోదాలు

చెన్నై: డీఎంకే ఎంపీ ఎస్.జగత్‌రక్షకన్‌కు చెందిన పలు ప్రాంతాలపై గురువారం ఆదాయ పన్ను(ఐటీ) శాఖ అధికారులు దాడులు జరిపారు. ఎంపీకి చెందిన కొన్ని విద్యాసంస్థల్లోనూ సోదాలు జరిగాయని పోలీసు వర్గాలు తెలిపాయి. ఐటీ దాడులపై సీఎం ఎంకే స్టాలిన్ తీవ్రంగా మండిపడ్డారు. ఇది కేంద్రం పాల్పడుతున్న అధికార దుర్వినియోగం, వేధింపు రాజకీయాలంటూ విమర్శించారు. తమిళనాడులోని అరక్కోణమ్ లోక్‌సభ స్థానం నుంచి జగత్‌రక్షకన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

భారత్‌ను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్

- రాజస్తాన్ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని నరేంద్ర మోదీ
- రూ.5,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభం


జోధ్‌పూర్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

జోధ్‌పూర్: భారతదేశం గళాన్ని నేడు ప్రపంచ దేశాలు వింటున్నాయని, ఇది చూసి ప్రతిపక్ష కాంగ్రెస్ తట్టుకోలేకపోతుందని ప్రధాని మోదీ అన్నారు. ఆ పార్టీ బీజేపీని వ్యతిరేకించే క్రమంలో భారత్‌ను వ్యతిరేకించడం ప్రారంభించిందని విమర్శించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాజస్తాన్‌లో మోదీ గురువారం పర్యటించారు. దాదాపు రూ.5,000 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జోధ్‌పూర్‌లో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. గహ్లోత్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పేపర్ లీక్ మాఫియా వల్ల లక్షలాది మంది యువత భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ అవినీతిని బయటపెడతామన్నారు.

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

కాంగ్రెస్ పార్టీకి రైతుల పట్ల గానీ, సైనికుల పట్ల గానీ ఏమాత్రం శ్రద్ధ లేదని మోదీ ఆరోపించారు. ఆ పార్టీకి అధికారమే పరమావధిగా మారిందని ఆక్షేపించారు. సొంత ఓటు బ్యాంకును ప్రేమించడం తప్ప ప్రజా ప్రయోజనాల గురించి ఆలోచించడం లేదని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ కీర్తి ప్రతిష్టలు పెరుగుతున్నాయని, ప్రపంచ దేశాల్లో మన ప్రభావం విస్తరిస్తోందని, విదేశాల్లో మన గురించి గొప్పగా మాట్లాడుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఇదంతా నచ్చడం లేదని అన్నారు. భారత్ త్వరలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని, ఇది మోదీ ఇస్తున్న గ్యారంటీ అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఈ బిల్లు పరిస్థితి ఏమిటో తెలిసిందేనని పేర్కొన్నారు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో పేదరికం గణనీయంగా తగ్గిందని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. కోట్లాది మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు.

'ద వ్యాక్సిన్ వార్'పై మోదీ ప్రశంసలు

బాలీవుడ్ చలనచిత్రం 'ద వ్యాక్సిన్ వార్'పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ చిత్రం ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేసిందని అన్నారు. వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వం వహించిన ద వ్యాక్సిన్ వార్ సినిమా సెప్టెంబర్ 28న విడుదలైంది. కోవిడ్‌–19 మహమ్మారి వ్యాప్తిని అరికట్టడమే లక్ష్యంగా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయడానికి మన సైంటిస్టులు అహోరాత్రులు శ్రమించారని, వారి శ్రమను ఈ చిత్రంలో చక్కగా చూపించారని మోదీ కొనియాడారు. మన సైంటిస్టుల అంకితభావాన్ని తెరకెక్కించిన చిత్ర దర్శకుడు, నిర్మాతలను ప్రశంసించారు.

ఉక్రెయిన్‌పై భీకర దాడి

51 మంది దుర్మరణం

కీవ్: ఉక్రెయిన్‌పై దురాక్రమణకు దిగిన రష్యా మూకలు గురువారం భారీ దాడికి తెగబడ్డాయి. ఖర్కీవ్ రీజియన్‌లోని హరోజా గ్రామంపై రష్యా విచక్షణారహితంగా జరిపిన రాకెట్ దాడిలో ఏకంగా 51 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిలో ఆరేళ్ల బాలుడు సైతం ఉన్నాడు. దాడి ఘటనలో పలువురు గాయపడ్డారు. ఇటీవల కాలంలో ఒకే ప్రాంతంలో ఇంతమంది సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోవడం ఇదే తొలిసారి. గ్రామంలోని కేఫ్, స్టోర్‌పై ఈ దాడి జరిగింది. దాడి సమయంలో ఆ కేఫ్‌లో ఓ సంతాప సభ జరుగుతోంది. ఐరోపాలోని మిత్ర దేశాల నుంచి మరింత మద్దతు కూడగట్టేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పెయిన్‌లో పర్యటిస్తున్న వేళ ఈ దాడి జరగడం గమనార్హం. 'గ్రామంపై రష్యా రాకెట్లతో దాడిచేయడం నిజంగా హేయమైన నేరం. రష్యా ఉగ్రవాదానికి సిసలైన రుజువు' అని జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ' ఇంతటి దారుణానికి ఒడిగట్టిన ఉగ్ర రష్యాను ఆపాలంటే పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌కు వైమానిక దళానికి సాయం మరింత పెంచాలి' అని ఆయన మిత్ర దేశాలకు విజ్ఞప్తిచేశారు. ఇన్నాళ్లూ భూతలంపై దాడులకు దిగిన రష్యా తాజాగా సముద్ర మందుపాతరలను అమరుస్తోంది. సముద్రమార్గంలో పౌర రవాణాను అడ్డుకుని, నల్లసముద్రంలో పేలుళ్లు సంభవిస్తే ఆ నేరం ఉక్రెయిన్‌పై మోపాలని రష్యా కుట్రపన్నుతోందని బ్రిటన్ విదేశాంగ శాఖ తన నిఘా నివేదికలో పేర్కొంది.

సిక్కిం వరదలు..18కి చేరిన మరణాలు


రాంగ్‌పో పట్టణంలో వరదలకు వాహనాలు కొట్టుకొస్తున్న దృశ్యం

- 22 మంది జవాన్లు సహా 98 మంది గల్లంతు
- అన్వేషణ కొనసాగుతోందన్న ఎస్ఎస్‌డీఎంఏ

గ్యాంగ్‌టక్: సిక్కింలో సంభవించిన ఆకస్మిక వరదల్లో మృతుల సంఖ్య 14కు చేరుకుంది. అదేవిధంగా, 22 మంది ఆర్మీ అధికారులు సహా గల్లంతైన వారి సంఖ్య 98కు పెరిగింది. ఉత్తర సిక్కింలో తీస్తా నదీ పరీవాహక ప్రాంతంలోని ఎల్‌హొనాక్ సరస్సు ఉప్పొంగి సంభవించిన వరదల్లో గల్లంతైన మరో ఆరుగురి మృతదేహాలు లభ్యం కావడంతో మరణాల సంఖ్య 18కు చేరుకుందని రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ(ఎస్ఎస్‌డీఎంఏ) గురువారం బులెటిన్‌లో తెలిపింది. ఇప్పటివరకు 2,011 మందిని కాపాడినట్లు పేర్కొంది. గల్లంతైన 22 మంది జవాన్ల ఆచూకీ కోసం దిగువ ప్రాంతాల్లో గాలింపు చర్యలు ముమ్మరం చేశామని వివరించింది. ఇలా ఉండగా, వరదల్లో కొట్టుకు వచ్చిన 18 మృతదేహాల్లో నాలుగు జవాన్లవని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తెలిపింది. ఇవి సిక్కింలో గల్లంతైన జవాన్ల మృతదేహాలా కాదా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. బుధవారం సంభవించిన ఆకస్మిక వరదలతో చుంగ్‌థంగ్ డ్యామ్ ధ్వంసం కావడం.. విద్యుత్ మౌలిక వ్యవస్థలు దారుణంగా దెబ్బతినడంతోపాటు నాలుగు జిల్లాల్లోని పలు గ్రామాలు, పట్టణాలు జల దిగ్బంధంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. మంగన్ జిల్లాలోని 8 వంతెనలు సహా మొత్తం 11 బ్రిడ్జీలు వరదల్లో కొట్టుకుపోయాయి. రాష్ట్రానికి గుండెకాయ వంటి పదో నంబర్ రహదారి పలుచోట్ల ధ్వంసమైంది. చుంగ్‌థంగ్ పట్టణం తీవ్రంగా దెబ్బతింది. తీస్తా నదికి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశాలున్నందున, పరీవాహక ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రదేశాలకు చేరుకోవాలని ఎస్ఎస్‌డీఎంఏ కోరింది. సిక్కింలోని వేర్వేరు ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకుపోయిన వేల మంది పర్యాటకుల్లో విదేశీయులూ ఉన్నారు.

లంచం తీసుకున్న చట్టసభ సభ్యులకు విచారణ నుంచి మినహాయింపు ఉండదు

- సుప్రీంకోర్టుకు తెలియజేసిన అటార్నీ, సొలిసిటర్ జనరల్స్
- ఎంపీలు, ఎమ్మెల్యేలు చట్టప్రకారం నడుచుకోవాల్సిందే

న్యూఢిల్లీ: చట్టసభ సభ్యుడు లంచం తీసుకొంటే తదుపరి విచారణ నుంచి అతడు ఎలాంటి మినహాయింపు, వెసులుబాటు పొందలేడని, ఎంపీ అయినా, ఎమ్మెల్యే అయినా చట్టం ప్రకారం నడుచుకోవాల్సిందేనని అటార్నీ జనరల్ వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గురువారం సుప్రీంకోర్టుకు తెలియజేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు అయినప్పటికీ చట్టానికి ఎవరూ అతీతులు కారన్నారు. పార్లమెంట్‌లో ముడుపులు తీసుకున్నప్పటికీ చట్ట ప్రకారం విచారించి, శిక్ష విధించాలని చెప్పారు. లంచం ఇచ్చినా, తీసుకున్నా అవినీతి నిరోధక చట్టం కింద విచారించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. చట్టసభల్లో మాట్లాడడానికి, ఓటు వేయడానికి లంచం తీసుకున్న ఎంపీలు, ఎమ్మెల్యేలకు విచారణ నుంచి వెసులుబాటు ఉంటుందంటూ 1998 నాటి జేఎంఎం ముడుపుల కేసులో నాడు సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. కొన్ని వర్గాల విజ్ఞప్తి మేరకు ఈ తీర్పును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం పున:పరిశీలిస్తోంది. భాగస్వామ్యపక్షాల వాదనలు వింటోంది. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్ ధర్మాసనం ఎదుట తమ వాదనలు వినిపించారు. పార్లమెంట్‌లో ముడుపులు తీసుకున్నట్లు ఒక్క సంఘటన బయటపడినా సరే విచారణ చేపట్టాలని తుషార్ మెహతా అన్నారు. లంచం స్వీకరించిన పార్లమెంట్ సభ్యుడికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 105, 194 కింద విచారణ నుంచి వెసులుబాటు కల్పించవద్దని కోర్టును కోరారు. పార్లమెంట్ సభ్యుడికి కల్పించిన వెసులుబాట్లు, ఇచ్చిన మినహాయింపులు అతడి వ్యక్తిగత అవసరాల కోసం కాదని గుర్తుచేశారు. చట్టసభ సభ్యుడిగా బాధ్యతలను నిర్భయంగా నిర్వర్తించడానికే వాటిని ఉపయోగించుకోవాలని అన్నారు. ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తన తీర్పును రిజర్వ్ చేసింది.

ఒక్క ఆడపిల్ల ఉంటే రూ.2 లక్షలు

భ్రూణహత్యల నివారణకు ప్రోత్సాహకం ప్రకటించిన హిమాచల్ ప్రదేశ్

సిమ్లా: ఆడపిల్లల భ్రూణ హత్యల నివారణకు హిమాచల్‌ప్రదేశ్ ఒక కొత్త మార్గాన్ని ఎంచుకుంది. ఒకే ఒక్క ఆడపిల్ల ఉన్న తల్లిదండ్రులకు రూ.2 లక్షలు ప్రోత్సాహకంగా ఇస్తామని ప్రకటించింది. గతంలో ఒక్క ఆడపిల్ల ఉన్న తల్లిదండ్రులకు రూ.35 వేలు ఇన్సెంటివ్‌గా ఇచ్చే వారు. ఇప్పుడు దానికి 2 లక్షల రూపాయలకు పెంచినట్టుగా హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్ సింగ్ సుఖు చెప్పారు. డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ సేఫ్టీ అండ్ రెగ్యులేషన్స్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఒక కార్యక్రమానికి హాజరవడానికి వచ్చిన సీఎం సుఖు విలేకరులతో మాట్లాడారు. ఒక్క ఆడపిల్ల పుట్టిన తర్వాత కుటుంబ నియంత్రణ పాటించే తల్లిదండ్రులకు లక్ష రూపాయలు, ఇద్దరు ఆడపిల్లలు పుట్టిన తర్వాత ఇక పిల్లలు వద్దు అనుకున్న వారికి మరో లక్ష రూపాయలు అందిస్తామని చెప్పారు. హిమాచల్‌ప్రదేశ్‌లో లింగ నిష్పత్తి 1000:950గా ఉంది. దేశంలో అత్యుత్తమ రాష్ట్రాల్లో మూడో స్థానంలో నిలిచింది.

ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35% రిజర్వేషన్లు

మధ్యప్రదేశ్ ప్రభుత్వం నోటిఫికేషన్

భోపాల్: అటవీ శాఖ మినహా అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మధ్యప్రదేశ్ ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు మధ్యప్రదేశ్ సివిల్ సర్వీసెస్(స్పెషల్ ప్రొవిజన్ ఫర్ అపాయింట్‌మెంట్ ఆఫ్ ఉమెన్) రూల్స్‌–1997కు సవరణ చేసింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఇకపై మహిళలకు 35 శాతం కోటా అమలవుతుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. పోలీసు శాఖతోపాటు ఇతర ప్రభుత్వ పోస్టుల్లో 35 శాతం రిజర్వేషన్లు కల్పించడంతోపాటు టీచర్ల పోస్టుల భర్తీలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఇటీవల ప్రకటించారు.

కాంగ్రెస్, బీజేపీ పోస్టర్ యుద్ధం

న్యూఢిల్లీ: బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీగా పోస్టర్ వార్ మొదలుపెట్టాయి. అతి పెద్ద అబద్ధాలకోరు, ఉత్తిహామీలిచ్చే పిల్లాడు అంటూ బుధవారం కాంగ్రెస్ పార్టీప్రధాని మోదీపై 'ఎక్స్'లో పోస్టర్లు పోస్ట్‌చేయగా మరుసటి రోజే బీజేపీ దీటుగా స్పందించింది. పది తలల కలియుగ రావణుడంటూ రాహుల్ గాంధీ తలతో పోస్టర్‌ను తయారుచేసి బీజేపీ 'ఎక్స్'లో పోస్ట్‌చేసింది. ' భారత్‌కు ప్రమాదం పొంచి ఉంది. ఇది కాంగ్రెస్ పార్టీ ప్రొడక్షన్. జార్జ్ సోరెస్ దీనికి దర్శకుడు' అని బీజేపీ పోస్ట్‌చేసింది. జార్జ్ సోరెస్ హంగేరీ–అమెరికా వ్యాపార దిగ్గజం. భారత్‌లో పలు సంస్థలకు విరాళాలిస్తూ తరచూ భారత్‌లో రాజకీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటారని అపవాదు ఉంది. 'నవతరం రావణుడు ఈయన. ఇతనో రాక్షసుడు. ధర్మానికి వ్యతిరేకి. రాముడికి వ్యతిరేకి. భారత్‌ను నాశనం చేయడమే ఈయన లక్ష్యం' ఆ పోస్ట్‌లో బీజేపీ రాహుల్‌పై ఆరోపణలు చేసింది.

9న సీడబ్ల్యూసీ సమావేశం

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) ఈ నెల 9న ఢిల్లీలో భేటీ కానుంది. రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు సహా, వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలకు రోడ్‌మ్యాప్ సిద్ధం చేయడంతో పాటు కులగణన, కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. మహిళా రిజర్వేషన్ చట్టం అమలులో చిక్కులు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రాష్ట్రాల వారీగా ఇండియా కూటమి పక్షాలతో పొత్తులు వంటి అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. ప్రధానంగా తెలంగాణ సహా మధ్యప్రదేశ్‌లో అధికారం చేజిక్కించుకోవడం, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లో అధికారం కాపాడుకోవడం లక్ష్యంగా సీడబ్ల్యూసీలో కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం కనిపిస్తోంది.

అంతరిక్ష కేంద్రం ఏర్పాటుపై దృష్టి: ఇస్రో

న్యూఢిల్లీ: చంద్రయాన్‌–3 మిషన్ విజయవంతంతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) దృష్టి ఇప్పుడు ప్రతిష్టాత్మక అంతరిక్ష పరిశోధన ప్రాజెక్టులపై పడిందని సంస్థ చైర్మన్ ఎస్.సోమనాథ్ వెల్లడించారు. చైనా గ్లోబల్ టెలివిజన్ నెట్‌వర్క్(సీజీటీఎన్)కు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో భాగంగా అంతరిక్ష కేంద్ర నిర్మాణం, దీర్ఘకాల మానవ అంతరిక్షయానంతోపాటు భవిష్యత్తు మిషన్ల కోసం వివిధ అవకాశాలను అన్వేషిస్తోందని తెలిపారు. అంతరిక్ష కేంద్రం ఏర్పాటు భారతీయ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థకు ఎలా ప్రయోజనకరంగా ఉంటుందనే విషయం పరిశీలిస్తున్నామన్నారు. సమీప భవిష్యత్తులో సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసి, రోబోటిక్ ఆపరేషన్‌తో ప్రారంభించాలని ప్రణాళిక రూపొందించుకున్నట్లు వివరించారు. ప్రస్తుతానికి మానవ సహిత అంతరిక్ష యానంపై దృష్టిసారించామన్నారు. గగన్‌యాన్ కార్యక్రమం అదే దిశగా సాగుతోందని చెప్పారు. అది నెరవేరితే, ఆ తర్వాత వచ్చే 20–25 ఏళ్లలో చేపట్టే మిషన్లలో స్పేస్ స్టేషన్ ఏర్పాటు ఉంటుందన్నారు. తద్వారా ఇప్పటికే ఈ దిశగా విజయం సాధించిన అమెరికా, రష్యా, చైనాల సరసన భారత్ చేరుతుందన్నారు. చైనా గ్లోబల్ టెలివిజన్ నెట్‌వర్క్(సీజీటీఎన్)

2 వారాలు గడువివ్వండి: రణ్‌బీర్

ముంబై: మహదేవ్ యాప్ ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ నెల 6న ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరుకావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) పంపిన నోటీస్‌పై రణ్‌బీర్ స్పందించారు. తనకు రెండు వారాల గడువు కావాలని ఈడీని కోరినట్లు సమాచారం. ఇదే కేసులోకమెడియన్ కపిల్ శర్మ, హీరోయిన్లు హుమా ఖురేషి, హినా ఖాన్‌లకు కూడా ఈడీ గురువారం సమన్లు జారీ చేసింది. ముగ్గురినీ వేర్వేరు తేదీల్లో రాయ్‌పూర్ కార్యాలయంలో జరిగే విచారణకు రావాలని పేర్కొంది. మహదేవ్ యాప్ ప్రమోటర్లు రాయ్‌పూర్‌కు చెందిన వారే. వీరు యూఏఈలో ఉంటూ తమ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ప్రచారం కోసం చేపట్టిన కార్యక్రమాల్లో బాలీవుడ్‌కు చెందిన సుమారు 15 మంది సెలిబ్రిటీలు, నటులు పాల్గొన్నట్లు ఈడీ ఆరోపిస్తోంది.

ఏకంగా బస్‌షెల్టర్‌నే మాయం చేశారు

శివాజీనగర: ఇనుప వంతెనలు, భారీ వస్తు సామగ్రిని మాయం చేస్తున్న దొంగల కళ్లు..ఇప్పుడు బస్ షెల్టర్‌పై పడ్డాయి. బెంగళూరు నగరం నడిబొడ్డున నగర పోలీస్ కమిషనర్ కార్యాలయానికి దగ్గర్లో ఉన్న సిటీ బస్ షెల్టర్‌ను దొంగలు ఎత్తుకుపోయారు. ఒక ప్రైవేటు సంస్థ విరాళంగా అందజేసిన రూ.10 లక్షలతో స్థానిక కన్నింగ్‌హం రోడ్డులో బెంగళూరు మెట్రో సిటీ బస్ సంస్థ (బీఎంటీసీ) ఏడాదిన్నర క్రితం స్టీల్, ఇనుప రాడ్‌లు, షీట్లతో బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేసింది. కొన్నిరోజులుగా అక్కడ బస్సు షెల్టర్ స్థానం ఖాళీగా కనిపిస్తుండటంతో అధికారులే తొలగించి ఉంటారని స్థానికులు భావించారు. సదరు ప్రైవేటు సంస్థకు విషయం తెలిసి కార్పొరేషన్ అధికారులను ఆరా తీశారు. ఈ విషయం బయటకు రావడంతో స్థానికులు వారం క్రితం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలు, ఇతర ఆధారాలతో పోలీసులు దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

కరుస్తున్న 'కమాండర్' కథ కంచికి

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌజ్‌లో సీక్రెట్ సర్వీస్ అధికారులు, సిబ్బందిని తరచూ కరుస్తూ వార్తల్లో నిలుస్తున్న అధ్యక్షుడి శునకం 'కమాండర్' ఇకపై శ్వేతసౌధంలో కనిపించదు. అది ఇప్పటికే 11 సార్లు అక్కడి వారిని కరిచింది. దీంతో విసిగిపోయి దానికి వేరే ప్రాంతానికి తరలించారు. ఈ విషయాన్ని దేశాధ్యక్షుడు బైడెన్ భార్య జిల్ అధికార ప్రతినిధి ఎలిజబెత్ అలెగ్జాండర్ గురువారం మీడియాకు వెల్లడించారు. 'తమ రక్షణ బాధ్యతల్ని అనుక్షణం చూసే అధికారుల, సిబ్బంది క్షేమం తమకు ముఖ్యమని బైడెన్ దంపతులు భావించారు. అందుకే దానిని వేరే చోటుకు పంపారు' అని ఎలిజబెత్ వ్యాఖ్యానించారు. రెండేళ్ల వయసున్న జర్మన్ షెపర్డ్ జాతి 'కమాండర్' శునకం ఇప్పుడు ఎక్కడ ఉందనే వివరాలను ఆమె బయటపెట్టలేదు. అంతకుముందు 'మేజర్' అనే మరో శునకాన్ని బైడెన్ కుటుంబం పెంచుకునేది. అది కూడా ఇలా తరచూ ఇతరులను కరుస్తుండటంతో దానినీ సాగనంపారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023



సైకిల్‌పై షిర్డీ యాత్ర

గంపలగూడెం: మండలంలోని తోటమూల నుంచి దునకా వెంకటకృష్ణ, పంజికల కృష్ణ మూర్తి, యనమద్ది రవితేజ మహారాష్ట్రలోని షిర్డీ సాయిబాబా సన్నిధికి సైకిళ్లపై వెళ్లారు.



ఈవీఎం గోదాము పరిశీలన

మచిలీపట్నంటౌన్: స్థానిక ఈవీఎం గోదామును కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు గురువారం సాయంత్రం పరిశీలించారు. డీఆర్వో వెంకట రమణ, డీపీఓ నాగేశ్వరనాయక్ పాల్గొన్నారు.



ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యం

జగ్గయ్యపేట అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని తొర్రగుంటపాలెంలో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గురువారం ప్రారంభించారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యమన్నారు.

న్యూస్‌రీల్

విప్ అప్పిరెడ్డికి అభినందనలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శాసన మండలిలో విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం అభినందించారు. నగరంలో ఓ హోటల్‌లో అప్పిరెడ్డిని గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన భవిష్యత్‌లో మరిన్ని పదవులు అలంకరించాలని రఘురాం ఆకాంక్షించారు. పార్టీలో అంకిత భావంతో పనిచేసేవారికి పదవులు వాటంతట అవే వస్తాయన్నారు.

98.89 శాతం మందికి పింఛన్ కానుక



గాంధీనగర్(విజయవాడసెంట్రల్)/జగ్గయ్యపేట: ఎన్టీఆర్ జిల్లాలో గురువారం సాయంత్రానికి వైఎస్సార్ పింఛన్ కానుక 98.89 శాతం మందికి అందింది. జిల్లాలో మొత్తం 2,37,888 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇప్పటి వరకు 2,35,247 మందికి పింఛన్లు పంపిణీచేశారు. జిల్లాలో అత్యధికంగా జి.కొండూరు మండలంలో 99.51 శాతం, తిరువూరులో 99.31 శాతం, జగ్గయ్యపేటలో 99.17 శాతం, నందిగామలో 99.11 శాతం, కొండపల్లి అర్బన్‌లో 98.07 శాతం పంపిణీ పూర్తయింది. జగ్గయ్యపేట మండలం రామచంద్రపేట గ్రామానికి చెందిన వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారు జుజ్జవరపు ఆలీసమ్మ అనారోగ్యానికి గురై హైదరాబాదు ఎర్రగడ్డ ఛాతీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. వలంటీర్ కమ్మలపల్లి వినోద్ సొంత ఖర్చులతో గురువారం హైదరాబాద్ వెళ్లి ఆమెకు పెన్షన్ డబ్బులు అందజేశాడు. వలంటీర్‌ను పలువురు అభినందించారు.



- ఆసియా క్రీడల్లో మెరిసిన తెలుగు తేజం జ్యోతి సురేఖ
- కాంపౌండ్ మిక్స్‌డ్, కాంపౌండ్ ఉమెన్ టీమ్‌లో సత్తా
- రెండు స్వర్ణ పతకాలు సాధించిన స్టార్ ఆర్చర్

అంతర్జాతీయ వేదికపై తెలుగు తేజం జ్యోతి సురేఖ మరోసారి మెరిసింది. 19వ ఆసియా క్రీడల్లో ఆర్చరీ విభాగంలో రెండు స్వర్ణ పతకాలను సాధించింది. మూడో స్వర్ణంపై గురి పెట్టింది. డబుల్ ధమాకాతో రాణించిన ఈ తెలుగుబిడ్డ వ్యక్తిగత విభాగంలోనూ స్వర్ణ పతకం సాధిస్తుందని ప్రతి ఒక్కరూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

జ్యోతి సురేఖ.. డబుల్ ధమాకా

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): రాష్టానికి చెందిన అర్జున అవార్డు గ్రహీత వెన్నం జ్యోతి సురేఖ 19వ ఆసియా క్రీడల్లో ఆర్చరీ పోటీల్లో రెండు స్వర్ణాలతో సత్తాచాటింది. చైనాలోని హాంగ్జౌలో జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా బుధవారం ఆర్చరీ కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంలో ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే–జ్యోతి సురేఖ ద్వయం దక్షిణ కొరియాకు చెందిన సో చేవన్–జేహూన్ జూ జోడీపై గెలిచి స్వర్ణ పతకం సాధించింది. గురువారం జరిగిన ఆర్చరీ కాంపౌండ్ ఉమెన్ విభాగంలో జ్యోతి సురేఖ ఫైనల్‌లో విజేతగా నిలిచి స్వర్ణం గెలుచుకుంది. వ్యక్తిగత విభాగంలో శనివారం జరిగే ఫైనల్స్‌కు సురేఖ చేరింది. 19వ ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణాలు సాధించిన తెలుగు అమ్మాయిగా వెన్నం జ్యోతి సురేఖ రికార్డు సృష్టించింది.

పురస్కారాలు ఎన్నెన్నో...

జ్యోతి సురేఖ ఇప్పటి వరకు ఎన్నో పతకాలు గెలుచుకుంది. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఆర్చరీ పోటీల్లో 50కు పైగా మెడల్స్‌ను సాధించింది. జాతీయ స్థాయిలో 40 బంగారు, 13 రజతం, 9 కాంస్య పతకాల చొప్పున 62 మెడల్స్ సొంతం చేసుకుంది. అంతర్జాతీయ స్థాయిలో 17 బంగారు, 18 రజత, 15 కాంస్య పతకాలను జ్యోతి సురేఖ దక్కించుకుంది. మరిన్ని పతకాలే లక్ష్యంగా నిత్యం ప్రాక్టీస్ చేస్తోంది.



తల్లిదండ్రులు శ్రీదుర్గ, సురేంద్ర కుమార్‌తో జ్యోతి సురేఖ (ఫైల్)

ప్రతిభకు గుర్తింపు

ప్రపంచ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని చాటుతున్న జ్యోతి సురేఖ సేవలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి 2022 డిసెంబర్ 19వ తేదీన ఆమెను ప్రత్యేకంగా సన్మానించారు. అదే రోజు జ్యోతి సురేఖకు గ్రూప్–1 (డెప్యూటీ కలెక్టర్) ఉద్యోగం ఇచ్చి గౌరవించారు. 2017లోనే అర్జున అవార్డు జ్యోతి సురేఖను వరించింది. 2018 సంవత్సరంలో ఇండియన్ అన్‌బాండ్ ఎక్స్‌లెన్సీ అవార్డు, ఎక్సెప్షనల్ అచీవ్‌మెంట్ అవార్డు, 2016లో 'సాక్షి' మీడియా యంగ్ అచీవర్ అవార్డు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిభా పురస్కారం, 2018లో జీ టీవీ నుంచి అప్సర అవార్డు, 2014లో అక్కినేని ఫౌండేషన్ క్రీడా రత్న అవార్డును సురేఖ అందుకుంది.

చాలా సంతోషంగా ఉంది

మా జ్యోతి సురేఖ ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణాలు సాధించడం చాలా సంతోషంగా ఉంది. ఆసియా క్రీడా పోటీల్లో విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. జ్యోతి సురేఖ ఆ ఒత్తిడిని తట్టుకుని చాలా ఏకాగ్రతతో ఆడుతోందని కోచ్‌లు మెచ్చుకున్నారు. ప్రపంచ స్థాయి ర్యాంకర్‌గా ఎదగాలని నిత్యం సాధన చేస్తూనే ఉంటుంది. రాష్ట్రంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేసి మరింత ఎక్కువ మందికి శిక్షణ ఇచ్చి ప్రపంచ స్థాయి ఆర్చరీ క్రీడాకారులను తయారు చేసి దేశానికి మరింత పేరు తేవాలనేది జ్యోతి సురేఖ ఆకాంక్ష.

– శ్రీదుర్గ, సురేంద్రకుమార్ (జ్యోతి సురేఖ తల్లిదండ్రులు)

అబాదీ సర్వేతో స్థలాలకు చట్టభద్రత

ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి జయచంద్ర



వర్మీ కంపోస్టును పరిశీలిస్తున్న డీపీఓ జయచంద్ర, సర్పంచ్ పద్మకుమారి

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): గ్రామాల్లో చట్టభద్రత లేని స్థలాలకు రక్షణ కల్పించడానికి అబాదీ సర్వే చేపడుతున్నామని ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి జయచంద్ర తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా అబాదీ సర్వేకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. తొలుత గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని తెలుసుకోవటంతో పాటు జిల్లాలోనే ఆదర్శవంతంగా నిర్వహణ చేస్తున్నందుకు సర్పంచ్ వేల్పుల పద్మకుమారిని అభినందించారు. పాఠశాలలో విద్యార్థులతో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక విలేకరులతో జిల్లా పంచాయతీ అధికారి జయచంద్ర మాట్లాడుతూ.. అబాదీ సర్వే ద్వారా గ్రామాల్లో ఇళ్ల కొలతలు తీసి బ్యాంకర్లు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో యజమానులకు ప్రాపర్టీ కార్డ్ జారీ చేస్తామని తెలిపారు. ఆ కార్డుతో బ్యాంక్‌ల ద్వారా రుణాలు పొందొచ్చని సూచించారు. ఈ కార్డు ద్వారా యజమానులకు పూర్తి హక్కు లభిస్తుందన్నారు. ఎంపీడీఓ ఎస్.వి.ప్రసాద్, ఏఓ సిద్దారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్యామ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్తగా సర్కారీ వైద్యం



గ్రామాలకే వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు (ఫైల్)



పట్టణ ఆరోగ్య కేంద్రం ల్యాబ్‌లో అత్యాధునిక యంత్ర పరికరాలు

ప్రజల చెంతకే చేరుతున్న వైద్య సేవలు

- ప్రభుత్వాస్పత్రులపై పెరుగుతున్న నమ్మకం
- పెద్ద ఎత్తున వైద్యులు, సిబ్బంది నియామకాలు
- అందుబాటులో అత్యాధునిక పరికరాలు
- సమర్థంగా ఆరోగ్యశ్రీ సేవలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఒకప్పుడు సర్కారీ ఆస్పత్రికి వెళ్లాలంటే ప్రజలు భయపడేవారు. అక్కడకు వెళ్తే జబ్బు తగ్గకపోగా, ఇన్‌ఫెక్షన్‌లు అంటగడతారనే భావన ఉండేది. మందులు కూడా లేక, అన్నీ రోగులే కొనుక్కోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది.

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఏ ఒక్కరూ వైద్యం అందక ఇబ్బంది పడకూడదని భావించి, ప్రభుత్వాస్పత్రుల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించి అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేశారు. నాడు–నేడు పథకం ద్వారా ఆస్పత్రుల రూపురేఖలు మార్చేశారు.

గడప వద్దకే వైద్యం

ఒకప్పుడు బీపీ, సుగర్ రోగులు వైద్య పరీక్షల కోసం దూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. గర్భిణులు పీహెచ్‌సీలకు వెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కుటుంబ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామానికి, తమ ఇంటి సమీపంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు నెలలో రెండు సార్లు వైద్యులు వస్తున్నారు. అక్కడ వైద్య పరీక్షలు చేయడమే కాకుండా, నడవలేని మంచంలోనే ఉన్న రోగుల ఇంటికే వైద్యులు వెళ్లి పరీక్షలు చేస్తున్నారు.

సిబ్బంది కొరతకు చెక్

ఎన్నడూ లేని విధంగా ఈ నాలుగేళ్లలో ప్రభుత్వాస్పత్రిల్లో వైద్యులు, సిబ్బంది నియామకాలు పెద్ద ఎత్తున చేపట్టారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని టీచింగ్ హాస్పిటల్స్, ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో 350 మంది వరకూ వైద్యుల నియామకాలు చేపట్టగా, వారిలో 120 మంది స్పెషలిస్టు వైద్యులు ఉన్నారు. వారితో పాటు బీఎస్సీ నర్సింగ్ చేసిన వారికి మల్టీ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌గా 600 మందిని భర్తీ చేయగా, మరో 700 వరకూ స్టాఫ్ నర్సు పోస్టులు భర్తీ చేశారు. వీరితో పాటు మరో 550 మంది పారామెడికల్ సిబ్బందిని నియమించారు.

పరికరం.. అత్యాధునికం

విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో ఎంఆర్ఐ, క్యాథ్ ల్యాబ్ అందుబాటులోకి వచ్చింది. వీటితో పాటు 60 స్లైస్ అత్యాధునిక టెక్నాలజీ కలిగిన సీటీ స్కాన్‌ను సమకూర్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం గర్భిణులకు స్కానింగ్ చేసేందుకు అత్యాధునిక స్కానింగ్ యంత్రాలు సమకూర్చారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి స్థాయిలో ల్యాబ్ ఎక్విప్‌మెంట్‌ను అందజేశారు.

ఆరోగ్యశ్రీ సేవలు విస్తృతం

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలను మరింత విస్తృతం చేశారు. ప్రపంచాన్ని వణికించిన కోవిడ్‌కు సైతం ఆరోగ్యశ్రీలో చికిత్సలు అందించారు. అంతేకాక డెంగీని సైతం ఆరోగ్యశ్రీ చేర్చారు. ఈ ప్రభుత్వం రాక ముందు 1150 ప్రొసీజర్స్ ఉండగా, ఇప్పుడు ఏకంగా 3,500 ప్రొసీజర్స్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చి సేవలను మరింత విస్తృతం చేసింది. అంతేకాక ఆరోగ్యశ్రీలో చికిత్స పొందిన వారు ఇంటికెళ్లి పనిచేసుకోలేరని భావించి వారు విశ్రాంతి తీసుకునే సమయానికి ఆరోగ్య ఆసరా ఇస్తూ భరోసా కల్పిస్తున్నారు.

మెరుగైన సేవలు



జిల్లాలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. గర్భిణులకు అన్ని రకాల పరీక్షలు చేస్తున్నాం. హైరిస్క్ వారిని ప్రసవం కోసం తరలించేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు అందుబాటులో ఉంచాం. కిడ్నీ రోగుల కోసం డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశాం.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్‌ఓ, ఎన్టీఆర్‌జిల్లా

చాలా మంచి కార్యక్రమాలు



రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో మంచి కార్యక్రమాలు చేస్తోంది. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయి. ఇంటింటి సర్వేతో ప్రజలు ఎలాంటి వ్యాధులతో బాధపడుతున్నారో గుర్తించి వైద్య సేవలు అందిస్తోంది. రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి, ఆస్పత్రిలో చికిత్సలు అవసరమయ్యే వారికి ఆరోగ్యశ్రీలో చేయడం మంచి పరిణామం.

– డాక్టర్ ఎం. రవీంద్రనాథ్, కోశాధికారి, ఐఎంఏ ఏపీ చాప్టర్

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి

గర్భిణులను వైద్య సిబ్బంది నిరంతరం మానిటరింగ్ చేస్తున్నారు. వారిలో హై రిస్క్ ఉన్న వారికి గుర్తించి డెలివరీ తేదీకి ముందుగానే వారిని ఆస్పత్రులకు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వారిని తరలించేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను అందుబాటులోకి తెచ్చారు.



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి వెళ్తున్న బాలింత

నూరు శాతం జీఈఆర్ నమోదు చేయాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



సచివాలయాల పరిశీలనలో భాగంగా సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో బడి ఈడు పిల్లల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) నమోదును క్లస్టర్ల వారీగా నూరు శాతం పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. విజయవాడ నగరంలోని 91,92 సచివాలయాలను కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యకు సంబంధించి బడిఈడు పిల్లల నమోదును సచివాలయ స్థాయి వలంటీర్లు నూరు శాతం పూర్తి చేయాలని సూచించారు. బడి బయట ఉన్న 15 నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లల చైల్డ్ ఇన్ఫో నమోదు ప్రక్రియ పూర్తి కావాలన్నారు. జిల్లాలోని 21వ మండలాలకు సంబంధించి 10,668 క్లస్టర్ల పరిధిలో 3,16,072 మంది బడి ఈడు పిల్లల సర్వే చేపట్టామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ఇప్పటికే 97 శాతం పూర్తయిందని తెలిపారు. జిల్లాలో ఇంకా 2,232 మంది బడిఈడు పిల్లల వివరాలను నమోదు చేయాల్సి ఉందని, వారిలో 1608 మంది విజయవాడ పరిధిలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రతి వలంటీర్ తన పరిధిలోని పదో తరగతి చదివిన పిల్లల వివరాలు సేకరించాలని ఆదేశించారు. వారు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారా? లేదా? ఇంటర్‌మీడియెట్ లేదా ఇతర కోర్సుల్లో చేరారా? వంటి వివరాలు నమోదు చేయాలన్నారు.

హాజరు లేకుంటే ఇబ్బందులు

గిరిపురానికి చెందిన పల్ల రేవంత్ పదో తరగతి ఉత్తీర్ణత సాధించి పాలిటెక్నిక్‌లో అడ్మిషన్ పొందినా కళాశాలకు వెళ్లడం లేదని కలెక్టర్ దృష్టికి స్థానిక వలంటీర్ తీసుకెళ్లారు. కలెక్టర్ ఢిల్లీరావు స్పందించి వెంటనే రేవంత్ తల్లి రిబ్కాతో ఫోన్‌లో మాట్లాడారు. రేవంత్‌ను కళాశాలకు పంపించాలని సూచించారు. సరైన హాజరు లేకపోతే జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన వంటి పథకాలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. సచివాలయ సూచిక బోర్డులపై కృష్ణా జిల్లా అని ఉండటం, మరికొన్నింటిలో తప్పులను గమనించిన కలెక్టర్ వాటిని తక్షణమే సరిచేయాలని అధికారులను ఆదేశించారు. యూసీడీ పీఓ శకుంతల, పాఠశాలల తనిఖీ అధికారి కుంబా రవికుమార్, డెప్యూటీ డీఈఓ కె.వి.ఎస్.రవికుమార్, ఉర్దూ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ నదాయతుల్లా పాల్గొన్నారు.

ధ్రువపత్రం.. సులభతరం

- కుల, నివాస, జనన ధ్రువీకరణ పత్రం ఒక్కసారి పొందితే చాలు
- ఒరిజినల్ పోయినా అదే నంబరుతో కొత్త సర్టిఫికెట్ జారీ
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- కొత్త సర్టిఫికెట్ కోసం ఒత్తిడి చేయవద్దని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ఆదేశాలు



చిలకలపూడి(మచిలీపట్నం): విద్య, ఉద్యోగ, ఇతర అవసరాల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల జారీని రాష్ట్ర ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులూ ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచన చేసి దీనికి మార్గదర్శకాలు రూపొందించారు. ఈ మార్గదర్శకాలతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఒక్కసారి పొందితే చాలు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వుల మేరకు కుల, నివాస, జనన వివరాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ ఒకసారి తీసుకుంటే చాలు.
- ఒకసారి పొందిన సర్టిఫికెట్లను శాశ్వత ధ్రువీకరణ పత్రాలుగా పరిగణించాలి.
- ప్రతిసారీ కొత్త సర్టిఫికెట్ కోసం ఒత్తిడి తేవొద్దని పాఠశాల, ఉన్నత, సాంకేతిక, వైద్య విద్య శాఖలు, స్కిల్ డెవలప్‌మెంట్, వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య తదితర సంక్షేమశాఖలతో సహా అన్ని ప్రభుత్వశాఖలు, ప్రైవేటు సంస్థలకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

ఒరిజినల్ పోయినా..

- ఒరిజినల్ సర్టిఫికెట్లు ఎక్కడైనా పోయినా వాటి కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు.
- అభ్యర్థులు గ్రామ/వార్డు సచివాలయం లేదా మీ–సేవ కేంద్రాల్లో తమ దగ్గర ఉన్న జిరాక్స్ కాపీలో ఉన్న నంబరుతో కొత్త సర్టిఫికెట్ పొందే వెసులుబాటు కల్పించారు.
- ఇందుకు ఏ విధమైన డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదు.
- కుటుంబంలో గతంలో ఎవరు ఎలాంటి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ పొంది ఉండకపోతే దరఖాస్తుదారు ప్రస్తుతం ఈ–కేవైసీ చేయించుకుని తహసీల్దార్ ద్వారా ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంది.
- ఒకవేళ దరఖాస్తుదారు ఈ–కేవైసీ చేయించుకుని సర్టిఫికెట్ పొంది ఉంటే అతని తల్లి లేక తండ్రి తరపు రక్తసంబంధీకులు ఎవరైనా ఎలాంటి వెరిఫికేషన్ లేకుండా తహసీల్దార్ నుంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం కులధ్రువీకరణ పత్రం పొందొచ్చు.

ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం



కుల, నివాస, జనన ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు, అభ్యర్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఈ ఉత్తర్వులతో తీరినట్లయింది. ఒక్క సారి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ తీసుకుంటే అది శాశ్వత సర్టిఫికెట్‌గా పనిచేస్తుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కొత్తగా సర్టిఫికెట్లు తీసుకువెళ్లాలనే సమస్య లేకుండా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం ప్రింట్ అవుట్ల ద్వారా పరిశీలించుకునే అవకాశం కల్పించారు. కొత్త సర్టిఫికెట్ కోసం ఒత్తిడి చేయవద్దని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు కూడా ఆదేశాలు జారీ అయ్యాయి.

– పి.రాజాబాబు, కృష్ణా జిల్లా కలెక్టర్

క్లుప్తంగా

మహిళలను గౌరవించలేని సంస్కృతి టీడీపీది

బందరు మేయర్ వెంకటేశ్వరమ్మ



కోనేరుసెంటర్: రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజాపై టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ చేసిన అనుచిత వ్యాఖ్యలను వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మహిళా నాయకులు తీవ్రంగా ఖండించారు. మహిళలను గౌరవించే సంస్కృతి తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచి లేదని, అదే ధోరణిని ఆ పార్టీ నాయకులు ఇప్పటికీ కొనసాగిస్తున్నారని విమర్శించారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ బండారు సత్యనారాయణ వయసు తగినట్లుగా మాట్లాడటం, వ్యవహరించటం అలవరుచుకోవాలన్నారు. లేదంటే మహిళల ఆగ్రహానికి తెలుగుదేశం పార్టీ గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. డెప్యూటీ మేయర్‌లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి మాట్లాడుతూ మంత్రి రోజాకు బండారు వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, మహిళా కార్పొరేటర్‌లు ముంతాజ్‌బేగం, కోఆప్షన్ సభ్యురాలు మట్టా తులసీ, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ చింతా మౌనిక పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నార్త్ మండల పరిధిలోని నిషేధిత భూముల జాబితా సెక్షన్ 22(ఏ)లో ఉన్న భూముల తొలగింపునకు మార్గం సుగమం అయ్యిందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఈనెల 3న జిల్లా రిజిస్ట్రార్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు గురువారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ గతంలో పేదలకు కేటాయించిన ఇళ్ల ప్లాట్లను కేవలం అనుభవించడానికి మాత్రమే ఇప్పటివరకు అవకాశం ఉండేదని, ఇందుకు అడ్డంకిగా ఉన్న 22(ఏ) నిషేధిత భూముల జాబితా నుంచి సదరు భూములను తొలగించి.. జీవో నంబర్ 4 ప్రకారం ఇకపై వారి పేరున రిజిస్ట్రేషన్ చేసి పూర్తి హక్కులు కల్పిస్తారన్నారు. దీని ద్వారా నార్త్ పరిధిలో 20,944 కుటుంబాలకు మేలు కలుగుతుందన్నారు. లబ్ధిదారులు నేటి నుంచి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని అధికారులను సంప్రదించి.. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసుకోవలసిందిగా సూచించారు.

ఆయుర్వేదానికి మంచి రోజులు

- మారుతున్న కోలవెన్ను ఆయుర్వేద ఆస్పత్రి రూపురేఖలు
- ప్రభుత్వం, దాతల సహకారంతో శరవేగంగా ఆధునికీకరణ పనులు
- మెరుగ్గా అందుతున్న ఆయుర్వేద వైద్య సేవలు
- పెరుగుతున్న ఓపీ



కోలవెన్ను గ్రామంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి



కొలిక్కి వచ్చిన ప్రహరీ పనులు

కంకిపాడు(పెనమలూరు): సమకూరుతున్న వసతులతో ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి రూపురేఖలు మారిపోతున్నాయి. అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. వసతుల కల్పన పూర్తయితే కోలవెన్ను ఆయుర్వేద ఆస్పత్రి ద్వారా రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఆయుర్వేద వైద్యం అందుబాటులోకి రానుంది.

ఇదీ పరిస్థితి..

దాతల సహకారంతో కోలవెన్ను గ్రామంలో 96 సెంట్ల స్థలం ప్రభుత్వానికి వితరణగా అందించారు. ఈ స్థలంలో 1938 నుంచి ఆయుర్వేద వైద్య సేవలు అందుతున్నాయి. గతంలో ఈ ఆస్పత్రి ద్వారా ప్రతి రోజూ 10, 20 మంది రోగులకు మాత్రమే ఆయుర్వేద వైద్యం అందేది. అలాంటిది ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13 ఆయుర్వేద ఆస్పత్రులను గతేడాది ఆగస్టులో స్పెషలిస్ట్ వెల్‌నెస్ అండ్ పంచకర్మ సెంటర్‌గా ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి నుంచి ఆస్పత్రి ద్వారా పక్షవాతం, మోకాళ్ల, కీళ్ల నొప్పులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో పాటుగా పంచకర్మ చికిత్సలో అభ్యంగ, స్వేదకర్మ, పిండస్వేద, కటివస్తి, జానువస్తి, గ్రీవావస్తి, క్షారసూత్ర, అగ్నికర్మ, జలగ వైద్యంతో పాటుగా అనేక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. యోగా సేవలు ప్రజలకు నిత్యం అందుతున్నాయి. 20కి మించి పెరగని ఆస్పత్రి ఓపీ, ప్రస్తుతం 100కు చేరింది. ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి రోగులు దీర్ఘకాలిక వ్యాధులకు, పంచకర్మ, జలగ వైద్యం కోసం ఇక్కడికి తరలివస్తున్నారు.

చురుగ్గా వసతుల కల్పన..

ఆస్పత్రిలో నిత్యం రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతుండటంతో వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు ఆయుష్ శాఖ నివేదికలతో కేంద్ర ప్రభుత్వం వసతుల కల్పనకు తొలి విడతగా రూ. 3.50 లక్షలు నిధులు కేటాయించింది. ఈ నిధులతో ఆస్పత్రిలో వసతుల కల్పన శరవేగంగా సాగుతోంది. ఆస్పత్రి భవనం ముందు వైపు ప్రహరీ, భవనానికి రంగులు, మరుగుదొడ్ల అభివృద్ధి, వాహనాల పార్కింగ్ షెడ్, ఆస్పత్రి భవనంలో ప్రత్యేక చికిత్సలు అందించేందుకు పార్టిషన్, సీలింగ్, ఫ్లోరింగ్ వంటి పనులు వేగంగా పూర్తవుతున్నాయి. ప్రభుత్వ నిధులకు గ్రామానికి చెందిన దాతలు రూ. 2.50 లక్షలు వితరణ ఇవ్వటంతో అభివృద్ధి పనుల్లో వేగం పెరిగింది. విద్యుత్ అంతరాయాల సమయంలో వైద్య సేవలకు ఆటంకం ఏర్పడకుండా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు, రక్షిత మంచినీటి యూనిట్, సీసీ కెమెరాల ఏర్పాటు పనులను చేపడుతున్నారు. రెండో విడతలో ఆస్పత్రి అభివృద్ధికి రూ. 5 లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో ఆస్పత్రి భవనం వెనుక వైపు ప్రహరీ నిర్మాణం, ఫెన్సింగ్, అదనపు మరుగుదొడ్ల నిర్మాణాలను చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. అంతే కాకుండా ఆస్పత్రి ప్రాంగణం మొత్తం ఆయుర్వేదంలో ఉన్న వివిధ రకాల మొక్కలను నాటి నర్సరీని అభివృద్ధి చేసేందుకు ఆయుష్ శాఖ చర్యలు చేపట్టింది.

సేవలను విస్తృత పరుస్తాం..



అప్‌గ్రేడ్ అయిన స్థాయికి అనుగుణంగా సిబ్బంది నియామకం జరిగింది. తాజాగా ఇద్దరు హౌస్ సర్జన్‌లు కూడా వచ్చారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సిబ్బంది, వసతుల కల్పన వేగంగా జరుగుతోంది. ఆయుర్వేద నర్సరీని కూడా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వైద్య సేవలను విస్తృతంగా సమర్థంగా అందించాలని కృషి చేస్తున్నాం. వసతుల కల్పనకు ప్రభుత్వంతో పాటుగా దాతలు కూడా మరింత సహకారం అందిస్తే ఆయుర్వేద వైద్యసేవలు విస్తృతంగా అందుతాయి.

– డాక్టర్ పి.నీలిమ, వైద్యాధికారి, కోలవెన్ను ఆయుర్వేద ఆస్పత్రి

మెరుగైన వైద్యం..

ప్రభుత్వం, దాతల సహకారంతో వసతుల కల్పన జరుగుతుండటంతో మరింత మెరుగ్గా వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. వైద్యాధికారి, ఇద్దరు హౌస్ సర్జన్‌లు, కాంపౌండర్, నైట్‌వాచ్‌మెన్, గార్డెనర్, యోగా శిక్షకులు ఇద్దరు, పంచకర్మ సిబ్బంది ఇద్దరు వైద్య సేవలు అందిస్తున్నారు. పూర్తి స్థాయి సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో గౌతమ్ విద్యార్థుల విజయం



గుడివాడటౌన్: మేథమేటిక్స్ టీచర్స్ అసోసియేషన్ (ఇండియా) ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా గత నెల మూడో తేదీన నిర్వహించిన ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫైయర్స్ ఇన్ మేథమెటిక్స్ పోటీలో డాక్టర్ కేకేఆర్ గౌతమ్స్ స్కూల్ గుడివాడకు చెందిన 16 మంది విద్యార్థులు విజయం సాధించినట్లు ఫ్యాక్ట్ ప్రిన్సిపాల్ ఎం.రామిరెడ్డి తెలిపారు. ఈ పోటీలలో సీహెచ్ ఉజ్వల్‌రామ్, బీవీ చంద్రశేఖరరెడ్డి, పి.నవదీప్, సీహెచ్ వెంకట సాయి అనీస్, పి.మోహిత్, ఎ.నరేంద్ర, సీహెచ్ శ్రీరామ్‌రెడ్డి, సీహెచ్ శ్యామ్ సందేష్, వి.మంజునాథ్, వీవీ కౌశిక్‌రెడ్డి, జె.లీలా సాత్విక్, బి.హనీష్, పి.యశ్వంత్, జె.నాగయశ్వంత్, బి.అవినాష్‌రెడ్డి, వై.హారిక ఎంపికయ్యారు. అక్టోబర్ 29న జరుగబోయే 2వ లెవల్ పోటీలలో వీరు పాల్గొంటారన్నారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులను ఫ్యాక్ట్ ప్రిన్సిపాల్ ఎం.రామిరెడ్డిలను ప్రిన్సిపాల్స్ ఎం.సత్యారామ్, పీఎల్ ప్రసాద్, కె.జ్యోతి, జబ్రీనా తదితరులు అభినందించారు.

దసరా ఉత్సవ ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పర్యటన

క్యూలైన్లు, కేశఖండనశాలను పరిశీలించిన సీపీ, డీసీపీలు



ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ రాణా, ఇతర అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా అన్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాల ఏర్పాట్లను డీసీపీ విశాల్‌గున్నీ, ఏఐజీ ఎం. రవీంద్రబాబు, దుర్గగుడి ఈవో భ్రమరాంబ, ఇతర ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సీపీ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి ప్రారంభమయ్యే క్యూలైన్లతో పాటు వీఎంసీ కార్యాలయం ఎదుట దేవస్థానం ఏర్పాటు చేస్తున్న కేశఖండనశాల షెడ్డు, క్యూలైన్లను పరిశీలించారు. అమ్మవారికి తలనీలాలు సమర్పించే భక్తులు వేచి ఉండకుండా త్వరితగతిన ముందుకు సాగేలా క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లను చేయాలని సూచించారు. అనంతరం పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు. కనకదుర్గనగర్‌లో ప్రసాదాల కౌంటర్లను పరిశీలించి ఇంజినీరింగ్ సిబ్బందికి సూచనలిచ్చారు. ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఈ లింగం రమాదేవి, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, సీఐ సురేష్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐదు ప్రాణాలను కాపాడిన వైద్యులు

నెలలు నిండకుండానే పుట్టిన శిశువులకు చికిత్స



శిశువులు, వారి తల్లిదండ్రులతో వైద్యులు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడలోని అంకుర ఆస్పత్రిలోని నిపుణులైన వైద్య బృందం నెలలు నిండకుండానే జన్మించిన నవజాత శిశువుల ప్రాణాలు కాపాడిందని ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి.వి.విజయ్‌కుమార్, హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్‌రావు తెలిపారు. గురువారం ఆస్పత్రిలో వారు విలేకరులతో మాట్లాడుతూ నెలలు నిండకుండా అతి తక్కువ బరువుతో పుట్టిన శిశువుల ప్రాణాలను కాపాడామన్నారు. అత్యాధునిక సౌకర్యాలను ఉపయోగించి, అనుభవజ్ఞులైన వైద్యుల బృందం ఈ చికిత్సను విజయవంతం చేసిందన్నారు. సమావేశంలో ఆస్పత్రి వైద్యులు ఇందుశ్రీ సత్తి, శ్రీముఖి అనుమోలు, రాజా అశోక్ కోగంటి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి



ఉరేసుకొని మృతి చెందిన వ్యక్తి

పామర్రు: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పామర్రులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలో కంచర్లవానిపురం వద్ద బుధవారం రాత్రి సమయంలో సుమారు 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని మగ వ్యక్తిని ఏదో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లి పోయింది. ఈ సంఘటనలో ఆ వ్యక్తి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. చనిపోయిన వ్యక్తి బ్లూ కలర్ గళ్ల లుంగీ, గోధుమ రంగు టీషర్టు ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు 9440796431, 8332988799లో తెలపాలని పామర్రు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కోరారు.

ఉరేసుకుని మరో గుర్తుతెలియని వ్యక్తి..

కంచికచర్ల : ఓ గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు మండలంలోని పరిటాల నేషనల్ హైవే పక్కన గల చెట్టుకు ఓ గుర్తు తెలియని వ్యక్తి (35) మృతిచెందాడు. మృతుడి ఒంటిపై ఎరుపు టీ షర్టు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంది గామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కృష్ణాపై ప్రకాశం జిల్లా జట్టు విజయం

నరసరావుపేట: స్థానిక ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల బాలుర మూడు రోజుల టెస్ట్ క్రికెట్ పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు 163 పరుగుల భారీ తేడాతో కృష్ణా జిల్లా జట్టుపై విజయం సాధించింది. మూడురోజుల నుంచి కృష్ణా, ప్రకాశం జిల్లా జట్ల మధ్య మొదటి మ్యాచ్ జరుగుతున్న విషయం విదితమే. నిన్నటి ఓవర్ నైట్ స్కోర్ తొమ్మిది వికెట్ల నష్టానికి 187పరుగులతో గురువారం బ్యాటింగ్ ప్రారంభించిన ప్రకాశం జిల్లా జట్టు 189 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం తమ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కృష్ణా జిల్లా జట్టు ఆటగాళ్లు 152 పరుగులు చేసి ఆలౌట్ అయ్యారు. కృష్ణా జిల్లా జట్టులోని విశాల్ మాత్రమే పోరాడి 58 పరుగులు చేశారు.

క్రీడా సంబరాలను విజయవంతం చేద్దాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



క్రీడా పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'ఆడుదాం ఆంధ్ర'లో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. నవంబర్ 15 నుంచి నిర్వహించనున్న ఈ క్రీడల నిర్వహణకు ప్రభుత్వం పంపిణీ చేసిన స్పోర్ట్స్ కిట్లను గురువారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించి క్రీడా ప్రాధికార సంస్థ అధికారులకు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి యువతలో క్రీడా స్ఫూర్తిని వెలికి తీసి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే విధంగా క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలను నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో నవంబర్ 15వ తేదీ నుంచి డిసెంబర్ 21 వరకు నిర్వహించే ఆడుదాం ఆంధ్ర క్రీడలలో అధిక సంఖ్యలో పాల్గొనేలా క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. క్రికెట్ బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఐదు క్రీడాంశాలలో పోటీలకు సంబంధించి క్రీడా పరికరాలను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. ఇందులో బేసిక్ విభాగానికి సంబంధించి మహిళా, పురుషులకు వేర్వేరుగా ఒక్కో కిట్టు, ప్రొఫెషనల్ విభాగానికి సంబంధించి మహిళ, పురుషులకు ఒక్కో కిట్టు చొప్పున పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎ. సంపత్ కుమార్, శాప్ సీఈఓ శ్రీనివాసరావు, చీఫ్ కోచ్ అజీజ్ పాల్గొన్నారు.

చురుగ్గా భూ హక్కు పత్రాల పంపిణీ

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో రెండోదశ భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోందని కృష్ణా కలెక్టర్ పి. రాజాబాబు ఉన్నతాధికారులకు తెలిపారు. సచివాలయం నుంచి సీసీఎల్ఏ సాయిప్రసాద్, అదనపు సీసీఎల్ఏ ఏఎండీ ఇంతియాజ్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు జిల్లాకు సంబంధించిన పురోగతిని వారికి వివరించారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలో 27,802 రెండోదశ భూహక్కు పత్రాలను రైతులకు అందజేశారన్నారు. జిల్లాకు 30,159 భూహక్కు పత్రాలు వచ్చాయన్నారు. మిగిలిన పత్రాలను రానున్న కొద్దిరోజుల్లో పంపిణీ చేస్తామన్నారు. మూడోదశ స్టోన్ ప్లాంటేషన్‌కు సంబంధించి జిల్లాకు 2,282 స్టోన్స్ వచ్చాయని, వీటిలో 1,978 స్టోన్ ప్లాంటేషన్ చేశామన్నారు. మూడో దశ రీ-సర్వే డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో రీ-సర్వే ప్రారంభించామని ఇప్పటి వరకు 10గ్రామాల్లో సర్వే పూర్తయ్యిందన్నారు. సమావేశంలో సర్వేశాఖ ఏడీ పి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విమానాశ్రయ నిర్వాసితులకు స్టాంప్ డ్యూటీ మినహాయింపు



జీఓ కాపీని చూపుతున్న తోట వెంకయ్య

గన్నవరం: విమానాశ్రయ విస్తరణలో ఇళ్ల కోల్పోయిన నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద స్థలాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు స్టాంప్ డ్యూటీ మినహాయించినట్లు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య తెలిపారు. స్టాంప్ డ్యూటీ రూ. 3,76,25,850 మినహాయింపు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 470 విడుదల చేసినట్లు చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. విమానాశ్రయ విస్తరణలో ఇళ్లు కోల్పోయిన 423 కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం ఐదు సెంట్లు చొప్పున స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చొరవతో లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలను రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ స్టాంప్ డ్యూటీ చెల్లించకపోవడంతో పెండింగ్ ఉన్నాయని తెలిపారు. పేద వర్గాలకు చెందిన లబ్ధిదారులు స్టాంప్ డ్యూటీ నిమిత్తం రూ. 90 వేలు చొప్పున చెల్లించాల్సి ఉండడంతో ఎమ్మెల్యే వంశీమోహన్ ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి లబ్దిదారులు చెల్లించాల్సిన రూ. 3.76 కోట్లు స్టాంప్ డ్యూటీ పూర్తిగా మినహాయించారని తెలిపారు. దీనివల్ల లబ్ధిదారులైన 423 కుటుంబాలకు ఉచితంగా రిజిస్ట్రేషన్ పూర్తిచేసి దస్తావేజులను అధికారులు అందజేయనున్నట్లు చెప్పారు. గత ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే వంశీమోహన్, స్టాంప్ డ్యూటీ మినహాయింపు కల్పించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీఐఏ యాప్ ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ పోలా భాస్కర్



ఉన్నత విద్యా కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న తిరువూరు డిగ్రీ విద్యార్థులు, కౌన్సిలర్లు

మైలవరం: కంటిన్యూస్ ఇంటర్నల్ అసెస్మెంట్ (సీఐఏ) యాప్‌ను పైలెట్ ప్రాజెక్టుగా మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగిస్తున్నారని కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ డాక్టర్ పోలా భాస్కర్ తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సీఐఏ యాప్‌ను ప్రారంభించారు. కళాశాలలో ప్రతిష్టాత్మకంగా, ఏ కళాశాలలో లేని విధంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఎక్సెల్ ఈడీ స్టూడియోను ప్రారంభించారు. వీటిలో రికార్డు చేసిన వీడియోలను లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఎల్ఎంఎస్) అప్లోడ్ చేస్తారని డాక్టర్ పోలా భాస్కర్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడుతూ ఈ స్టూడియో ద్వారా తరగతులను రాష్ట్రంలోని ఏ కళాశాల విద్యార్థులైన వర్చువల్ మోడ్‌లో వీక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ సీహెచ్ తులసి, ఏ.వీ. కవిత, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల అభివృద్ధి చేయాలని వినతి

తిరువూరు: తిరువూరు ప్రభుత్వ డిగ్రీకళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని గురువారం మైలవరం వచ్చిన రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కమిషనర్ పోలా భాస్కర్‌కు విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రిన్సిపాల్ ఫీజుల చెల్లింపునకు వేధిస్తున్నారని కమిషనర్ దృష్టికి తెచ్చారు. తిరువూరు నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, మూడు దుర్గారావు, పరసా సత్యనారాయణ, పసుపులేటి శేఖర్‌బాబు కళాశాల సమస్యలను కమిషనర్‌కు వివరించారు.

7,8 తేదీల్లో డిజిటల్ పెయింటింగ్ ఎగ్జిబిషన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సునీల్‌కుమార్ తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఈ నెల 7, 8 తేదీలలో శ్రీప్రభాతాలు పేరుతో డిజిటల్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ అండ్ సేల్ నిర్వహిస్తున్నట్లు ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ కన్వీనర్ ఎ.సునీల్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం బాలోత్సవ్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీప్రభాతాలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ మెట్రో నగరాలకు మాత్రమే పరిమితమైన కొన్ని కళా సంస్కృతులను నగరంలో పెంపొందించాలనే ఉద్దేశంతో ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను 7వ తేదీన ఉదయం 10.30 గంటలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ప్రారంభిస్తారని, ప్రత్యేక అతిథిగా టాలీవుడ్ హీరోయిన్, మసూద మూవీ ఫేమ్ బాంధవి శ్రీధర్ హాజరవుతారని తెలిపారు. 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ప్రముఖ డిజిటల్ ఆర్టిస్ట్ అనుపోజు జయశ్రీ ప్రభాకర్‌చే డిజిటల్ పెయింటింగ్స్ ఎలా చేయాలి అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు ఉంటుందన్నారు. అనంతరం డిజిటల్ పెయింటింగ్ కాంటెస్ట్‌లో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ కో కన్వీనర్ గిరిధర్ అరసవల్లి, కార్యక్రమ నిర్వాహకుడు స్ఫూర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

పెడన: ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెడన మండలం చేవేంద్రకు చెందిన దుంపల వీరబాబు(35), లంకలకలువగుంటకు చెందిన వై. రాంబాబు కలిసి వడ్లమన్నాడు వంతెన వద్ద మద్యం దుకాణానికి ఈ నెల 3న వెళ్లారు. అక్కడ రాంబాబు సెల్‌ఫోన్ పోవడంతో నా ఫోన్ నువ్వే తీశావంటూ రాంబాబు వీరబాబుతో గొడవపడ్డారు. మరుసటి రోజు బుధవారం ఉదయం పెద్ద మనుషుల దృష్టికి ఫోన్ గొడవను రాంబాబు తీసుకువెళ్లడంతో వారు గురువారానికి వాయిదా వేశారు. దీంతో తీవ్రమనస్తాపానికి గురైన వీరబాబు తన ఇంటిలోని గడ్డిమందును సేవించి బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీంతో వీరబాబును కుటుంబసభ్యులు హుటాహుటిన గుడ్లవల్లేరు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం చనిపోయాడు. వీరబాబు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసిన ఏఎస్ఐ బలరాం దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఇంధనం ఆదా చేసిన డ్రైవర్లకు పారితోషికాలు



ఆటోనగర్(విజయవాడతూర్పు): ప్రతి నెలా ఇంధనం ఆదా చేసిన ఆర్టీసీ డ్రైవర్లకు పారితోషకం అందజేస్తున్నట్లు ఆటోనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కె.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. స్థానిక డిపో ఆవరణలో సెప్టెంబర్ నెలకు సంబంధించి ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లకు ఆయన గురువారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ప్రతి నెలా డ్రైవర్లు చాకచక్యంతో బస్సును నడిపి ఇంధనం పొదుపు చేస్తున్నారన్నారు. ఇక్కడ పనిచేసే డ్రైవర్లు ఆర్టీసీకి ఆదాయం తీసుకువచ్చే విధంగా ఇష్టపడి పని చేయాలని చెప్పారు. వీరి సేవలను సంస్థ గుర్తించి ప్రోత్సాహకాలు అందజేస్తోందన్నారు. అనంతరం ఇంధనం పొదుపు చేసే విధానాలపై డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా స్టోర్స్ డైరెక్టర్ల ఎంపిక

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కన్జ్యూమర్ కో ఆపరేటివ్ స్టోర్స్ డైరెక్టర్లుగా ఐదుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు స్టోర్స్ చైర్మన్ వేమూరి సామ్రాట్‌కుమార్ గురువారం తెలిపారు. గతంలో పని చేసిన డైరెక్టర్ల పదవీకాలం ముగిసింది. మరలా డైరెక్టర్ల ఎన్నిక జరపాల్సి ఉండగా.. పోటీకి ఎవ్వరు లేకపోవడంతో కొత్తగా మరో ఐదుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. వార్డు నంబర్లు 2, 9, 19, 24, 25 కు సందడి రమేష్, కొమ్మిడి శ్రీనివాసరెడ్డి, యర్రంశెట్టి వెంకట నాంచారయ్య, డాక్టర్ అబ్దుల్ కలాం, కొండెపాటి మోహనరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు ఆఫీస్ బ్యారర్లుగా మరో ఐదుగురిని ఎన్నుకున్నామని చెప్పారు.

నేషనల్ క్రికెట్ లీగ్‌కు సిద్ధార్థ స్కూల్ విద్యార్థుల ఎంపిక



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఈ నెల 11, 12 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న నేషనల్ క్రికెట్ లీగ్‌కు తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక అయ్యారని వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య తెలిపారు. నేషనల్ క్రికెట్ సెలెక్షన్స్ అండర్–14 లెవెల్‌లో కె.పూజిత్, ఆర్.శివ, హిత్‌జైన్, వై.ఆదిత్య ఉదయ్, ఎ.లిఖితాక్స్, అండర్–16 విభాగంలో జె.గౌతమ్, ఎ.ప్రణయ్, వైవీ.శ్రీమంత్ ఎంపికయ్యారన్నారు. తాడేపల్లిగూడెంలోని ఎక్సెన్స్ అకాడమీలో ఈ ఎంపికలు జరిగాయన్నారు. నేషనల్ క్రికెట్ లీగ్‌కు ఎంపికైన విద్యార్థులను స్కూల్ ఆవరణలో వైస్ ప్రిన్సిపాల్ మేరీ, కోచ్ డి.భీమారావు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

నేడు వార్డు వలంటీర్లకు ఇంటర్వ్యూలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలోని ఆయా వార్డు సచివాలయాల పరిధిలోని ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఇంటర్వ్యూలు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. ఆయా వార్డులకు సంబంధించిన దరఖాస్తుదారులు చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలోని జోనల్ కమిషనర్ చాంబర్లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, ఇంటర్వ్యూలు హాజరయ్యేవారు తమ అర్హత, ధ్రువీకరణ పత్రాలతో రావాలన్నారు. వివరాలకు స్పెషల్ అధికారి 81859 33187 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో ఉపాధి అవకాశాలు



పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులకు బ్యాంకింగ్ ఫైనాన్స్, బీమా రంగాల్లో ఉపాధి అవకాశాలు మరిన్ని పెరుగుతున్నాయని, వాటిని అందిపుచ్చుకునేలా తగిన శిక్షణ పొందాలని బజాజ్ ఫిన్ సర్వ్ డెప్యూటీ జనరల్ మేనేజర్ పల్లవి గ్రంధాలిక తెలిపారు. స్టెల్లా కళాశాలలో బజాజ్ ఫిన్ సర్వ్ ఆధ్వర్యంలో గురువారం కామర్స్ విద్యార్థులకు నిర్వహించిన సర్టిఫికెట్ ప్రోగామ్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ అధికారి డాక్టర్ లీన కద్రస్, డాక్టర్ లావణ్య, ఎంబీఏ ఫ్యాకల్టీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

ఆంధ్రప్రదేశ్‌కు సీఎం జగనే ఎందుకు కావాలిపై శిక్షణ కార్యక్రమంలో అవినాష్



సమావేశంలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

పటమట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్‌కు సీఎం జగనే ఎందుకు కావాలనే నినాదంతో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం చేయాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గురువారం నియోజకవర్గంలోని పలు కీలక నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలకు ఆయన శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో అమలయ్యిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, 2024లో బూటకపు హామీలతో వస్తున్నావు, నీ అబద్ధపు హామీలు మాకు తెలుసు, నిన్ను నమ్మం బాబూ అంటూ ప్రచారం చేయాలన్నారు. కార్యకర్తలకు, నాయకులకు అందుకు సంబంధించి శిక్షణ అందిస్తున్నామని, ఈ శిక్షణ ఐదు అంశాలపై ఉంటుందని, సమోదు/సోషల్ మీడియా కార్యకలాపాలు, వివరాణ్మతక వీడియో ద్వారా ప్రభుత్వ పథకాల ప్రచారం, నినాదాలు, నాయకుల ప్రసంగాలు, సీనియర్ నాయకులు ఓటర్లతో లంచ్, డిన్నర్ చేయాలని తెలిపారు.

10 గృహాలను సందర్శించాలి

సోషల్ మీడియాలో టీమ్ జగనన్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వాట్సాప్‌లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్, జగనన్నకు తోడుగా చానల్స్‌ను ఫాలో కావాలని సూచించారు. ఇంటింటి ప్రచారం, సచివాలయాల వారీగా శిబిరాలు నిర్వహించి ప్రచారం చేయాలన్నారు. ప్రతి రోజు సాయంత్రం 3–5 గంటల వరకు సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డులు ప్రదర్శిన జరిగే చర్యలు తీసుకోవాలని, సాయత్రం తమ ప్రాంతంలో 5–7 గంటల మధ్య వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేయాలని, స్థానిక పెద్దలతో డిన్నర్, రాత్రి బస చేయాలని, మండల పార్టీ అధ్యక్షులు ప్రతి సచివాలయం పరిధిలో కనీసం 10 గృహాలను సందర్శించి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలనే అంశాన్ని ప్రచారం చేయాలన్నారు. గృహ సారథులు, వార్డు వలంటీర్లు ఇంటింటి ప్రచారం చేయాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, పార్టీ యువజన విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కొరివి చైతన్య, సీనియర్ నాయకుడు కడియాల బుచ్చిబాబు, పార్టీ ఇన్‌చార్జిలు, అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పోలీసు, మున్సిపల్, ట్రాన్స్‌పోర్ట్, నేషనల్ హైవే, ఆర్అండ్‌బీ అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ .ఢిల్లీరావు ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన బ్లాక్ స్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి ప్రమాదాలకు గల కారణాలు, నివారణకు చేపట్టాల్సిన చర్యలపై కమిటీ నివేదిక సమర్పించాలని కలెక్టర్ కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ఆయా శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాలను అరికట్టాలన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినప్పటికీ ఇంకా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయన్నారు.

111 బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు..

నగరపాలక సంస్థ పరిధిలో 29, జాతీయ రహదారి పరిధిలో 55, ఆర్అండ్‌బీ పరిధిలోని 5 ప్రాంతాలతో కలిపి మొత్తం 89 ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మరో 22 ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించామన్నారు. వీటిని పునఃపరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రమాదాలు తరచూ జరిగే ప్రాంతానికి సంబంధించి ఆయా శాఖల అధికారులతో ప్రత్యేక కమిటినీ ఏర్పాటు చేయాలని డీటీసీ పురేంద్రను ఆదేశించారు. కమిటీ సభ్యులు బ్లాక్ స్పాట్లను తనిఖీ చేసి 15 రోజుల్లోగా నివేదికలు సమర్పించాలన్నారు. విజయవాడ నగరంలో మరో 14 చోట్ల సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సి ఉందని, వాటిని సత్వరమే ఏర్పాటు చేయాలని చెప్పారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే హోర్డింగ్స్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహించడం వలన ట్రాఫిక్ ఇబ్బంది కలుగుతుందన్నారు. ఆక్రమణలపై టౌన్ ప్లానింగ్ విభాగం, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు, ట్రాన్స్‌పోర్ట్ సిబ్బందితో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి ఆక్రమణలు తొలగించాలన్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీసీపీ ఎం.సత్తిబాబు, డీటీసీ పురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు

- 18వ డివిజన్‌లో రూ.90 లక్షలతో నిర్మాణం
- త్వరలో అందుబాటులోకి రానున్న కమ్యూనిటీ హాల్
- తీరనున్న రాణిగారితోట ప్రజల చిరకాల స్వప్నం



చివరి దశకు చేరుకున్న కమ్యూనిటీ హాల్ భవనం

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారితోట 18వ డివిజన్‌లోని ఆర్సీఎం స్కూల్ వద్ద ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. రూ.90 లక్షల వ్యయంతో చేపట్టిన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి.

పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నివసించే రాణిగారితోట ప్రాంతంలో శుభకార్యాలు చేసుకునేందుకు కల్యాణ మండపాలు లేక స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా గత ప్రభుత్వం ఆర్సీఎం స్కూల్ పక్కనే ఉన్న మల్లెల తిరుపతమ్మ కూరగాయల మార్కెట్‌ను తొలగించి ఆ ప్రదేశంలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాన్ని చేపట్టింది. కొంతమేర గ్రౌండ్‌ఫ్లోర్ నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత పనులు మధ్యలో నిలిపివేశారు.

ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలోని అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులపై దృష్టి సారించింది. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చొరవతో స్థానిక కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సుమారు రూ.90 లక్షలు మంజూరు చేయించి భవన నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం భవనానికి రంగులు వేస్తున్నారు. భవనంలో గ్రౌండ్ ఫ్లోర్ భోజనాలకు, మొదటి అంతస్తు శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా పెద్ద హాల్, వధూవరులకు విడివిడిగా రూమ్‌లు ఏర్పాటు చేశారు. త్వరలో అందుబాటులోకి రానున్నడంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కల్చరల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్ర లయోలా కళాశాలలో బుధ, గురువారాల్లో జరిగిన జనిత్రా రాష్ట్రస్థాయి కల్చరల్ పోటీల్లో నగరంలోని శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. ఆ అకాడమీలో ఇంటర్మీడియెట్, డిగ్రీతో పాటు ఐఏఎస్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. ఆ పోటీల్లో భాగంగా నిర్వహించిన మాక్ పార్లమెంట్‌లో మొదటి నాలుగు స్థానాలు, డిబేట్‌లో మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. క్విజ్‌లో మొదటి మూడు స్థానాలు, ఎడ్యుకేషన్ స్కిట్ పోటీలో రెండవ స్థానం సాధించడంతో పాటు, ఓవరాల్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నారు. శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఎక్స్‌ట్రా కరిక్యులర్ , కోకరిక్యులర్ యాక్టివిటీస్‌లో పాల్గొనడం వలన లీడర్‌షిప్ స్కిల్స్ పెరుగుతాయన్నారు. లయోలా కాలేజ్ యాజమాన్యాన్ని ప్రోగ్రాం కోఆర్డినేటర్ కళ్యాణ్ దత్త ప్రశంసించారు. కరెంట్ అఫైర్స్‌పై పట్టు ఈ విజయానికి కారణమని విజేతలు యుక్త, సాత్విక, స్వరూప, సంజన, మోహన్ తెలిపారు.

జగనన్న లే అవుట్లలో నిర్మాణాలు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): జగనన్న గృహ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి, పేదలందరికీ జగనన్న ఇళ్లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన హౌసింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లతో సమీక్షించారు.

నగరానికి సంబంధించి లే అవుట్లలో లబ్ధిదారుల వివరాలు, గృహ నిర్మాణాల పురోగతి, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, హౌసింగ్ పీడీ, కాంట్రాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఉపాధ్యాయ రంగంలో సేవలందిస్తున్న ప్రతి ఒక్కరూ సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులను తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో గుంటూరు ప్రధాన కార్యాలయంగా నిర్వహిస్తున్న కె.వి.ఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రతిభా పురస్కారాల మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు లెక్కకు మించి నిధులు ఖర్చు చేస్తోందన్నారు. ప్రధానంగా పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు నాడు–నేడు పేరుతో పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసిందన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ 2008 నుంచి నిర్వహిస్తున్న ఈ ట్రస్ట్ కార్యక్రమాలు ఎన్టీఆర్ జిల్లాలో చేయడం ఇదే ప్రథమన్నారు. విద్యా రంగానికి సేవ చేయటం, విజ్ఞానంతో కూడిన సమాజ స్థాపనకు తోడ్పడుతున్న ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి ప్రోత్సహించడం తమ సంస్థ లక్ష్యమన్నారు. పలు కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులను సత్కరించి పురస్కారాలు అందజేశారు. యూటీఎఫ్ నాయకులు కె.శ్రీనివాసరావు, సుందరయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన గుణదల పోలీసులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుణదల పోలీసులు మానవత్వం చాటుకున్నారు. గుణదల ఉలవచారు కంపెనీ సమీపంలో వివస్త్రగా ఉన్న వృద్ధురాలిని చేరదీసి నూతన వస్త్రాలు ఇవ్వటంతో పాటు ఆశ్రమంలో చేర్పించారు. వివరాల్లోకి వెళితే గుణదల ఉలవచారు కంపెనీ సమీపంలో ఒక వృద్ధురాలు ఉందని గుణదల పోలీసులకు సమాచారం అందింది.

దీంతో గుణదల పోలీసులు వృద్ధురాలి వద్దకు చేరుకున్నారు. ఆమె తన వివరాలు తెలియచేయలేని స్థితిలో ఉంది. దీంతో పోలీసులు ఆమెకు వెంటనే నూతన వస్త్రాలు, ఆహారం అందించి, ఆశ్రమంలో చేర్పించారు. సదరు వృద్ధురాలి వివరాలు సేకరించి వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 48 మందికి జైలు, జరిమానా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపే చోదకులపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గురువారం 1వ, 2వ, 4వ, 5వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 48 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని పలు న్యాయస్థానాల్లో ప్రవేశపెట్టగా, సంబంధిత న్యాయమూర్తులు వారికి జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. వారిలో ఒక వ్యక్తికి 15 రోజులు జైలు, రూ.10 వేలు జరిమానా, ఒక వ్యక్తికి 13 రోజులు జైలు, రూ.10 వేలు జరిమానా, ఒక వ్యక్తికి 10 రోజులు జైలు, రూ.10 వేలు జరిమానా, ఇద్దరు వ్యక్తులకు 05 రోజులు జైలు, రూ. 10 వేలు జరిమానా, ఒక వ్యక్తికి 03 రోజులు జైలు, రూ.10 వేలు జరిమానా, ఇద్దరు వ్యక్తులకు 02 రోజులు జైలు, ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా, ఒక వ్యక్తికి ఒక రోజు జైలు, రూ.10 వేలు జరిమానా, ఆరుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున జరిమానా, మిగిలిన 33 మంది వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చోప్పున జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

టీడీపీ నేత బండారుపై చర్యలకు డిమాండ్



పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ మహిళా నేతలు డిమాండ్ చేశారు. మహిళ అనే గౌరవం లేకుండా వ్యాఖ్యలు చేసిన బండారుపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని శిఖమణి సెంటర్‌లో మంత్రి రోజాకు సంఘీభావంగా గురువారం పాదయాత్ర నిర్వహించారు. టీడీపీకి మహిళలు అంటే గౌరవం లేదని, వచ్చే ఎన్నికల్లో వారికి మహిళలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు మెరకనపల్లి మాధురి, రహేనా నాహీద్, దుర్గ గుడి బోర్డు సభ్యురాలు బచ్చు మాధవి, పార్టీ మహిళా నాయకురాలు ఝాన్సీ, సౌమ్య, రత్నకుమారి, సలోమి తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీ నూతన భవనం పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ ప్రధాన కార్యాలయంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణ పనులు పూర్తి చేసి దసరా నాటికి అందుబాటులోకి తీసుకురావాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. గురువారం ఆయన అధికారులతో కలిసి భవనంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణం స్థితిగతులను, అందుబాటులోని మౌలిక సదుపాయాలు అధికారులను అడిగి తెలుసుకన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ వాణిజ్య ప్రయోజనాల కోసం కేటాయించాలని, వ్యాపారాల కోసం ప్రైమ్ స్పేస్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఫ్లోర్ 15 వేల చదరపు అడుగుల కలిగి ఉందని, ఒక్కో ఫ్లోర్‌కు రూ.2.5 కోట్ల నగరపాలక సంస్థ సాధరణ నిధులతో నిర్మిస్తున్నామని చెప్పారు. రెండో ఫ్లోర్‌లో నాలుగు నుంచి ఐదు డిపార్ట్‌మెంట్ల హెచ్‌వోడీలకు వేర్వేరుగా చాంబర్లను ఏర్పాటు చేస్తున్నామని, రెండు వందల మంది సామర్థ్యం కలిగిన కాన్ఫరెన్స్ హాల్‌ను నిర్మిస్తున్నామన్నారు. మూడో ఫ్లోర్ ఇంజినీర్ ఇన్ చీఫ్ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగానికి కేటాయించామని చెప్పారు. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫిల్మ్‌కాలనీ అభివృద్ధికి చర్యలు



కాలనీ వాసులతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

గుణదల(విజయవాడతూర్పు): ప్రజా సంక్షేమంతో పాటు మౌలిక అభివృద్ధి దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 4వ డివిజన్ పరిధిలోని ఫిల్మ్ కాలనీలో గురువారం జరిగిన కార్యక్రమంలో కాలనీ వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో సంక్షేమ పాలన మొదలైందన్నారు. ప్రజా సంక్షేమం కోసం సీఎం జగన్ పాటుపడుతున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు జనరంజకమైన పాలన అందించడంలో ఆయన సఫలీకృతమయ్యారని పేర్కొన్నారు.

అన్ని డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలు

తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నామమాత్రపు నాయకుడిగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలు గాలికొదిలేసి ఇంటికే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. నియోజకవర్గం పరిధిలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలను తలపెట్టకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజా ప్రయోజనాల కోసం నిబద్ధతగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. తాము ఎల్లపుడు అధికారులతో సమన్వయంగా ఉంటూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఫిల్మ్ కాలనీ అభివృద్ధి నిమిత్తం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు వంటి కనీస వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరలో ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 4వ డివిజన్ ఇన్‌చార్జి గల్లా రవి, 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్, కాలనీ ప్రెసిడెంట్ ఎస్వీ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సాయిరామ్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడాకారుడు మైనేని సాకేత్‌కు సత్కారం



సాకేత్‌ను సన్మానిస్తున్న దేవినేని అవినాష్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరం నుంచి అన్ని రంగాల్లో క్రీడాకారులు ముందంజలో ఉంటున్నారని, వారిని ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలను దేశానికి అందిస్తారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గురువారం ఆయన 19వ డివిజన్ బృందావన్ కాలనీకి చెందిన ఆసియా క్రీడల టెన్నీస్ డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచి రజత పతకం సాధించిన మైనేని సాకేత్, ఆంధ్రప్రదేశ్ ఆర్చర్, విజయవాడకు చెందిన వెన్నం జ్యోతి సురేఖ స్వర్ణపతకం సాధించడంతో ఆమె తల్లిదండ్రులను కలిసి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతికి వన్నె తెచ్చిన క్రీడాకారులకు వైఎస్సార్ సీపీ మరింత ప్రోత్సహిస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించి, అన్ని విధాలుగా వారికి తోడుగా ఉంటున్నామన్నారు. ఇలాంటి పతకాలు మరిన్ని సాధించి ప్రపంచ వ్యాప్తంగా దేశం కీర్తి, ప్రతిష్టలను పెంచాలని కోరారు. 19వ డివిజన్ కార్పొరేటర్ రహేనా నాహీద్ పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్, సోషల్ మీడియా నేరాలపై అవగాహన



చేరువ వాహనం ద్వారా అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సైబర్ క్రైమ్, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న నేరాలు, మోసాలపై చేరువ వాహనం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి వైఎస్సార్ కాలనీ, నెహ్రూ బొమ్మ సెంటర్‌లో చేరువ వాహనం ద్వారా గురువారం ప్రచారం చేశారు. సైబర్ ద్వారా జరిగే నేరాల అడ్డుకట్టకు నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా అవగాహన కల్పించాలని ఆయా పోలీస్ స్టేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్టేషన్ పరిధిలో చేరువ వాహనం ద్వారా చిన్న చిన్న వీడియోలను ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. అదే విధంగా చిన్నారులకు ఎదురయ్యే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ సైబర్, సోషల్ మీడియా కేంద్రంగా వివిధ రకాల మోసాలు జరుగుతున్నాయని, ఆయా మోసాల నుంచి ప్రజలు ఏ విధంగా బయటపడాలనే దానిపై చేరువ ద్వారా తెలియజేస్తున్నామన్నారు. నేరాలు జరిగిన తర్వాత బాధపడే కంటే ముందస్తు జాగ్రత్తల ద్వారా సైబర్ నేరాల నుంచి జాగ్రత్త పడవచ్చునని చెప్పారు.

సమాజ అభివృద్ధిలో గురువుల పాత్ర ఎనలేనిది

మధురానగర్(విజయవాడసెంట్రల్): సమాజ అభివృద్ధిలో గురువుల పాత్ర ఎనలేనిదని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. స్థానిక దుర్గాపురంలో అంతర్జాతీయ టీచర్స్ డే సందర్భంగా బీఆర్టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సత్కార కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె గురువుల ప్రాముఖ్యతను వివరించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష


నంద్యాల జిల్లా క్రిష్టిపాడులో వైద్య శిబిరానికి వృద్ధురాలు దిబ్బమ్మను తీసుకెళ్తున్న ఆశా వర్కర్ లక్ష్మి


పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కొండూరులో ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యురాలు


ప్రకాశం జిల్లా బసిరెడ్డిపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరైన గ్రామస్తులు


శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బెండి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన గ్రామస్తులు


ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెద్దకొమిర గ్రామంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వాసవి


విశాఖ జిల్లా భీమిలి మండలం తాటితూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన ప్రజలు


అనంతపురంలోని మారుతీనగర్‌లో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో పేర్లు నమోదు చేయించుకుంటున్న ప్రజలు


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పడుగుపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


చిత్తూరు జిల్లా కలవకుంట సచివాలయం ఆవరణలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


రాజమహేంద్రవరంలోని వీఎల్ పురంలో ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది


వైఎస్సార్ జిల్లా చాపాడు మండలంలోని ఖాదర్‌పల్లెలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం దుప్పలపూడిలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

క్లుప్తంగా...

బాబు అవినీతి కనిపించట్లేదా పవన్?

డిప్యూటీ సీఎం నారాయణస్వామి



కార్వేటినగరం(చిత్తూరు జిల్లా): గత ఎన్నికల సమయంలో చంద్రబాబు స్కామ్‌లు చేస్తున్నారన్న జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్.. ఇప్పుడు అదే అవినీతిపరుడితో బహిరంగంగా కలిసిపోయారని డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి విమర్శించారు. ఇప్పుడు చంద్రబాబు అవినీతి కనిపించట్లేదా అని పవన్‌ను ప్రశ్నించారు. గురువారం ఆర్కే వీబీ పేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఊసరవెల్లిలా మాటలు, పార్టీలు మార్చే పవన్‌కు వచ్చే ఎన్నికల్లోనూ ఘోర పరాజయం తప్పదన్నారు. చంద్రబాబును మించిన హరిశ్చంద్రుడు లేరన్నట్లుగా పవన్ మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. చంద్రబాబుకు ఎంతకు అమ్ముడుపోయావో బహిరంగంగా చెప్పాలని పవన్‌ను డిమాండ్ చేశారు. జనసేనలోని చిల్లర నాయకులు నోటిని అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. చంద్రబాబు, పవన్ కలసి వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణ

కార్వీ ఆస్తుల జప్తుపై స్టేటస్ కో

'ముసద్దీలాల్'కు కూడా..

ఈడీ అప్పీల్‌పై హైకోర్టు ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: కార్వీ గ్రూప్ కంపెనీ ఆస్తుల జప్తుపై హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలిచ్చింది. ముసద్దీలాల్ కంపెనీ డైరెక్టర్లు, హైగ్రో కెమికల్స్, దివిజ జ్యువెల్లర్స్, శీతల్ రిఫైనరీస్ సంస్థల ఆస్తుల జప్తుపై కూడా యథాతథస్థితి కొనసాగించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. పలు కేసులలో తమ ఆస్తులను ఈడీ తాత్కాలికంగా జప్తుచేయడాన్ని సవాల్ చేస్తూ ఆయా కంపెనీలు హైకోర్టును ఆశ్రయించాయి. సింగిల్ జడ్జి విచారణ జరిపి ఈడీ జప్తు ఉత్తర్వులను కొట్టివేశారు. దీనిపై ద్విసభ్య ధర్మాసనం ముందు ఈడీ అప్పీల్ చేసింది. అలాగే కొన్ని కంపెనీలు కూడా ఇతర ఆస్తుల జప్తుపై పిటిషన్లు వేశాయి. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ సుందరేశన్ వాదనలు వినిపించారు. అడ్జుడికేటింగ్ అథారిటీలో సాంకేతిక సభ్యుడు మాత్రమే ఉన్నారని, ఆయనకు న్యాయశాస్త్రంలో పట్టాలేదని పేర్కొంటూ సింగిల్ జడ్జి అథారిటీ ఉత్తర్వులను కొట్టివేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా పలు సుప్రీంకోర్టు తీర్పులను వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం నవంబర్ 7న తుది విచారణ చేపడతామంటూ వాయిదా వేసింది.

సిక్కిం వరదల్లో నిజామాబాద్ ఆర్మీ జవాన్ మృతి

బోధన్: సిక్కింలో మంగళవారం అర్ధరాత్రి సంభవించిన వరదల్లో చిక్కుకొని చనిపోయిన ఆర్మీ జవాన్లలో నిజామాబాద్ జిల్లా సాలూర మండలం కుమ్మన్‌పల్లికి చెందిన నీరడి గంగాప్రసాద్ ఉన్నట్టు ఆర్మీ అధికారుల నుంచి కుటుంబసభ్యులకు సమాచారం వచ్చింది. గురువారం మృతదేహం లభ్యం కాగా, పోస్టుమార్టం కోసం పశ్చిమ బెంగాల్‌లోని జల్‌పాయ్‌గిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి ఆర్మీ అధికారులు తరలించారు. శుక్రవారం రాత్రి స్వగ్రామానికి మృతదేహం చేరుకునే అవకాశాలున్నాయి. ఎమ్మెల్యే షకీల్ సమకూర్చిన విమానంలో మృతుడి తమ్ముడు సుధాకర్, మరో బంధువు దిలీప్ బయలుదేరి వెళ్లి ఘటనాస్థలానికి చేరుకున్నారు. పశ్చిమబెంగాల్‌లోని బినాగుడి ఆర్మీ హెడ్‌క్వార్టర్‌లో విధులు నిర్వహిస్తున్న గంగాప్రసాద్ శిక్షణలో భాగంగా 20 రోజుల క్రితం సిక్కింలోని జులుక్ ప్రాంతానికి వెళ్లి తిరుగు పయనమయ్యారు. అతి భారీవర్షాల వల్ల ఉప్పొంగిన తీస్తా నది వరదల్లో గల్లంతయ్యారు. గంగాప్రసాద్‌ది నిరుపేద దళిత కుటుంబం. ఆయన ఎనిమిదేళ్ల క్రితం ఆర్మీ జవాన్‌గా ఎంపికయ్యాడు. గంగాప్రసాద్‌కు భార్య శిరీష, ఇద్దరు కుమారులు హర్ష(6), ఆదిత్య(3) ఉన్నారు.

ఊరూ వాడా.. 'ఆరోగ్య సురక్ష'

▶ మొదటి పేజీ తరువాయి

పంపిణీ చేస్తోంది. రాష్ట్రంలో ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ప్రజల ఆరోగ్య సమస్యలు, అవసరాలను గుర్తించి పరిష్కరించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సెప్టెంబర్ 30 నుంచి ప్రారంభించిన విషయం తెలిసిందే.

నాలుగు రోజుల్లో 7.16 లక్షల మంది

ప్రభుత్వ సెలవు దినాలను మినహాయిస్తే గురువారం వరకూ నాలుగు రోజుల పాటు వైద్య శాఖ 2,427 శిబిరాలను నిర్వహించింది. గ్రామాల్లో 2,261 శిబిరాలను నిర్వహించగా పట్టణాలు, నగరాల్లో 166 శిబిరాలు ఏర్పాటయ్యాయి. ప్రతి శిబిరంలో ఇద్దరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లతో పాటు గైనిక్, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, ఇతర స్పెషాలిటీల నుంచి ఇద్దరు చొప్పున మొత్తంగా నలుగురు వైద్యులను అందుబాటులో ఉంచారు. నాలుగు రోజుల్లో ఏకంగా 7,16,101 లక్షల మంది సొంత ఊళ్లలో ఉచిత చికిత్సలు పొందారు. వైద్య సేవలను వినియోగించుకున్న వారిలో అత్యధికంగా 4 లక్షల మందికిపైగా మహిళలే ఉండటం గమనార్హం. ఒక్కో శిబిరంలో సగటున 277 మంది వైద్య సేవలు పొందారు.

4 వేల మంది స్పెషలిస్టు వైద్యులు: మంత్రి విడదల రజని



చిలకలూరిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అద్భుతమైన స్పందన లభిస్తోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును మంత్రి రజని గురువారం సందర్శించి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 10,574 వైద్య శిబిరాలను జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మెరుగైన వైద్యం అవసరమని గుర్తించిన వారికి పెద్ద ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా చికిత్స అందుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో వైద్యం అందించేందుకు ఏకంగా 4 వేల మంది స్పెషలిస్టు వైద్యులను నియమించినట్లు తెలిపారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు.

మెరుగైన వైద్యం అవసరమని వైద్యులు భావించిన 20,798 మందిని పెద్దాస్పత్రులకు రిఫర్ చేశారు.

ఉచితంగా పరీక్షలు.. మందులు

ప్రతి క్యాంపులో 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను అందుబాటులో ఉంచారు. అవసరం మేరకు కంటి పరీక్షలు, ఈసీజీ, రక్త పరీక్షలు, ఫుడ్ సప్లిమెంటేషన్ మ్యాపింగ్ చేస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రిఫర్ చేసిన వారికి ఉచితంగా వైద్య సేవలు అందించేలా ఫ్యామిలీ డాక్టర్లు, ఏఎన్ఎం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) పర్యవేక్షిస్తున్నారు. ఐదు దశల్లో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

టోకెన్లు లేకున్నా వైద్య సేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిని ఏఎన్ఎం, సీహెచ్‌వోలు సందర్శించి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి వైద్య శిబిరాలకు హాజరు కావాలని కోరుతూ టోకెన్లు జారీ చేస్తున్నారు. టోకెన్లు లేకున్నా కూడా తమ గ్రామం/పట్టణంలో శిబిరం నిర్వహించే ప్రాంతానికి నేరుగా వెళ్లి వైద్య సేవలు పొందవచ్చు.

– జె.నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్

మహిళలకు ప్రత్యేక కౌంటర్



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మహిళలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఇద్దరు మహిళా వైద్యులు అన్ని పరీక్షలు చేసి ఉచితంగా మందులు కూడా ఇచ్చారు. గతంలో వైద్యం కోసం మండల కేంద్రానికి వెళ్లే వాళ్లం. ఇప్పుడు మా గ్రామానికే వైద్యులు వస్తున్నారు. డబ్బు ఖర్చు లేకుండా ఊళ్లోనే వైద్యం అందించడం చాలా సంతోషంగా ఉంది. మాకు వ్యయ ప్రయాసలు లేకుండా వైద్యులే గ్రామాల్లోకి వచ్చి వైద్యం చేయడం ఎంతో మేలు చేస్తోంది.

– పకూర్ బీ, క్రిష్టిపాడు, దొర్నిపాడు మండలం, నంద్యాల జిల్లా

ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తే రూ.5 వేలు ఖర్చయ్యేవి



ఆరోగ్య సురక్ష శిబిరంలో నేను, నా భర్త వైద్య సేవలు పొందాం. ముందుగానే వలంటీర్, ఏఎన్ఎం మా ఇంటికి వచ్చి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భీమవరంలో నిర్వహించిన వైద్య శిబిరంలో కొన్ని పరీక్షలు చేసి స్పెషలిస్ట్ వైద్యులు ఉచితంగా మందులు కూడా ఇచ్చారు. ఇదే వైద్య సేవల కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఉంటే మాకు సుమారు రూ.5 వేలు ఖర్చయ్యేవి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మా ఇంటి వద్దకే వైద్యులను పంపించి ఉచితంగా సేవలు అందించడం చాలా బాగుంది. ఈ శిబిరాలు పేద, మధ్యతరగతి వారికి ఎంతో ఉపయోగపడతాయి.

– కర్రి లక్ష్మి, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా

వైద్యరంగంలో ఏపీ సంస్కరణలు భేష్

ప్రశంసించిన అంతర్జాతీయ సంస్థ జె-పాల్ ప్రతినిధులు


మంగళగిరిలోని రాష్ట్ర వైద్యశాఖ ప్రధాన కార్యాలయంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్‌ను కలిసిన జె-పాల్ బృందం

సాక్షి, అమరావతి/మూలపాడు (ఇబ్రహీంపట్నం): రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవల కల్పన కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు భేషుగ్గా ఉన్నాయని జర్మనీకి చెందిన అంతర్జాతీయ సంస్థ జమీల్ పావర్టీ యాక్షన్ ల్యాబ్ (జె-పాల్) ప్రతినిధి బృందం ప్రశంసించింది. ఈ బృందం గురువారం మంగళగిరిలోని వైద్యశాఖ ప్రధాన కార్యాలయంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్‌తో సమావేశమైంది. అంతకుముందు బృందం సభ్యులు ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలును పరిశీలించారు. అధికారులను అడిగి వివరాలు, ప్రజలను అడిగి వైద్యసేవలు అందుతున్న తీరు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం, నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ సర్వే, ఇతర కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం కమిషనర్‌తో సమావేశమయ్యారు. వైద్య, ఆరోగ్యరంగంలో ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్ని సంస్థ ప్రతినిధులకు కమిషనర్ నివాస్ వివరించారు. నాడు–నేడు కింద ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన, 17 కొత్త వైద్యకళాశాలల ఏర్పాటు సహా పలు అంశాలను తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా జె-పాల్ బృంద సభ్యులు ప్రొఫెసర్ నిక్కిల్ సుదర్శనన్ (మ్యూనిచ్ టెక్నికల్ యూనివర్సిటీ), ప్రొఫెసర్ హర్షా తిరుమూర్తి (పెన్సిల్వేనియా యూనివర్సిటీ) మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణకు ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు మంచి నిర్ణయమని తెలిపారు. ఆరోగ్య సురక్ష కింద హెల్త్ క్యాంప్‌లు నిర్వహించి స్పెషలిస్ట్ వైద్య సేవల కల్పన అభినందనీయమని పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ రాష్ట్ర నోడల్ అధికారి టి.రమేష్, ఎన్టీఆర్ జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, మూలపాడు పీహెచ్‌సీ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు టీడీపీ నేతల జేజేలు


వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి వైద్య శిబిరంలో పాల్గొన్న టీడీపీ సర్పంచ్ మాలతి జయలక్ష్మి

మెళియాపుట్టి: శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం పెద్దపద్మాపురంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక టీడీపీ సర్పంచ్ మాలతి జయలక్ష్మి ప్రజలను తీసుకురావడం అందరి దృష్టిని ఆకర్షించింది. పలువురు తెలుగుదేశం నేతలు సైతం కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించడంలో సహకారం అందించారు. మొత్తం 413 మంది హెల్త్ క్యాంప్‌లో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకున్నారు. ప్రజారోగ్యంపై దృష్టి సారిస్తున్న ప్రభుత్వ పాలనను ప్రతిపక్ష నేతలు సైతం స్వాగతిస్తున్నారు.

మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

మంత్రి ఆర్కే రోజా



తిరుపతి సిటీ : మహిళా సాధికారతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా చెప్పారు. తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో గురువారం జరిగిన ఉమెన ఎంపవరింగ్ ఉమెన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలు సాధికారిత సాధించాలంటే ఆర్థిక స్వావలంబన అవసరమని, అందుకోసం అవకాశాలను అందిపుచ్చుకుని శ్రమ, పట్టుదల, ధైర్యం ఆయుధాలుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్త్రీలు ఏ రంగంలో అడుగుపెట్టినా విజయాలు సాధిస్తున్నారని, ప్రపంచాన్ని శాసించే స్థాయికి మహిళలు చేరుకోవడం శుభపరిణామమని తెలిపారు. పార్లమెంట్‌లో 33శాతం రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపడం సంతోషకరమన్నారు. దేశంలో మహిళా పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్ గుర్తింపు పొందారని, గ్రామీణ పేదరిక నిర్మూలనే ధ్యేయంగా మహిళలను ప్రోత్సహించేందుకు డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలతోపాటు సుమారు రూ.25 వేల కోట్ల రుణ మాఫీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళల సాధికారిత కోసం రూ.2.53 వేల కోట్ల సాయం అందించారని తెలిపారు. ఉన్నత విద్య అభ్యసించి పారిశ్రామిక వేత్తలుగా రాణించే మహిళలకోసం ప్రత్యేక రాయితీలతో ప్రభుత్వం రుణ సదుపాయం కల్పిస్తోందన్నారు. విద్యా వ్యవస్థలో పెనుమార్పులు తీసుకొచ్చారని, ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను, వసతులు కల్పిస్తున్నారని చెప్పారు. విద్యాభివృద్ధికి అమ్మ ఒడి, జగనన్న వసతి, విద్యా దీవెన, ఫీజురీయింబర్స్‌మెంట్, నాడు–నేడులో భాగంగా విద్యాలయాలకు సౌకర్యాల కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. ఎన్టీఆర్ పెట్టిన పార్టీలో ఉంటూ కొందరు మహిళల గురించి అతి దారుణంగా మాట్లాడటం సహించరాని విషయమన్నారు. అలాంటి వారికి మహిళా శక్తిని చూపాలన్నారు. ఏపీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత కోసం చేసిన, వృద్ధి సాధించిన వివరాలను గణాంకాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఏపీ ఎస్‌సీహెచ్‌ఈ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరీదేవి, వీసీ భారతి, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, రిజిస్ట్రార్ రజినీ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందిస్తున్న ఒకే ఒక్కడు సీఎం జగన్

- ఇంటలెక్చువల్ ఫోరం సదస్సులో వక్తల ఉద్ఘాటన
- పచ్చమీడియా వికృత చేష్టలు: ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని


మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: పాలనా రంగంలో ఎన్నో సంస్కరణలు తెచ్చి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఒకే ఒక్కడుగా నిలిచారని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. అవర్ స్టేట్–అవర్ లీడర్ వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం, ఏపీ సీఆర్ మీడియా అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అనే అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. వివిధ సంఘాల ప్రతినిధులు, మేధావులు మాట్లాడుతూ పాలనలో అనేక సంస్కరణలు తీసుకు రావడం వల్లే రాష్ట్రానికి సుపరిపాలన సాకారమైందని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చి పాలనను పారదర్శకంగా ప్రజల ముంగిటే ఆవిష్కరిస్తున్నారని పేర్కొన్నారు.

పచ్చ మీడియా వికృత చేష్టలు

సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పచ్చ మీడియా వికృత చేష్టలను ప్రజలు ఈసడించుకుంటున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అనైతిక పొత్తుతో రెండు పార్టీల కార్యకర్తల్లో అయోమయం సృష్టిస్తున్నారని విమర్శించారు. ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక ప్రతినిధి కోటిపల్లి జయకర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఫోరం చైర్మన్ జి.శాంతమూర్తి, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి కె.త్రినాథరెడ్డి, దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, డీసీసీబీ సీఈవో ఆర్వీ నరసింహారావు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి మునికుమారి, రాష్ట్ర అగ్రి మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబి), ఉద్యాన వర్సిటీ మెంబర్ జిన్నూరి వెంకటేశ్వరరావు, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తనయుడు విశాల్ మాట్లాడారు.

విద్యా పథకాలపై విశ్లేషించిన విద్యార్థిని



ఈ సదస్సులో అమలాపురం జవహర్‌లాల్ మునిసిపల్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని సాయిశ్రీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో అమలవుతున్న విద్యా పథకాలను ఒక్కొక్కటిగా ఆంగ్లంలో వివరించింది. వాటివల్ల పేద విద్యార్థులు కార్పొరేట్ విద్యను ఎలా అందిపుచ్చుకుంటున్నారో చక్కగా వెల్లడించింది. తెనాలికి చెందిన విద్యావేత్త రవికుమార్ విద్య పథకాల అమలుతో సుపరిపాలన సాకారమైందన్నారు.

బ్రాహ్మణి, భువనేశ్వరి మహిళలేనా?

- మంత్రి రోజా కన్నీళ్లు చూసి ఆనందపడతారా?: నారమల్లి పద్మజ
- తండ్రికి వెన్నుపోటు పొడిస్తే ఏడవని భువనేశ్వరి



సాక్షి, అమరావతి: టీడీపీ నేతలు అయ్యన్నపాత్రుడు, పట్టాభి, బండారు సత్యనారాయణ, అనిత తదితరులు మంత్రి రోజాను అసభ్యంగా దూషిస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నా నారా భువనేశ్వరి, బ్రాహ్మణి ఖండించటం లేదంటే ఏమనుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నారమల్లి పద్మజ మండిపడ్డారు. రోజా కన్నీళ్లు చూసి ఆనందపడతారా.. అని ప్రశ్నించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ అసలు వారు మహిళలేనా? కనీసం మనుషులేనా? అని ధ్వజమెత్తారు. బండారు మాట్లాడిన నీచమైన మాటలను ఖండించాల్సింది పోయి సమర్థిస్తున్న నారా లోకేశ్, పవన్ కళ్యాణ్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఇటీవల భువనేశ్వరి దీక్షలో ఒక చిన్న పిల్లాడికి ఎల్లో డ్రస్ వేసి దివంగత వైఎస్సార్ గురించి, ఆయన మరణాన్ని గురించి మాట్లాడిస్తుంటే ఆమె చప్పట్లు కొట్టటాన్ని ఏమనుకోవాలన్నారు. ఆ వికటాట్టహాసాలు చూస్తుంటే అసలు వైఎస్సార్ మరణానికి కారణం వారేననే అనుమానం వస్తోందన్నారు.

తండ్రికి వెన్నుపోటు పొడిచినా ఏడవని భువనేశ్వరి

ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ఆయన పదవిని, ట్రస్టును, పార్టీని, డబ్బులను లాక్కుని చెప్పులు కూడా వేయించినా భువనేశ్వరికి కన్నీళ్లు రాలేదని విమర్శించారు. భర్త చేసిన అవినీతిని కప్పిపుచ్చుతూ తమ వ్యాపారంలో 2 శాతం అమ్మితే రూ.400 కోట్లు వస్తాయని చెబుతున్నారంటే చంద్రబాబు అవినీతిలో ఆమె భాగస్వామ్యం ఎంత? అనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. చంద్రబాబు ఎన్ని అరాచకాలు చేసినా వెనకేసుకొస్తున్న నారా భువనేశ్వరిని చూస్తుంటే ఈ స్కామ్‌లకు ఆమె కూడా కుట్రదారేనా? అనే అనుమానం కలుగుతోందన్నారు. బ్లూ ఫిల్మ్‌లు మీ దగ్గర ఉంటే బయట పెట్టాలన్న రోజా, ఆమె భర్త ఛాలెంజ్‌పై తోక ముడవటాన్ని బట్టి మీవన్నీ గాలి మాటలేనని అర్థమవుతోందని టీడీపీ నేతలపై ధ్వజమెత్తారు. మేం మాధవరెడ్డి హత్య గురించి మాట్లాడితే దొంగ ఏడుపులు ఏడ్చిన మీరు బ్లూ ఫిలింలు అంటూ రోజా వ్యక్తిత్వాన్ని హననం చేస్తుంటే ఎందుకు మాట్లాడరని నిలదీశారు. 'మహిళలు కనిపిస్తే ముద్దు అయినా పెట్టాలి.. కడుపు అయినా చేయాలని చెప్పిన బాలకృష్ణ ఓ సర్టిఫైడ్ సైకో. ఈరోజు మీకు కాపలాదారుడిగా ఉన్న పవన్ కళ్యాణ్ మహిళల పట్ల మరో సైకో' అని విమర్శించారు.

తెలంగాణ

ఫైనాన్స్, చిట్‌ఫండ్ సంస్థలపై ఐటీ దాడులు

హైదరాబాద్, శివారు ప్రాంతాల్లోని 24చోట్ల ఒకేసారి 100 బృందాల సోదాలు

సాక్షి, హైదరాబాద్/శ్రీనగర్ కాలనీ/శంషాబాద్: హైదరాబాద్‌లోని పలు ఫైనాన్స్, చిట్‌ఫండ్, ఈ–కామర్స్ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై ఆదాయ పన్నుశాఖ మెరుపు దాడులు చేసింది. గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు హైదరాబాద్, శివారు ప్రాంతాల్లోని 24 చోట్ల ఏకకాలంలో 100 బృందాలతో తనిఖీలు చేపట్టింది. ఆదాయపన్ను చెల్లింపులో అవకతవకల ఆరోపణలపై సోదాలు కొనసాగినట్లు సమాచారం. హైదరాబాద్‌తోపాటు కర్ణాటక, ఒడిశా, తమిళనాడుకు చెందిన ఐటీ అధికారులు ఈ సోదాల్లో పాల్గొన్నట్లు తెలిసింది. బీఆర్ఎస్‌కు చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సోదరుడి ఇల్లు, ఆఫీసులు, కూకట్‌పల్లి హిందూ ఫార్చ్యూన్ విల్లాలోని అరికపూడి కోటేశ్వరరావు, రైల్వే కాంట్రాక్టర్ వరప్రసాద్ ఇళ్లతోపాటు వారి బంధువుల ఇళ్లలో సోదాలు జరిగినట్లు సమాచారం. అయితే ఎమ్మెల్యే మాగంటి బంధువులు, స్నేహితుల వ్యాపారాలు లక్ష్యంగానే సోదాలు జరిగినట్లు ప్రచారం సాగింది. ఈ సోదాల్లో పలు కీలక పత్రాలను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఎల్లారెడ్డిగూడలోని పూజకృష్ణ చిట్‌ఫండ్స్‌లో 40 మంది ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. చిట్‌ఫండ్స్ డైరెక్టర్స్ నాగరాజేశ్వరి, పూజాలక్ష్మి, ఎండీ కృష్ణప్రసాద్ ఇళ్లలోనూ తనిఖీలు జరిగాయి. అమీర్‌పేట్‌లోని సన్‌షైన్ అపార్ట్‌మెంట్‌లో, శంషాబాద్‌లో ఈ–కామర్స్ వ్యాపారవేత్త రఘువీర్ ఇంటితోపాటు జూబ్లీహిల్స్‌లోని ఆఫీసుల్లో, జీవనశక్తి చిట్‌ఫండ్, ఈ–కామ్ చిట్‌ఫండ్ సంస్థల్లోనూ సోదాలు జరిగాయి. ఈ సోదాలపై ఐటీ అధికారులు ఎలాంటి ప్రకటన జారీ చేయలేదు.

వ్యాక్సిన్ కాదు వైరస్

పవన్ - చంద్రబాబుది అపవిత్ర కలయిక: మంత్రి జోగి రమేశ్

- పవన్.. జైలులో బాబు బ్లడ్ ఎక్కించుకుని వచ్చావా?
- నువ్వే ఓ పావలా.. నీ చుట్టూ 4 పావలాలు
- అవనిగడ్డ, పెడనలో జనసేన సభలు అట్టర్‌ఫ్లాప్
- హైదరాబాద్‌లో తింటూ విషం కక్కేది ఏపీలోనా?

ఎన్నికల తరువాత సినిమాలే దిక్కు

నన్ను అండమాన్ జైలుకు పంపిస్తానని హెచ్చరిస్తున్న పవన్ 2024 తర్వాత రెడీగా ఉంటే 'జానీ–ఖానీ' 'గబ్బర్‌సింగ్ – రబ్బర్‌సింగ్' అనే రెండు సినిమాలు తీస్తా. ఎన్నికల తరువాత ఆయన ఇక సినిమాలు మాత్రమే చేసుకోవాల్సి ఉంటుంది. తెలంగాణలో 40 సీట్లలో పోటీ చేస్తానంటున్న పవన్ ఏపీలో 20 సీట్ల కోసం చంద్రబాబు కాళ్లు ఎందుకు పట్టుకుంటున్నారు? చంద్రబాబుకు అమ్ముడుపోయిన పవన్‌ను ఎవరూ నమ్మొద్దు. ఆయన రాజకీయాల్లో పనికిరాడు. చంద్రబాబు పని అయిపోయిందని, టీడీపీ బలహీనపడింది కాబట్టి తన అవసరం వచ్చిందని అంటున్నారు. ఇప్పటికైనా పవన్ వెంట నడిచే వారు మైండ్‌సెట్ మార్చుకోవాలి. ఆయనకు ఊడిగం చేయకండి. ప్రతి గడపకు జగనన్న అందించిన సంక్షేమ పథకాలు వచ్చాయా? లేదా? అన్నది చూడండి.



సాక్షి, అమరావతి: జనసేన, టీడీపీ కలయిక వాక్సిన్ కాదని, అది రాష్ట్రానికి పట్టిన వైరస్ అని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ ధ్వజమెత్తారు. పవన్ – చంద్రబాబుది ఓ అపవిత్ర కలయిక అని విమర్శించారు. హైదరాబాద్‌లో ఉంటూ తింటూ.. ఏపీపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఆ సభకు 2 వేల మంది కూడా రాలేదు..

2014లోనే మీ ఇద్దరి కలయిక, మీ బంధం ఎలా దగా చేసిందో అందరూ చూశారు. పవన్ దత్త తండ్రి చంద్రబాబు స్కీమ్‌ల పేరుతో స్కామ్‌లు చేశారని అందరూ గుర్తించారు. సూట్‌కేస్ కంపెనీలు, హవాలా వ్యవహారాల్లో అన్ని ఆధారాలతో దొరికిపోయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారు. ఆయనకు మద్దతుగా జైలుకు వెళ్లి ములాఖత్ తర్వాత మిలాఖత్ అయ్యావు. వచ్చే ఎన్నికల్లో కలసి పోటీ చేస్తామని ప్రకటించావు. ఆ తర్వాత నిర్వహించిన వారాహి యాత్రలో ప్రజలు ఎక్కడా ఆదరించకపోవడంతో పవన్ నోటికొచ్చినట్టుగా మాట్లాడుతున్నారు. పెడన సభలో తనపై దాడికి 2 వేల మంది గూండాలను పోగు చేస్తున్నారని ఆరోపణలు చేశారు. ఆయన సభకు 2 వేల మంది కూడా హాజరు కాకపోవడంతో అవన్నీ గాలి మాటలని తేలిపోయింది. అవనిగడ్డ, పెడనలో సభలు అట్టర్ ఫ్లాఫ్ అయ్యాయి.

పెడనవాసిపై కేసులు పెట్టి అక్కడే సభలా?

అత్తారింటికి దారేది? సినిమా పైరసీ జరిగిందని 30 మంది పెడన చేనేత కార్మికులపై మీరు కేసులు పెడితే మేం కలంకారీ కళాకారుడు పిచ్చుక శ్రీనివాస్‌ను వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించాం. పెడన వాసిపై కేసు పెట్టి హింసించి మళ్లీ అక్కడకు ఏ ముఖం పెట్టుకుని వచ్చావు? కనీసం ఈ సభ ద్వారానైనా క్షమాపణలు చెబుతావని భావిస్తే సిగ్గు లేకుండా నార తీస్తా.. తోలు తీస్తా అంటూ బెదిరిస్తావా?

బాబు బ్లడ్ ఎక్కించుకున్నావా?

ఎవరైనా సీఎం కావాలంటే తమ సామాజికవర్గం బ్లడ్ ఎక్కించుకోవాలని టీడీపీకి చెందినవారు వ్యాఖ్యలు చేశారు. మరి అందుకే రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లి చంద్రబాబు బ్లడ్ ఎక్కించుకున్నావా? అందుకే కలిసి పోటీ చేస్తానంటున్నావా? మీ మాదిరిగా కాపు అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలు బాబు బ్లడ్ ఎక్కించుకోలేరు. అందుకే నీ వెంట నడవలేమంటున్నారు. వంగవీటి రంగా హత్యకు కారకులు, ముద్రగడను హింసించిన వారిని మీరు మోస్తున్నారు కాబట్టి మిగిలిన వారు కూడా మోయాలంటావా?

> **ఇది పెత్తందార్లు, పేదల యుద్ధం కాదా?**
>
> రూపాయి పావలా అని విమర్శలు చేస్తున్న నీకు ఎటూ పావలా కళ్యాణ్ అనే పేరు ఉంది. ఆ పేరు పెట్టారన్న ఉక్రోషంతో రూపాయి పావలా ప్రభుత్వం అంటున్నావు. ఇందులో మొదటి పావలా చంద్రబాబు! రెండో పావలా నువ్వు! మూడో పావలా ఎల్లో మీడియా! నాలుగో పావలా మిగతా పార్టీల్లో ఉన్న కోవర్టులు! ఐదో పావలా జేఏసీల పేరు పెట్టుకున్న సంస్థలు! ఈ ఐదు పావలాలూ కలిసినా సున్నానే! ఇదేం ఖర్మరా అంటూ తిరిగిన చంద్రబాబు ఖర్మ కాలడంతో జైలులో ఉన్నారు. రాష్ట్రానికి రావాలంటే పాస్‌పోర్టు, వీసా కావాలా? అని అడుగుతున్న పవన్‌కు మాత్రం కావాల్సిందే! ఎందుకంటే ఆయన భారతీయుడివో, రష్యా వాడివో తెలియదు కాబట్టి! నీ ముద్దుల తమ్ముడు లోకేశ్, మాట్లాడడమే చేతకాని బాలకృష్ణతో సహా నీకు భజన చేసే ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, బీఆర్ నాయుడు తినేది, పడుకునేది, ఉండేది హైదరాబాద్‌లోనే. విషం కక్కేది మాత్రం ఏపీపై! 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలిచ్చి 10 లక్షలకు పైగా ఇళ్లు నిర్మిస్తుంటే కేసులు వేసి అడ్డుకున్నది మీరు కాదా? మరి ఇది పెత్తందార్లు, పేదల యుద్ధం కాదా? క్లాస్ వార్ కాదా?

నిన్న.. విడాకులు! నేడు.. కలిసున్నాం!!

ఎన్డీఏ నుంచి బయటకు వచ్చానని నేను చెప్పానా?

- టీడీపీతో కలిసి బీజేపీ మద్దతు కూడా కోరతాం
- మేం కలిస్తే వైఎస్సార్ సీపీకి భయమెందుకు?
- నేను గెలిచిన రోజు వైఎస్సార్ సీపీ నేతలు ఇళ్లల్లో ఉంటారా?
- ముదినేపల్లి వారాహి యాత్రలో పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: బలహీన పరిస్థితుల్లో ఉన్న టీడీపీని బలోపేతం చేసేందుకు ఎన్డీఏ నుంచి బయటకు వచ్చినట్లు ప్రకటించిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఒక్క రోజులోనే నాలుక కరుచుకున్నారు! 'ఎన్డీఏ నుంచి బయటకు వచ్చానని నేను చెప్పలేదు కదా..! అలా జరిగితే నేనే చెబుతా..! మీకు ఎందుకు అంత తొందర..?' అని తాజాగా ప్రశ్నించారు. ప్రధాని మోదీ, అమిత్‌షా, నడ్డాలకు రాష్ట్ర పరిస్థితిని వివరించి వారితో కలిసే ఉంటానని చెప్పారు. వైఎస్సార్ సీపీ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి టీడీపీతో కలసి బీజేపీ మద్దతు కూడా కోరతానని తెలిపారు. అంతకుముందు రోజు కృష్ణా జిల్లా పెడనలో బుధవారం జరిగిన వారాహి యాత్రలో మాత్రం అందుకు విరుద్ధంగా ఆయన మాట్లాడటం గమనార్హం. 'తెలుగుదేశం పార్టీ బలహీన పరిస్థితుల్లో ఉందని నేను ఎన్డీఏ కూటమి నుంచి బయటకు వచ్చి ఆ పార్టీని బలపరుస్తున్నా. టీడీపీ అనుభవానికి జనసేన పోరాట పటిమ తోడైతే జగన్‌ను అధఃపాతాళానికి తొక్కేయవచ్చు. జనసేన, టీడీపీతో ఎవరు కలిసి వచ్చినా ముందుకు రావడానికి నేను సిద్ధంగా ఉన్నా' అని పెడన సభలో పవన్ పేర్కొన్నారు.

ఆ రెండు పార్టీలు రాకుంటే జనసేన పరిస్థితి?

కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లిలోని బురగ సెంటరులో గురువారం నిర్వహించిన వారాహి విజయయాత్రలో పవన్‌కళ్యాణ్ పాల్గొన్నారు. 175 సీట్లు వైఎస్సార్ సీపీకే వస్తాయని చెబుతున్నప్పుడు జనసేన, టీడీపీ కలిస్తే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. తాము ఎన్డీఏ కూటమిలో ఉంటే ఏమిటి? లేకపోతే ఏమిటన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అద్భుతంగా పాలిస్తే వచ్చే ఎన్నికల్లో గెలవాలి కదా..! మీరందరూ భయపడుతున్నారంటే మాకు బలం ఉందని అంగీకరించినట్లేనని చెప్పారు. 2014లో అనుభవజ్ఞుడికి మద్దతు ఇవ్వాలని రాష్ట్రంలో టీడీపీ, కేంద్రంలో మోదీకి మద్దతు ఇచ్చామన్నారు. ఆ రెండు పార్టీలు రాకుండా ఉంటే జనసేన పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోండన్నారు. 2014 ఎన్నికల సమయంలో హైదరాబాద్‌లోని తన ఆఫీసులో ఉండగా వైఎస్సార్‌సీపీ గూండాలు దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నా భయపడి పారిపోలేదన్నారు. తాను గెలిచిన రోజున వైఎస్సార్ సీపీ నాయకులకు దమ్ముంటే వారి ఇళ్లలో, కార్యాలయాల్లో ఉండాలని సవాల్ చేశారు. జనసేన, టీడీపీ అధికారంలోకి వస్తే మద్యం ధరలను తగ్గిస్తామని, మహిళలు కోరిన చోట నిషేధిస్తామని చెప్పారు. అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన, కైకలూరు ప్రాంతాలను చతుర్ముఖ నగరాలుగా తీర్చిదిద్దుతామన్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించారని, హైదరాబాద్ అభివృద్ధి చెందిందంటే అది ఆయన వల్లేనని చెప్పారు. కొన్ని సమయాల్లో టీడీపీతో విభేదాలు వచ్చినప్పటికీ ఇప్పుడు మాత్రం కలిసి ప్రయాణం చేద్దామన్నారు. తాను దశాబ్దం పాటు ఆలోచించి రాజకీయాల్లోకి వచ్చానన్నారు.

వృద్ధుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

వృద్ధుల రాష్ట్ర కౌన్సిల్ తొలి సమావేశంలో మంత్రి ఉషశ్రీ చరణ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వృద్ధుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, అందుకు అనుగుణంగా వృద్ధుల సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం సత్వర చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా, శిశు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ ఆదేశించారు. వయోవృద్ధుల రాష్ట్ర కౌన్సిల్ తొలి సమావేశం వెలగపూడిలోని సచివాలయంలో గురువారం జరిగింది. మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాష్ట్రంలో 21 జిల్లాల్లో 71 వృద్ధాశ్రమాల్ని నిర్వహిస్తున్నామని, మిగిలిన ఐదు జిల్లాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. తిరుమలలో శ్రీవారి దర్శనానికి టీటీడీ అవకాశం కల్పించినట్టే రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాల్లోనూ వృద్ధులకు ప్రత్యేక వెసులుబాటు కల్పించేలా సీఎం జగన్‌ను కోరతామన్నారు. వృద్ధులకు ఏడాదికి ఒకసారి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించేలా సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామన్నారు. వృద్ధుల ఫిర్యాదులు, సమస్యలు తెలుసుకుని వారికి ఉపసమనం కలిగించే చర్యలు తీసుకునేందుకు రాష్ట్రంలోని 77 రెవెన్యూ డివిజన్‌లలో ట్రిబ్యునల్స్‌ను నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, వయో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంచాలకులు బి.రవిప్రకాశ్‌రెడ్డి, ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల, లా సెక్రటరీ జి.సత్యప్రభాకర్, హోం శాఖ జాయింట్ సెక్రటరీ హుస్సేనయ్య, వయోవృద్ధుల సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ రవీంద్ర, మేనేజింగ్ డైరెక్టర్ ఎంఏ కుమారరాజా, స్టేట్ కౌన్సిల్ సభ్యులు సీహెచ్ పరమేశ్వరరెడ్డి, కె.నిర్మల, మోతుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ ఆదాయం లక్ష్యం రూ.1,000 కోట్లు

- ప్రస్తుత ఆదాయం రూ.700 కోట్లు
- సంస్థ సీజీఎం శేషాచలం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీజీఎం శేషాచలం

అల్లిపురం (విశాఖ దక్షిణ): బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ ఆదాయం ప్రస్తుతం రూ.700 కోట్లు ఉందని, ఇది గత ఆర్థిక సంవత్సరం కంటే 10% అధికమని ఏపీ టెలికం సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) ఎం.శేషాచలం తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.1000 కోట్లకు పైగా లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. డాబాగార్డెన్స్‌లో గల సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆత్మనిర్భర్ భారత్ కింద స్వదేశీ 4జీ నెట్‌వర్క్ ఏర్పాటుకు ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్‌ను ఆదేశించిందని, ఇప్పటికే పాన్ ఇండియాలో టీసీఎస్, ఐటీఐ కంపెనీలకు లక్ష సైట్‌లు కొనుగోలుకు ఆర్డర్ ఇచ్చామని, ఏడాదిలో ఆ ప్రాజెక్టులు పూర్తవుతాయని భావిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది జూలైలో పంజాబ్‌లో బీటా లాంచ్ పూర్తయిందని, దీని ద్వారా 4జీ పరికరాలు 5జీకి అప్‌గ్రేడ్ అయినట్టు తెలిపారు. ఏపీ సర్కిల్‌లో 4300 సైట్లలో 4జీ పరికరాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. విశాఖ సర్కిల్‌లో 463 సైట్‌లు 4జీగా ఇప్పటికే సేవలందిస్తున్నాయన్నారు. అంత్యోదయ మిషన్ కింద మారుమూల గ్రామాలకూ కనెక్టివిటీ అందిస్తున్నామని, డిసెంబర్ నాటికి ఆ పనులు పూర్తవుతాయని, వాటికి సోలార్ పవర్‌తో కనెక్షన్ ఇస్తామన్నారు. ఏపీలో 4జీ సేవలు 3800 గ్రామాల్లో అందుబాటులోకొస్తాయని వెల్లడించారు. 2026 నాటికి సంస్థ లాభాల బాటలోకి వచ్చేలా ప్రణాళికలు రూపొందించామని, ప్రభుత్వ శాఖలన్నీ బీఎస్ఎన్ఎల్ కనెక్షన్లు వాడేలా మార్కెటింగ్ విభాగాన్ని పటిష్టం చేస్తామని శేషాచలం వివరించారు. సమావేశంలో విశాఖ జిల్లా జనరల్ మేనేజర్ పి.పాల్ విలియమ్స్, జి.ఆడం, మొబైల్స్ విభాగం హెడ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు ▸ 10కి పూర్తిచేయాలి

20న తుది జాబితా వెల్లడించాలి ● వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్

సాక్షి, అమరావతి: ఖరీఫ్ సీజన్ ముగిసినందున ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఈ నెల 10వ తేదీకల్లా పూర్తిచేయాలని వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ జిల్లా అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఇప్పటికే 97 శాతం ఈ-క్రాప్ నమోదు, 70 శాతం రైతుల ఈ-కేవైసీ నమోదు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన 30 శాతం మంది రైతులతో ఈ నెల10వ తేదీ కల్లా ఈ-కేవైసీ పూర్తిచేయాలన్నారు. అధికారులందరూ ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదులో వాస్తవికతను ధ్రువీకరించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఈ-క్రాప్ నమోదు ముగిసిన తర్వాత ఆర్బీకేల్లో



సామాజిక తనిఖీ నిర్వహించాలన్నారు. గ్రామసభలో ముసాయిదా జాబితాలోని ప్రతి రైతు పంట వివరాలను విత్తిన తేదీతో సహా చదివి ధ్రువీకరించాలని సూచించారు. సామాజిక తనిఖీ అనంతరం ఈ నెల 20వ తేదీన తుది జాబితా ప్రదర్శించాలన్నారు. అక్టోబర్ రెండోవారంలో జమచేయనున్న పీఎం కిసాన్ 15వ విడత సాయం కోసం.. అర్హతగల రైతులందరూ ఆధార్‌తో భూమి రికార్డులు, బ్యాంకు ఖాతాలు, ఈ-కేవైసీ తప్పనిసరి చేసినందున ఈ నెల 15వ తేదీకల్లా వాటిని సరిచేసుకోవాలని కోరారు. యూరియా వ్యవసాయేతర అవసరాలకు తరలిపోకుండా విక్రయాలపై నిఘా పెట్టాలన్నారు. ప్రతి మండలంలో నెలవారీగా అత్యధిక యూరియా అమ్మకాలు జరిపే కొనుగోలుదారులను, డీలర్లను పరిశీలించి లోటుపాట్లపై నివేదికలు పంపించాలని ఆదేశించారు. ప్రతి మండలానికి కిసాన్ డ్రోన్ల ఏర్పాటులో భాగంగా గుర్తించిన రైతు పైలట్‌ల శిక్షణ కోసం జారీచేసిన మార్గదర్శకాలను మరింత సులభతరం చేస్తామని చెప్పారు. పాస్‌పోర్ట్ ఉండాలనే నిబంధనను తొలగించామన్నారు. ఆర్బీకేల వారీగా గుర్తించిన సీహెచ్‌సీల్లోని రైతులతో అంగీకారపత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. గ్యాప్ పొలంబడులకు ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడ్యూసర్స్ సర్టిఫికేషన్ అథారిటీ (ఏపీఎస్ఓపీసీఏ)తో రైతు ఉత్పత్తి సంఘాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన చెప్పారు.

టీడీపీ 'బలహీనత'ను ఒప్పుకుంటారా?

పవన్ వ్యాఖ్యలను టీడీపీ నేతలు అంగీకరిస్తున్నారా?: సజ్జల

- జనసేన ఎన్ని సీట్లలో పోటీ చేస్తుంది? టీడీపీకి ఎన్ని సీట్లు ఇస్తున్నారు?
- టీడీపీని స్వాధీనం చేసుకుంటున్నట్లయితే అది బహిర్గతం చేయాలి
- పవన్ ఎన్డీఏ నుంచి బయటకొచ్చాననడంపై బీజేపీ నేతలు స్పందించాలి
- సీఎం జగన్ ఢిల్లీ పర్యటన రాష్ట్ర ప్రయోజనాల కోసమే

సాక్షి, అమరావతి: టీడీపీ బలహీనపడిందంటూ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను అంగీకరిస్తున్నారా? అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి సూటిగా ప్రశ్నించారు. జవసత్వాలు ఉడిగిపోయి బలహీనపడిన టీడీపీకి యువ రక్తాన్ని ఎక్కించేందుకే ఎన్డీఏ నుంచి బయటకొచ్చానంటూ పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఎందుకు ప్రసారం చేయలేదని ఎల్లో మీడియాను నిలదీశారు. ఎన్డీఏ నుంచి బయటకొచ్చానంటూ పవన్ కళ్యాణ్ స్పష్టం చేయడంపై స్పందించాలని బీజేపీ నేతలకు సూచించారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సజ్జల మీడియాతో మాట్లాడారు. జనసేన ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుంది? టీడీపీకి ఎన్ని సీట్లు ఇస్తారో పవన్ వెల్లడించాలన్నారు. బలహీనపడిన టీడీపీని జనసేన స్వాధీనం చేసుకుంటున్నట్లయితే అదే విషయాన్ని బహిర్గతం చేయాలన్నారు.

బాబును జైలుకు పంపింది కోర్టే..

ప్రభుత్వ ఖజానా నుంచి రూ.371 కోట్లు దోచేసి స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికిపోయిన గజదొంగ చంద్రబాబును జైలుకు పంపింది సీఎం జగన్ కాదని.. ఏసీబీ కోర్టు అని ఓ ప్రశ్నకు సమాధానంగా సజ్జల పేర్కొన్నారు. చంద్రబాబుకు ఐటీ శాఖ జారీ చేసిన నోటీసులతో ఆయన వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన పెండ్యాల శ్రీనివాస్ ద్వారా ముడుపులు చేరినట్లు స్పష్టమైందన్నారు. స్కిల్ స్కామ్‌లో డిజైన్ టెక్‌కు రూ.371 కోట్లు దోచిపెట్టి వాటిని షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు ఎలా జేబులో వేసుకున్నారన్నది పెండ్యాల శ్రీనివాస్‌ను విచారిస్తే బయటపడుతుందన్నారు. అందుకనే పెండ్యాల శ్రీనివాస్ అమెరికాకు పారిపోయేలా



చంద్రబాబు చేశారన్నారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు పాత్ర లేదని ఆయన లాయర్లు న్యాయస్థానాల్లో వాదించడం లేదని, కేవలం సాంకేతిక కారణాలపైనే వాదనలు వినిపిస్తున్నారని గుర్తు చేశారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య ఉండాల్సిన సంబంధాలనే సీఎం వైఎస్ జగన్ కొనసాగిస్తున్నారని, రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి, రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టుకోవడానికే ఢిల్లీ వెళ్తున్నారని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 50, 60 సార్లు ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు వ్యక్తిగత ప్రయోజనాల కోసమే పర్యటించారని పేర్కొంటూ పోలవరం నిర్మాణ పనులను దక్కించుకోవడం, ప్రత్యేక హోదా కాకుండా ప్యాకేజీకి అంగీకరించడం లాంటి వాటిని సజ్జల ఉదహరించారు. సీఎం జగన్ ఢిల్లీ వెళ్లినప్పుడల్లా ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

ముందస్తు ఎన్నికలు టీడీపీ సృష్టే..

చంద్రబాబు జైలులో ఉండగానే ఎన్నికలకు వెళ్లి ప్రయోజనం పొందాలని సీఎం జగన్ భావిస్తున్నారంటూ కొన్నాళ్లుగా టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను మీడియా ప్రస్తావించగా సజ్జల కొట్టిపారేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలకు సంబంధించి రేపో మాపో కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు జారీ చేసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో సీఎం జగన్ ముందస్తు ఎన్నికలకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. ముందస్తు ఎన్నికలన్నవి టీడీపీ నేతలు సృష్టించినవేనని పునరుద్ఘాటించారు. అభం శుభం తెలియని పిల్లాడితో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డిని, సీఎం జగన్‌ను తిట్టిస్తూ చంద్రబాబు భార్య భువనేశ్వరితోపాటు టీడీపీ నేతలు ఆనందపడ్డారని.. అది వారి సంస్కారమంటూ సజ్జల విమర్శించారు. టీడీపీ నేతల సైకో మాటలు, వ్యవహారశైలిని పట్టించుకోబోమన్నారు. 52 నెలలుగా సీఎం జగన్ ప్రజలకు చేసిన మంచే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయం సాధించడానికి బాటలు వేస్తుందని స్పష్టం చేశారు.

కృష్ణా జలాల పంపిణీని తిరగతోడటం సరి కాదు

కృష్ణా జలాల పంపిణీని కేంద్రం తిరగతోడాలని నిర్ణయించడం సరి కాదని సజ్జల పేర్కొన్నారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు మరిన్ని విధి విధానాలను ప్రతిపాదిస్తూ కేంద్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయంపై సాంకేతిక, న్యాయపరమైన అంశాలను అధ్యయనం చేస్తున్నామన్నారు. కేంద్రం తీసుకున్న నిర్ణయం న్యాయపరంగా నిలబడదని నిపుణులు చెబుతున్నారన్నారు. కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణ విషయంలో రాజీ పడే ప్రశ్నే లేదని తేల్చి చెప్పారు. ఓటుకు కోట్లు కేసులో తెలంగాణ సర్కార్ చేతిలో అడ్డంగా పట్టుబడిన దొంగ చంద్రబాబు కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను తెలంగాణకు తాకట్టు పెట్టారని గుర్తు చేశారు. సీఎం జగన్ కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణకు రాజీ లేని పోరాటం చేస్తుంటే టీడీపీ నేతలు విమర్శలు చేస్తుండటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు.

భార్యాబిడ్డలను హత్యచేసి.. ఆత్మహత్య


కడపలో పిస్టల్‌తో భార్య, ఇద్దరు కుమార్తెలను కాల్చి.. తాను కాల్చుకున్న హెడ్ కానిస్టేబుల్

- డెత్ బెనిఫిట్స్ రెండో భార్యకు, ఆమె కుమారుడికి చెందాలని సూసైడ్ నోట్
- ఆర్థిక ఇబ్బందులు, వివాహేతర సంబంధమే కారణమని ప్రాథమికంగా తేలిందన్న ఎస్పీ



భార్య మాధవితో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్ (ఫైల్ ఫొటో)

కడప అర్బన్: వైఎస్సార్ జిల్లా కడపలో హెడ్ కానిస్టేబుల్ భార్యాపిల్లల్ని హత్యచేసి, ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ టి.వెంకటేశ్వర్ (51) (హెచ్‌సీ 1895) ఈ దురాగతానికి పాల్పడ్డాడు. బుధవారం రాత్రి 11 గంటల నుంచి గురువారం తెల్లవారుజామున మూడుగంటలలోపు 9ఎంఎం పిస్టల్‌తో భార్య, ఇద్దరు పిల్లలను కాల్చి చంపేశాడు. తర్వాత అదే పిస్టల్‌తో కాల్చుకుని ప్రాణాలు తీసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. పులివెందులకు చెందిన వెంకటేశ్వర్ 1993లో కానిస్టేబుల్‌గా చేరాడు. అతడి భార్య మాధవి (47). వీరికి ఇద్దరు కుమార్తెలు లాస్య (21), అభిజ్ఞ (16). లాస్య డిగ్రీ, అభిజ్ఞ టెన్త్ చదువుతున్నారు. ఈ నేపథ్యంలో వెంకటేశ్వర్‌కు యారాసు రమాదేవి అనే మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. భర్త చనిపోయిన ఆమెకు నాగలోకేశ్వర్‌రెడ్డి అనే కుమారుడున్నాడు. ఈ క్రమంలో కుటుంబంలో కలతలు రేగాయి. ఈ నేపథ్యంలో వెంకటేశ్వర్ బుధవారం రాత్రి విధులు ముగించుకుని 10.30 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చాడు. తన కస్టడీలోనే ఉండే పోలీసు అధికారులకు సంబంధించిన ఓ పిస్టల్‌ను ఎవరికి తెలియకుండా వెంట తెచ్చుకున్నాడు. రాత్రి భోజనం తర్వాత భార్య, ఇద్దరు కుమార్తెలు బెడ్‌రూంలో పడుకుని ఉండగా కాల్చి చంపేశాడు. తర్వాత అదే పిస్టల్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం ఈ ఘటన వెలుగులోకి రావడంతో పోలీసులు వచ్చారు. ఘటనాస్థలంలో సూసైడ్ నోట్ కం అగ్రిమెంట్‌తో పాటు మరో డాక్యుమెంట్‌ను స్వాధీనం చేసుకున్నారు. సూసైడ్‌నోట్‌లో తన భార్య, ఇద్దరు పిల్లలు చనిపోయారు కాబట్టి, తన మరణానంతరం ప్రభుత్వం నుంచి రావాల్సిన డెత్ బెనిఫిట్స్ మొత్తం తన రెండో భార్య యారాసు రమాదేవికి, ఆమె కుమారుడు యారాసు నాగలోకేశ్వర్ రెడ్డికి చెందాలని రాశాడు. మరో డాక్యుమెంట్‌లో రమాదేవి నుంచి తాను అవసరాల నిమిత్తం రూ.20 లక్షలు అప్పు తీసుకున్నానని, ప్రతిఫలంగా తనకు పులివెందుల మండలం ఉలిమెల వద్ద అనువంశికంగా వచ్చిన స్థిరాస్తిని రాసి ఇస్తున్నట్లు ఉంది. భార్యాపిల్లలను చంపకముందు వారు పూర్తిగా నిద్రలోకి జారుకునేందుకు మత్తుమందు కలిపి ఇచ్చినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, సీఐలు ఎన్.వి.నాగరాజు, రామచంద్ర, సయ్యద్ హసం, ఎస్బీ సీఐలు అశోక్‌రెడ్డి, యు.వెంకటకుమార్, సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం వారు ఆధారాలను సేకరించారు. మృతదేహాలను డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజాద్‌బాషా, కడప మేయర్ కె.సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అఫ్జల్‌ఖాన్, పులి సునీల్ కుమార్, సిబ్బంది పరిశీలించారు. డీఎస్పీని అడిగి వివరాలను తెలుసుకున్నారు. మృతదేహాలను కడప రిమ్స్ మార్చురీకి తరలించారు. మార్చురీలో మృతదేహాలను ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్థిక సమస్యలు, వివాహేతర సంబంధం కారణంగా ఈ ఘటన జరిగిందని ప్రాథమిక విచారణలో తేలిందని చెప్పారు. సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. కర్నూలు డీఐజీ సెంథిల్‌కుమార్ కడప వచ్చి స్టేషన్‌లో పోలీసు అధికారులను, సిబ్బందిని విచారించారు.





జంతువులు చేసేకామెడీని ప్రతిబింబించే కామెడీ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ పురస్కారాల ఫైనలిస్టులను తాజాగా ప్రకటించారు. 2015 నుంచి ఈ అవార్డులను ఇస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్లు దీని కోసం పోటీపడుతుంటారు. ఫైనల్ జాబితాకు చేరిన వాటిల్లో కొన్ని మీకోసం



సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం ॥ 6-10-2023

పురస్కారం

'ఇంటి మూలన వంట గది'
'అడవిలో హరిణి'
'సంధ్య వెలుతురు'...
సి.ఎస్.లక్ష్మి అనే
చిత్తూరు సుబ్రహ్మణ్యం లక్ష్మి
కథల సంపుటాల పేర్లు ఇవి.
'అంబై' కలం పేరుతో
తమిళంలో స్త్రీల పారంపరిక బంధనాలను
ప్రశ్నించే కథలు రాస్తున్న
సి.ఎస్.లక్ష్మికి ప్రతిష్ఠాత్మక
'టాటా లిటరేచర్ లైఫ్‌టైమ్ అవార్డు'
ఈ సంవత్సరానికి ప్రకటించారు.
'స్పారో' అనే సంస్థను స్థాపించి
మహిళా సాహిత్యకారుల
చరిత్రను నిక్షిప్తం చేస్తున్న
లక్ష్మి పరిచయం... ఆలోచనలు...


సి.ఎస్.లక్ష్మి

నీ కోసం కథలు రాసి

'నన్ను మహిళా రచయిత అని ప్రత్యేకంగా పిలవొద్దు. పురుషులు ఏం రాసినా వారిని పురుష రచయిత అంటున్నారా? మమ్మల్ని మాత్రం మహిళా రచయితలు అనడం ఎందుకు? మమ్మల్ని కూడా రచయితలు అనే పిలవండి' అంటారు సి.ఎస్.లక్ష్మి.

'అంబై' కలం పేరుతో తమిళ పాఠకులకు సుదీర్ఘకాలంగా అభిమాన రచయిత్రిగా ఉన్న సి.ఎస్.లక్ష్మి ఒకటీ రెండు నవలలు రాసినా ఎక్కువగా అంకితమైంది కథలకే. అదీ స్త్రీల కథలకే. తమిళంలో స్త్రీవాద దృక్పథంతో రాసి ఒక కదలిక తేగలిగిన రచయితల్లో సి.ఎస్.లక్ష్మి ప్రముఖులు. సుదీర్ఘ కాలంగా తాను ఆశించిన స్త్రీ వికాసం కోసం కలాన్ని అంకితం చేయడం వల్లే ఆమెకు 'టాటా లిటరేచర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు' 2023 సంవత్సరానికి ప్రకటించారు. టాటా సన్స్ ప్రతినిధి హరీష్ భట్ ఈ విషయాన్ని తెలియచేస్తూ 'స్త్రీలు తాము మోయక తప్పని మూసలను లక్ష్మి తన కథల ద్వారా బద్దలు కొడుతూనే వచ్చారు' అని వ్యాఖ్యానించారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును గతంలో అందుకున్న వారిలో వి.ఎస్.నైపాల్, మహాశ్వేతా దేవి, రస్కిన్ బాండ్, గిరీష్ కర్నాడ్ తదితరులు ఉన్నారు.

ఊరు కోయంబత్తూరు

కోయంబత్తూరులో జన్మించిన అంబై ఢిల్లీలోని జె.ఎన్.యు నుంచి పిహెచ్.డి పట్టా పొందారు. తమిళనాడులో అధ్యాపకురాలిగా పని చేస్తూ కథలు రాశారు. డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్ విష్ణు మాథూర్‌ని వివాహం చేసుకుని తర్వాతి కాలంలో ముంబైలో స్థిరపడ్డారు. 18 ఏళ్ల వయసులో తొలిసారి పిల్లల కోసం 'నందిమలై చరలిలె' (నందిమల కొండల్లో) అనే డిటెక్టివ్ నవలతో ఆమె రచనా జీవితం మొదలైనా 1967లో రాసిన 'సిరగుగల్ మురియుమ్'(రెక్కలు విరిగిపోతాయి) అనే కథతో సిసలైన బాట పట్టారు. స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం, స్త్రీవాద దృక్పథం గురించి తమిళంలో తొలిసారి గొంతు విప్పిన రచయిత్రి ఆమేనని విమర్శకులు అంటారు. సంప్రదాయం, ఆచారాలు మహిళల్ని ప్రత్యక్షంగా పరోక్షంగా అణచివేస్తున్నాయో ఆమె తన కథల్లో వివరించే ప్రయత్నం చేశారు. తప్పక చదవాల్సిన తమిళ కథల్లో అంబై రాసిన 'వీట్టిన్ మూలై ఒరు సమేలరై', 'అమ్మా ఒరు కొలై సెయ్‌దల్', 'కరుప్పు కుదిరై చతుక్కుమ్' కథలు ఉంటాయని రచయిత జయమోహన్ పేర్కొన్నారు. 2021లో అంబైకు సాహిత్య అకాడెమీ పురస్కారం దక్కింది.

కలం పేరు వెనుక కథ

తన కలం పేరు 'అంబై'గా మార్చుకోవడానికి వెనకున్న కథను గతంలో వెల్లడించారామె. శుక్రవారం పుట్టే ఆడపిల్లలకు 'లక్ష్మి' అనే పేరు పెడతారని, తనకూ అదే పేరు పెడితే ఆ పేరుతోనే కథలు రాయాలపించలేదని చెప్పారు. తమిళ సీనియర్ రచయిత దేవన్ రాసిన 'పార్వతిన్ సంగల్పం (పార్వతి సంకల్పం)' నవలలో భర్త చేత అణచివేతకు గురైన ఓ భార్య తన పేరును అంబైగా మార్చుకొని రాయడం మొదలు పెడుతుందని, అదే తనకు స్ఫూర్తినిచ్చి కలం పేరును అంబైగా మార్చుకున్నానని తెలిపారు.

సాహితీ కార్యకర్త

సి.ఎస్.లక్ష్మి కేవలం రాయడమే కాదు చాలా సాహితీ కార్యక్రమాలు చేస్తారు. తమిళంలో మహిళా సాహిత్యం గురించి ఆమె చేసిన పరిశోధన ముఖ్యమైనది. 1994లో చెన్నైలో స్థాపించిన రోజ ముత్తయ్య రీసెర్చ్ లైబ్రరీ ఏర్పాటు వెనుక అంబై కీలకంగా నిలిచారు. ప్రపంచంలోని అతి పెద్ద ప్రైవేటు లైబ్రరీల్లో ఇదీ ఒకటి కావడం విశేషం. ప్రస్తుతం ఇక్కడ మూడు లక్షల పుస్తకాల దాకా ఉన్నాయి. అలాగే 1988లో SPARROW (Sound and Picture Archives for Research on Women) అనే ఎన్జీవో ప్రారంభించారు. మహిళా రచయితలు, మహిళా కళాకారుల రచనలు, ప్రతిభ, వారి కృషిని డాక్యుమెంట్ చేయడం, నిక్షిప్తం చేయడం ఆ సంస్థ లక్ష్యం. ప్రస్తుతం ఆమె ఆ సంస్థకు అధ్యక్షురాలిగా ఉన్నారు. తన సంస్థ తరఫున అనేక పుస్తకాలు ప్రచురించారు.



ఫ్యాషన్

క్లాస్ గా ఉండాలి.. కలర్ ఫుల్ గా కనిపించాలి.
కంఫర్ట్‌వేర్‌గా కరెక్ట్ అనిపించాలి .. వెస్టర్న్‌లుక్ ఉండాలి.. ఇండియన్ స్టైల్ లో మెరవాలి
వీటన్నిటికి ఒకే ఒక ఆన్సర్... సింగిల్ షోల్డర్ టాప్స్.
సంప్రదాయపు వేడుకలకు వెస్టర్న్ పార్టీలకు నప్పే ఈ డ్రెస్సింగ్‌కి
కేప్ స్టైల్‌గానూ పేరుంది.
లెహంగా, పలాజో, టులిప్ ప్యాంట్స్‌కి నప్పే ఈ సింగిల్ షోల్డర్ కుర్తీలు
సరైన ఎంపికగా నిలుస్తున్నాయి.

సింగిల్ షోల్డర్.. డబుల్ బ్యూటీ

ఎంబ్రాయిడరీ

సంప్రదాయ వేడుకలకు ఎంబ్రాయిడరీ చేసిన కేప్ లేదా సింగిల్ షోల్డర్ కుర్తీలను ఎంచుకోవచ్చు.

ప్లెయిన్ లేదా ఫ్లోరల్

గెట్ టు గెదర్, బర్త్ డే పార్టీలకు ప్లెయిన్.

ఫ్లోరల్ సెట్స్ బాగా సూటవుతాయి.

ఈ డ్రెస్సింగ్ లోనే ప్రత్యేకత ఉంటుంది కాబట్టి, ఇతర అభరణ హంగులేవీ అక్కర్లేదు.

వంటిల్లు

ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు,
క్యాల్షియం పుష్కలంగా ఉండే రొయ్యలు ...
రుచిగా ఉండి తినేకొద్దీ తినాలనిపిస్తుంటాయి.
రొయ్యలను మరింత రుచిగా, కరకరలాడేలా,
కమ్మగా ఇలా వండుకోవచ్చని చెబుతోంది
ఈ వారం మన ప్రాన్స్‌పాట్...

కరకరగా.. కమ్మగా



గార్లిక్ బటర్ ప్రాన్స్



కావలసినవి: పచ్చిరొయ్యలు – అరకేజీ; వెల్లుల్లి రెబ్బలు – ఐదు; వెన్న – రెండు టేబుల్ స్పూన్లు; నూనె – టేబుల్ స్పూను; కారం – టీస్పూను; మిరియాల పొడి – అర టీస్పూను; నిమ్మరసం – టేబుల్ స్పూను; కొత్తిమీర తరుగు – పావు కప్పు; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● రొయ్యలను శుభ్రం చేసి, నాలుగైదు సార్లు కడగాలి ● మందపాటి బాణలిలో టేబుల్ స్పూను వెన్న, నూనె వేసి మంటమీద పెట్టాలి ● వెన్న కరిగిన వెంటనే కడిగిన రొయ్యలు వేసి రెండు నిమిషాలు వేయించాలి ● తరువాత రుచికి సరిపడా ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి ● ఐదు నిమిషాలు మగ్గిన తరువాత వెల్లుల్లి రెబ్బలను సన్నగా తరిగి వేయాలి ● రెండు నిమిషాలు తరువాత మిగిలిన వెన్న, కారం నిమ్మరసం వేసి అన్ని కలిసేలా కలపాలి ● వెన్న పైకి తేలేంత వరకు వేయించాలి ● వెన్న పైకి తేలిన తరువాత సన్నగా తరిగిన కొత్తిమీర చల్లి దించేయాలి.

రొయ్యల పచ్చడి

కావలసినవి: ఎండు రొయ్యలు – కప్పు; ఉల్లిపాయ – ఒకటి; పచ్చిమిర్చి – ఐదు; నూనె – టేబుల్ స్పూను; కొత్తిమీర – పావు కప్పు; జీలకర్ర – టేబుల్ స్పూను; వెల్లుల్లి రెబ్బలు – పది; ధనియాల పొడి – టేబుల్ స్పూను; కారం – టేబుల్ స్పూను; గరం మసాలా పొడి – అర టేబుల్ స్పూను.

తయారీ: ● రొయ్యల తల, తోక తీసేసి పది నిమిషాలు నానబెట్టుకోవాలి ● నానిన రొయ్యలను ఇసుక లేకుండా శుభ్రంగా కడిగి నీరు లేకుండా పిండాలి ● ఉల్లిపాయను పెద్ద ముక్కలుగా తరిగి బాణలిలో వేయాలి ● పచ్చిమిర్చిని కూడా దోరగా వేయించి తీసేయాలి ● ఇదే బాణలిలో నూనె వేయాలి. కాగిన నూనెలో పిండిపెట్టుకున్న రొయ్యలను వేసి నూనె పైకి తేలేంత వరకు వేయించాలి ● ఇప్పుడు మిక్సీజార్‌లో వేయించిన ఉల్లి, పచ్చిమిర్చి, కొత్తిమీర, వేయించిన రొయ్యలు, ధనియాల పొడి, కారం, గరం మసాలా, వెల్లుల్లి రెబ్బలు, రుచికి సరిపడా ఉప్పు వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేసుకుంటే రొయ్యల పచ్చడి రెడీ. వేడివేడి అన్నంలోకి ఈ పచ్చడి చాలా రుచిగా ఉంటుంది.

● టెక్.. టాక్



యాపిల్ ఐఫోన్ 15 ప్లస్

డిస్‌ప్లే: 6.70 అంగుళాలు
వోఎస్/సాఫ్ట్‌వేర్: ఐవోఎస్ 17
రిజల్యూషన్: 1290X2796 పిక్సెల్స్
బ్యాటరీ: 4383 ఎంఏహెచ్
మెమోరీ: 128జీబి 6జీబి ర్యామ్/ 256జీబి 6జీబి ర్యామ్/ 512జీబి 6జీబి ర్యామ్

పిక్సెల్ వాచ్ 2

గూగుల్ వారి పిక్సెల్ వాచ్ 2 – కొన్ని వివరాలు...
● 100 శాతం అల్యూమినియం బాడీ
● సైజ్: 1.2 అంగుళాలు ● సేఫ్టీ చెక్ ఫీచర్
● బ్యాటరీ: 306 ఎంఏహెచ్ ● హార్ట్ రేట్ సెన్సర్
● కలర్స్: సిల్వర్, మ్యాటీ బ్లాక్, గోల్డ్





వివో వై 17

సైజ్: 6.5 అంగుళాలు
● 50 ఎంపీ మెయిన్ కెమెరా
ర్యామ్: 4జీ
రిఫ్రెష్ రేట్: 60 హెచ్‌జడ్
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్

వాట్సాప్‌లో చానల్స్ హైడ్ చేయడానికి...



వాట్సాప్ కొత్తగా తీసుకువచ్చిన చానల్స్ ఫీచర్ కొందరికి నచ్చింది. కొందరికి నచ్చలేదు. నచ్చని జాబితాలో మీరు ఉంటే ఆ ఫీచర్‌ని హైడ్ చేయడానికి (ఆన్‌ఆండ్రాయిడ్): వాట్సాప్ అప్‌డేట్ చేయకపోతే చానల్స్ ఫీచర్ లేకుండానే పాత వెర్షన్‌ను వాడుకోవచ్చు. ఒకవేళ అప్‌డేట్ అయితే.. ● చాట్స్‌ను బ్యాకప్ చేయాలి.
● అన్ ఇన్‌స్టాల్–న్యూ వెర్షన్.
● ఇన్‌స్టాల్ ఓల్డ్ వెర్షన్

బింగ్ ఇమేజ్ క్రియేటర్ ఉపయోగించడానికి...

1. మైక్రోసాఫ్ట్ ఎడ్జ్‌లో 'బింగ్ ఇమేజ్ క్రియేటర్' అందుబాటులో ఉంది. దీన్ని ఉపయోగించడానికి సైడ్‌బార్‌లో ఉన్న 'బింగ్ ఇమేజ్ క్రియేటర్' ఐకాన్‌ను క్లిక్ చేయాలి.
2. బ్రౌజర్ ఓపెన్ చేసి వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి: బింగ్.కామ్/ఇమేజెస్/క్రియేట్
3. వెబ్‌పేజీలో 'జాయిన్ అండ్ క్రియేట్' బటన్ క్లిక్ చేయాలి.
4. మైక్రోసాఫ్ట్ ఎకౌంట్ అవసరం. ఒకవేళ లేకపోతే కొత్త ఎకౌంట్ క్రియేట్ చేసుకోవాలి.
5. 'సైన్ ఇన్' అయిన తరువాత మీకు నచ్చిన ప్రాంప్ట్‌ను సెలెక్ట్ చేసుకోవచ్చు. లేదా సజెస్టెడ్ ప్రాంప్ట్ కోసం 'సర్‌ప్రైజ్‌మీ బటన్' క్లిక్ చేయాలి.
6. ప్రాంప్ట్‌లోకి ఎంటర్ అయిన తరువాత ఇమేజ్ జెనరేషన్ ప్రాసెస్ కోసం 'క్రియేట్ బటన్' నొక్కాలి. ఇమేజ్ జెనరేషన్‌కు ప్రతి ప్రాంప్ట్‌కు 10–20 సెకన్ల సమయం తీసుకుంటుంది.
7. ఇమేజ్ జనరేట్ అయిన తరువాత అవసరాన్ని బట్టి సేవ్, కాపీ పేస్ట్ చేసుకోవచ్చు.



● సక్సెస్ స్టోరీ

సాహోరే... టాప్ స్పీడ్ స్టార్స్



● నారాయణ్ సుబ్రమణ్యం, నీరజ్ రాజ్‌మోహన్

'ఇమాజినేషన్ ఈజ్ మోర్ ఇంపార్టెంట్ దేన్ నాలెడ్జ్' అంటూ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ 'ఊహా శక్తి'కి ఉండే అపారమైన శక్తి ఏమిటో చెప్పకనే చెప్పారు. ఈ ఇద్దరు మిత్రులకు ఊహాశక్తితో పాటు సాంకేతిక నైపుణ్యశక్తి కూడా ఉంది. ఈ రెండు శక్తులను సమన్వయం చేసుకుంటూ కాలేజీ రోజుల నుంచి చిన్న చిన్న ఆవిష్కరణలు చేస్తున్నారు. ఆ ప్యాషన్ వారిని ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా మార్చి బైక్ మార్కెట్‌లోకి అడుగు పెట్టేలా చేసింది. ఈవీ స్టార్టప్ 'అల్ట్రావయొలెట్'తో స్పీడ్‌గా దూసుకుపోతున్నారు...

2006లో...

బెంగళూరులోని బీఎంఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్ నారాయణ్ సుబ్రమణ్యం, నీరజ్ రాజ్‌మోహన్‌లు ఐఐటీ, మద్రాస్ నిర్వహించిన పోటీలో ఎయిర్–ప్రొపెల్డ్ వాటర్ క్రాఫ్ట్ రూపొందించి 'బెస్ట్ డిజైన్' అవార్డ్ గెలుచుకున్నారు. ఈ పోటీలో దేశవ్యాప్తంగా ఎన్నో ఐఐటీ టీమ్‌లు పాల్గొన్నాయి.

కట్ చేస్తే... ఈ ఇద్దరు ఎలక్ట్రిక్ సూపర్ బైక్ స్టార్టప్ 'అల్ట్రావయొలెట్'తో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. నారాయణ్, నీరజ్‌లకు స్కూలు రోజుల నుంచి ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్ అంటే ఇష్టం. కాలేజీలో చేరే నాటికి ఆ ఇష్టం మరోస్థాయికి చేరింది. అన్నిరకాల ఎయిర్ క్రాఫ్టులు, రోబోటిక్స్,హైడ్రోప్లెయిన్స్, ఎలక్ట్రిక్ సబ్‌మెరైన్‌లు తయారుచేసేవారు. దేశవ్యాప్తంగా ఎన్నో పోటీల్లో పాల్గొనేవారు.

సూపర్‌బైక్ తయారు చేయాలనేది వారి కల.

కాలేజీ చదువు పూర్తయిన తరువాత ఇద్దరి దారులు వేరయ్యాయి. పై చదువుల కోసం నీరజ్ కాలిఫోర్నియా, నారాయణ్ స్వీడన్ వెళ్లారు. ఆ తరువాత టాప్ ఆటోమోటివ్ కంపెనీలలో పనిచేశారు. అయితే ఇద్దరిలోనూ ఏదో అసంతృప్తి ఉండేది. వారు అనేకసార్లు మాట్లాడుకున్న తరువాత 'ఏదైనా సాధించాలి' అనే నిర్ణయానికి వచ్చారు.

అలా బెంగళూరు కేంద్రంగా ఈవీ స్టార్టప్ 'అల్ట్రావయొలెట్'కు శ్రీకారం చుట్టారు. ఆటోమోటివ్, కన్స్యూమర్ టెక్, ఏరో స్పేస్ నిపుణులతో గట్టి బృందాన్ని తయారుచేసుకున్నారు.

ఈ మిత్రద్వయం మోటర్‌ఫీల్డ్‌కు కొత్త కాబట్టి వారి టీమ్‌లో చేరడానికి తటపటాయించేవారు. అయితే కాస్త ఆలస్యంగానైనా ప్రతిభావంతులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసుకోగలిగారు.

అందరిలాగే తమ స్టార్టప్‌కు కరోన కష్టాలు మొదలయ్యాయి. తమ ఫస్ట్ ఆల్–ఎలక్ట్రిక్ పెర్‌ఫార్మెన్స్ బైక్ ఎఫ్ 77 మోడల్ తయారీని నిలిపివేయాల్సి వచ్చింది. పరిస్థితి మెరుగుపడుతుందనుకుంటున్న సమయంలో 'ఎఫ్77'ను రీవ్యాంప్ చేశారు.

'భిన్నమైన సంస్కృతులు, అభిరుచులు ఉన్న మనలాంటి దేశంలో ఈవీలతో మెప్పించడం అనేది పెద్ద సవాలు. ఈ టెక్నాలజీ గురించి చాలామంది అపోహలతో ఉన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని వారి మైండ్‌సెట్‌ను మార్చాలనుకున్నాం. ఈవీలో మాకు సాధ్యమైన కొత్త ఫీచర్‌లు తీసుకువచ్చాం. మా అల్ట్రావయొలెట్‌కు ఏవియేషన్, ఏరోస్పేస్ సెక్టార్‌లు స్ఫూర్తి. మాకు కొత్త ఆవిష్కరణలు అంటే ఆసక్తి' అంటున్నాడు 'అల్ట్రావయొలెట్' కో–ఫౌండర్, సీఇవో నారాయణ్.

ఇక ఇద్దరి అభిరుచుల విషయానికి వస్తే...నీరజ్ పుస్తకాల పురుగు. పుస్తకాలు ఎక్కువగా చదవడం ద్వారా తనకు కొత్త ఐడియాలు వస్తాయి అంటాడు. ఇక నారాయణ్‌కు 'క్రియేటివిటీ అండ్ ఫిట్‌నెస్' ఇష్టమైన సబ్జెక్ట్. అయితే టెక్నికల్ స్కిల్స్ విషయంలో మాత్రం ఇద్దరికీ సమ ప్రతిభ ఉంది. నారాయణ్ ఆటోమోటివ్ ఇంజనీరింగ్ అండ్ డిజైన్‌లో, రాజ్‌మోహన్ కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ నాలెడ్జ్‌లో ఎక్స్‌పర్ట్.

'మేము అద్భుతాన్ని సృష్టించాలనుకున్నాం. అనుకోవడానికైతే ఎన్నైనా అనుకోవచ్చు. ఆచరణలో మాత్రం రకరకాల సవాళ్లు ఎదురొస్తుంటాయి. వాటిని తట్టుకొని నిలబడడమే అసలు సిసలు సవాలు. అలాంటి సవాలును అధిగమించి మా కలను నిజం చేసుకున్నందుకు సంతోషంగా ఉంది' అంటున్నాడు 'అల్ట్రావయొలెట్' ఫౌండర్‌లలో ఒకరైన నీరజ్.

యువర్స్

● ఇంగ్లిష్ ఇడియమ్స్




జీరో ఇన్ ఆన్

ఒక విషయం లేదా వ్యక్తిపై పూర్తిగా దృష్టి పెట్టడం.
ఉదా: మస్ట్ డిసైడ్ ఆన్ అవర్ టార్గెట్ మార్కెట్ అండ్ జీరో ఇన్ ఆన్ ఇట్

వెర్బల్ డయేరియా

నాన్ స్టాప్‌గా మాట్లాడే వారిని దృష్టిలో పెట్టుకొని ఉపయోగించే మాట...వెర్బల్ డయేరియా.

● అవును... ఇది నిజమే!



● రాజకీయాల్లోకి రాక ముందు అబ్రహం లింకన్ ఛాంపియన్ రెజ్లర్.
● టైటానిక్ షిప్ మునిగిపోవడానికి కొన్ని సంవత్సరాల ముందు ప్రముఖ రచయిత మోర్గాన్ రాబర్ట్‌సన్ 'ఫ్యుటిలిటీ' అనే నవల రాశాడు. టైటానిక్ దుర్ఘటనకు, ఈ నవలలోని కొన్ని అంశాలకు పోలిక కనబడుతుంది. టైటానిక్ లాగే ఈ నవలలోని నౌక మంచుకొండను ఢీ కొట్టి ఉత్తర అట్లాంటిక్ మహా సముద్రంలో మునిగిపోతుంది. ఈ నవలలో కూడా ప్రయాణికులందరికీ తగినన్ని లైఫ్ బోట్లు ఉండవు. రెండు నౌకల కొలతలు కూడా దగ్గరగా ఉంటాయి.

చిత్రతేజం

● ఆర్ట్ అండ్ కల్చర్



'సృజనకారులకు పరిశీలనకు మించిన బలం లేదు' అంటుంది కోల్‌కత్తాకు చెందిన యంగ్ ఆర్టిస్ట్ శ్రేయా రాయ్.

తాము పరిశీలించిన వాటిని కొందరు కవిత్వంలోకి తీసుకెళతారు. శ్రేయ మాత్రం చిత్రాల్లోకి తీసుకువచ్చింది. తనదైన శైలితో వాటికి కొత్త రూపం ఇస్తుంది. ఆమె జ్ఞాపకాలకు, పరిశీలనలకు డిజిటల్ కాన్వాస్‌ను వేదికగా చేసుకుంది.



శ్రేయ చిత్రాలు గ్రాఫిక్ నవలలోని క్యారెక్టర్‌లను గుర్తు తెస్తాయి. పాజిటివ్ ఎమోషన్స్ ఆమె చిత్రాలకు బలాన్ని ఇస్తాయి, నిత్యజీవిత దృశ్యాలను గుర్తు తెస్తాయి.

'స్త్రీలకు సంబంధించి నిత్యజీవిత దృశ్యాలు నా చిత్రాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఆరు బయట కూర్చొని స్త్రీలు మాట్లాడుకునే దృశ్యాలలో కూడా ఎంతో అందం ఉంది. కాల్పనికతకు కాకుండా వాస్తవికతకే ప్రాముఖ్యత ఇస్తాను' అంటున్న రాయ్ ఆర్కిటెక్ట్ కూడా. అయితే ఆమెకు చిత్రలేఖనం అంటేనే బాగా ఇష్టం.

'ఆర్కిటెక్చర్‌లో రకరకాల కొలతలతో పని. చిత్ర ప్రపంచంలో ఆలోచనలతోనే పని' అంటోంది రాయ్.



భారత జట్టును గెలిపించిన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్

ఆసియా క్రీడల చెస్ ఈవెంట్‌లో భారత పురుషుల జట్టు నాలుగో విజయం నమోదు చేసింది. వియత్నాం జట్టుతో గురువారం జరిగిన ఏడో రౌండ్‌లో భారత్ 2.5–1.5తో గెలిచింది. దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద, విదిత్ తమ ప్రత్యర్థులతో గేమ్‌లను 'డ్రా' చేసుకోవడంతో స్కోరు 1.5–1.5తో సమంగా నిలిచింది. నాలుగో మ్యాచ్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 30 ఎత్తుల్లో తువాన్ మిన్ ట్రాన్‌పై నెగ్గి భారత్‌కు 2.5–1.5తో విజయాన్ని అందించాడు. మహిళల విభాగంలో కజకిస్తాన్‌తో జరిగిన ఏడో రౌండ్ మ్యాచ్‌ను భారత జట్టు 2–2తో 'డ్రా'గా ముగించింది. బిబిసారాతో జరిగిన గేమ్‌ను కోనేరు హంపి 24 ఎత్తుల్లో 'డ్రా' చేసుకోగా... కమలిదెనోవాపై ద్రోణవల్లి హారిక 75 ఎత్తుల్లో గెలిచింది. వైశాలి 51 ఎత్తుల్లో జాన్సాయా చేతిలో ఓడిపోగా... దినారాతో జరిగిన గేమ్‌ను వంతిక 31 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. ఏడో రౌండ్ తర్వాత భారత పురుషుల, మహిళల జట్లు రెండో స్థానంలో కొనసాగుతూ పతకాల రేసులో ఉన్నాయి.



కాన్వేతో కలిసి... గెలుపు 'రచిన్'చాడు

- ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ గెలుపు బోణీ
- 9 వికెట్లతో ఇంగ్లండ్‌పై ఘన విజయం
- కాన్వే, రచిన్ రవీంద్ర అజేయ సెంచరీలు

గత ప్రపంచకప్ ఫైనల్‌కు ప్రతీకారమా అంటే సరిగ్గా ఈ మ్యాచ్‌కు ఆ విలువ లేకపోవచ్చు. కానీ ఇంగ్లండ్‌ను తాము చిత్తు చేసిన తీరు న్యూజిలాండ్‌కు మాత్రం పూర్తి సంతృప్తినిచ్చి ఉంటుంది. దుర్భేద్యమైన జట్టు, ఫేవరెట్‌లలో ఒకటిగా బరిలోకి దిగిన డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ తొలి మ్యాచ్‌లో పూర్తిగా చేతులెత్తేసింది. అటు పేలవ బ్యాటింగ్ ఆపై పసలేని బౌలింగ్‌తో తమ స్థాయిపై సందేహాలు రేకెత్తించింది. కివీస్ మాత్రం అద్భుత ఆటతో తమపై ఉన్న అంచనాలను అమాంతం పెంచేసుకుంది. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని పడగొట్టి ఆపై సునాయాస విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రపంచకప్‌లో తాము ఆడిన తొలి మ్యాచ్‌ల్లోనే అజేయ మెరుపు సెంచరీలు సాధించి కాన్వే, రచిన్ రవీంద్ర మరో 13.4 ఓవర్లు మిగిలి ఉండగానే జట్టు పేరిట గెలుపును లిఖించారు. రాహుల్+సచిన్ పేర్లను తన పేరులో ఉంచుకున్న రచిన్ అటు క్లాస్, ఇటు మాస్ ఆటను కూడా చూపించడం విశేషం.



రచిన్ రవీంద్ర   కాన్వే

అహ్మదాబాద్: వన్డే వరల్డ్ కప్ తొలి పోరు ఏకపక్షంగా ముగిసింది. 2019 ఫైనలిస్టుల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 9 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ జట్టును ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసింది. జో రూట్ (86 బంతుల్లో 77; 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా, జోస్ బట్లర్ (42 బంతుల్లో 43; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు. అనంతరం కివీస్ 36.2 ఓవర్లలో వికెట్ నష్టానికి 283 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (121 బంతుల్లో 152 నాటౌట్; 19 ఫోర్లు, 3 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రచిన్ రవీంద్ర (96 బంతుల్లో 123 నాటౌట్; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీలతో చెలరేగారు. వీరిద్దరు రెండో వికెట్‌కు అభేద్యంగా 273 పరుగులు జోడించడం విశేషం. వన్డేల్లో రెండో వికెట్‌కు న్యూజిలాండ్ తరఫున ఇదే అత్యుత్తమ భాగస్వామ్యం. గప్టిల్–విల్ యంగ్ పేరిట ఉన్న 203 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని కాన్వే–రచిన్ సవరించారు.

కీలక భాగస్వామ్యం...

బలమైన లైనప్, చివరి ఆటగాడి వరకు బ్యాటింగ్ చేయగల సామర్థ్యం ఉన్న ఇంగ్లండ్‌ను చూస్తే భారీ స్కోరు ఖాయమనిపించింది. తొలి ఓవర్ రెండో బంతినే బెయిర్‌స్టో (35 బంతుల్లో 33; 4 ఫోర్లు, 1 సిక్స్) సిక్సర్‌గా మలిచాడు. వరల్డ్ కప్ చరిత్రలో 'సిక్స్'తో స్కోరు మొదలు కావడం ఇదే తొలిసారి. అయితే ప్రత్యర్థిని కట్టడి చేయడంలో కివీస్ బౌలర్లు సఫలమయ్యారు. మలాన్ (14) విఫలం కాగా, ఆ తర్వాత తక్కువ వ్యవధిలో కివీస్ మరో 3 వికెట్లు పడగొట్టింది. రవీంద్ర ఓవర్లో వరుసగా 4, 4, 6 కొట్టిన బ్రూక్ (25) తర్వాతి బంతికి వెనుదిరిగాడు. ఈ దశలో రూట్, బట్లర్ ఆదుకున్నారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 72 బంతుల్లోనే 70 పరుగులు జోడించారు. అయితే ఈ భాగస్వామ్యాన్ని హెన్రీ విడదీశాక ఇంగ్లండ్ వేగంగా వికెట్లు కోల్పోయింది. లోయర్ ఆర్డర్‌లో ఎవరూ ఆశించిన స్థాయిలో



రూట్

ప్రభావం చూపలేకపోవడంతో స్కోరు కనీసం 300 పరుగులకు చేరువగా కూడా రాలేదు. వన్డే చరిత్రలో ఆడిన 11 మందీ కనీసం రెండంకెల స్కోరు చేయడం ఇదే మొదటిసారి కాగా... ప్రతీ ఒక్కరు అంతంతమాత్రంగానే ఆడటంతో ఇంగ్లండ్‌కు ఫలితం దక్కలేదు.

ఆడుతూ పాడుతూ...

స్యామ్ కరన్ వేసిన రెండో ఓవర్ తొలి బంతికే యంగ్ (0) అవుట్! దాంతో కివీస్ ఎలా లక్ష్యాన్ని ఛేదిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. కానీ కాన్వే, రవీంద్ర అసలు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. కెరీర్‌లో 13వ వన్డే ఆడుతూ తొలిసారి ఓపెనర్‌గా బరిలోకి దిగిన రవీంద్ర పూర్తి ఆత్మవిశ్వాసంతో ఆడగా, ఐపీఎల్ అనుభవాన్ని కాన్వే అద్భుతంగా వాడుకున్నాడు. వీరిద్దరు ప్రత్యర్థిపై బౌలర్లందరిపై ఆధిపత్యం ప్రదర్శిస్తూ చకచకా పరుగులు రాబట్టారు. 10 ఓవర్లలోనే స్కోరు 81 పరుగులకు చేరగా, చెరో 36 బంతుల్లోనే రవీంద్ర, కాన్వే అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. వీరిని కట్టడి చేయడంలో ఇంగ్లండ్ విఫలం కావడంతో 20 ఓవర్లకే స్కోరు 150 పరుగులకు చేరింది. ఆ తర్వాత ఈ జోడి ఎదురులేకుండా దూసుకుపోయింది. ముందుగా కాన్వే 83 బంతుల్లో, ఆ తర్వాత రవీంద్ర 82 బంతుల్లో శతకాలను అందుకున్నారు. ఆ తర్వాత ఇంగ్లండ్ ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోగా... కివీస్ సునాయాసంగా లక్ష్యం చేరింది. విలియమ్సన్ గాయం నుంచి కోలుకోకపోవడంతో లాథమ్ కెప్టెన్‌గా వ్యవహరించాడు.

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ X నెదర్లాండ్స్
వేదిక: హైదరాబాద్
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్‌స్టో (సి) మిచెల్ (బి) సాన్‌ట్నర్ 33; మలాన్ (సి) లాథమ్ (బి) హెన్రీ 14; రూట్ (బి) ఫిలిప్స్ 77; బ్రూక్ (సి) కాన్వే (బి) రవీంద్ర 25; మొయిన్ అలీ (బి) ఫిలిప్స్ 11; బట్లర్ (సి) లాథమ్ (బి) హెన్రీ 43; లివింగ్‌స్టోన్ (సి) హెన్రీ (బి) బౌల్ట్ 20; కరన్ (సి) లాథమ్ (బి) హెన్రీ 14; వోక్స్ (సి) యంగ్ (బి) సాన్‌ట్నర్ 11; ఆదిల్ రషీద్ (నాటౌట్) 15; వుడ్ (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం** (50 ఓవర్లలో 9 వికెట్లకు) 282. **వికెట్ల పతనం:** 1–40, 2–64, 3–94, 4–118, 5–188, 6–221, 7–229, 8–250, 9–252. **బౌలింగ్:** బౌల్ట్ 10–1–48–1, హెన్రీ 10–1–48–3, సాన్‌ట్నర్ 10–0–37–2, నీషమ్ 7–0–56–0, రవీంద్ర 10–0–76–1, ఫిలిప్స్ 3–0–17–2.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (నాటౌట్) 152; యంగ్ (సి) బట్లర్ (బి) కరన్ 0; రచిన్ రవీంద్ర (నాటౌట్) 123; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం** (36.2 ఓవర్లలో వికెట్ నష్టానికి) 283. **వికెట్ల పతనం:** 1–10. **బౌలింగ్:** వోక్స్ 6–0–45–0, స్యామ్ కరన్ 6–2–47–1, వుడ్ 5–0–55–0, అలీ 9.2–0–60–0, రషీద్ 7–0–47–0, లివింగ్‌స్టోన్ 3–0–24–0.

స్పందన కరువైంది...

వరల్డ్ కప్ తొలి మ్యాచ్ అంటే సహజంగా క్రికెట్ అభిమానుల్లో అమితాసక్తి ఉంటుంది. టాస్ వేసేసరికే స్టేడియాలు నిండిపోతాయి. కానీ ఈ మ్యాచ్‌పై అహ్మదాబాద్ ప్రేక్షకులు పెద్దగా ఆసక్తి చూపించినట్లుగా లేదు. మ్యాచ్ ఆరంభమైన చాలాసేపటి వరకు కూడా స్టేడియంలో చాలా భాగం ఖాళీగా కనిపించింది. భారత్ లేని మ్యాచ్‌కు లక్షకు పైగా సామర్థ్యం ఉన్న స్టేడియం ఫ్యాన్స్‌తో హౌస్‌ఫుల్ అవుతుందని కోరుకోవడం అత్యాశే అయినా మరీ నామమాత్రంగా కూడా జనం లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. చివరి వరకు వేర్వేరు కారణాలతో టికెట్లు అమ్మకానికి ఉంచకపోవడం, నగరంలో తీవ్రమైన ఎండ, వారాంతం కాకపోవడం కూడా అందుకు కారణాలు కావచ్చు. 40 వేల టికెట్లను స్థానిక రాజకీయ నాయకులు తమ కార్యకర్తలకు పంచిపెట్టారు. టికెట్లు తీసుకున్న వారంతా వచ్చేందుకు ఆసక్తి కనబర్చలేదని తెలిసింది. నిజానికి ఇలాంటి మెగా ఈవెంట్‌లు ఆతిథ్య జట్టు మ్యాచ్‌తో ప్రారంభం కావడం సహజంగా జరుగుతూ ఉంటుంది. కానీ నిర్వాహకులు భిన్నంగా ఆలోచించి 'ఫైనలిస్ట్'లతో పోరు ఖరారు చేశారు. మ్యాచ్ సాగినకొద్దీ సాయంత్రానికి స్టేడియంలో ప్రేక్షకులు సంఖ్య పెరగడం కాస్త ఊరట.



మన బాణం బంగారం

- ఆర్చరీలో భారత మహిళల, పురుషుల జట్లకు స్వర్ణ పతకాలు
- జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్ బృందం అద్భుతం
- ఓజస్ ప్రవీణ్, అభిషేక్ వర్మ, ప్రథమేశ్ జట్టు సంచలనం



జ్యోతి సురేఖ

ఆసియా క్రీడల్లో పన్నెండో రోజు భారత క్రీడాకారులు పసిడి ప్రదర్శనతో అలరించారు. ఆర్చరీ టీమ్ విభాగంలో రెండు స్వర్ణ పతకాలు సొంతం చేసుకోగా... స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో దీపిక పల్లికల్–హరీందర్‌పాల్ సింగ్ జోడీ బంగారు పతకంతో అదరగొట్టింది. స్క్వాష్ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ సౌరవ్ ఘోషాల్ రజతం నెగ్గి వరుసగా ఐదో ఆసియా క్రీడల్లోనూ పతకం సంపాదించడం విశేషం. మహిళల రెజ్లింగ్‌లో రైజింగ్ స్టార్ అంతిమ్ పంఘాల్ కాంస్య పతకంతో రాణించింది. బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్, డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి సెమీఫైనల్లోకి ప్రవేశించి పతకాలను ఖరారు చేసుకున్నారు. పన్నెండో రోజు పోటీలు ముగిశాక భారత్ 21 స్వర్ణాలు, 32 రజతాలు, 33 కాంస్యాలతో కలిపి 86 పతకాలతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది.



స్వర్ణ పతకాలతో జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్



పసిడి పతకాలతో ప్రథమేశ్, అభిషేక్ వర్మ, ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే

హాంగ్జౌ: చైనా నేలపై భారత బాణం బంగారమైంది. ఆసియా క్రీడల ఆర్చరీ ఈవెంట్‌లో భారత మహిళల కాంపౌండ్ జట్టు తొలిసారి స్వర్ణ పతకం సాధించగా... భారత పురుషుల కాంపౌండ్ జట్టు 2014 తర్వాత మళ్లీ పసిడి పతకం సంపాదించింది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత మహిళల జట్టు ఫైనల్లో 230–229తో యి సువాన్ చెన్, హువాంగ్ ఐజు, లు యున్ వాంగ్‌లతో కూడిన చైనీస్ తైపీ జట్టును ఓడించి తొలిసారి ఆసియా క్రీడల చాంపియన్‌గా అవతరించింది. సెమీఫైనల్లో భారత్ 233–219తో ఇండోనేసియా జట్టుపై, క్వార్టర్ ఫైనల్లో 231–220తో హాంకాంగ్ జట్టుపై విజయం సాధించింది. 2014 ఇంచియోన్ ఏషియాడ్‌లో జ్యోతి సురేఖ, త్రిషా దేబ్, పూర్వాషా షిండేలతో కూడిన భారత జట్టు కాంస్యం నెగ్గగా... 2018 జకార్తా ఏషియాడ్‌లో జ్యోతి సురేఖ, ముస్కాన్, మధుమితలతో కూడిన టీమిండియా రజతం కైవసం చేసుకుంది. మూడో ప్రయత్నంలో భారత్ ఖాతాలో స్వర్ణం చేరడం విశేషం. ఈ మూడుసార్లూ జ్యోతి సురేఖ జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించింది. 'ఆసియా క్రీడల్లో తొలిసారి టీమ్ స్వర్ణం నెగ్గినందుకు సంతోషంగా ఉన్నాం. శనివారం నా వ్యక్తిగత విభాగం ఫైనల్ కూడా ఉంది. ఆ ఈవెంట్‌లోనూ స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగుతా' అని విజయవాడకు చెందిన 27 ఏళ్ల జ్యోతి సురేఖ వ్యాఖ్యానించింది. ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే, అభిషేక్ వర్మ, ప్రథమేశ్‌లతో కూడిన భారత పురుషుల కాంపౌండ్ జట్టు ఫైనల్లో 235–230తో జేహూన్ జూ, జేవన్ యాంగ్, కింగ్ జాంగ్‌హోలతో కూడిన దక్షిణ కొరియా జట్టును ఓడించి బంగారు పతకం నెగ్గింది. సెమీఫైనల్లో భారత్ 235–224తో చైనీస్ తైపీపై, క్వార్టర్ ఫైనల్లో 235–221తో భూటాన్‌పై, తొలి రౌండ్‌లో 235–219తో సింగపూర్‌పై గెలుపొందింది. 2014 ఇంచియోన్ ఏషియాడ్‌లో రజత్ చౌహాన్, సందీప్ కుమార్, అభిషేక్ వర్మలతో కూడిన భారత జట్టు తొలిసారి పసిడి పతకం గెలిచింది.

సురేఖ బృందానికి సీఎం జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: తమ అద్భుతమైన ప్రదర్శనతో మహిళల ఆర్చరీ కాంపౌండ్ టీమ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన వెన్నం జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్, అదితిలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభినందించారు. విజయవాడకు చెందిన జ్యోతి సురేఖ సాధించిన విజయం పట్ల తనతో పాటు, ఆంధ్రప్రదేశ్ ఎంతో గర్వపడుతోందన్నారు. తెలుగు జెండా రెపరెపలాడుతోందంటూ సీఎం వైఎస్ జగన్ గురువారం ట్వీట్ చేశారు.

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	179	99	55	333
జపాన్	44	54	60	158
దక్షిణ కొరియా	33	47	77	157
భారత్	21	32	33	86
ఉజ్బెకిస్తాన్	19	16	25	60
చైనీస్ తైపీ	15	15	23	53
ఉత్తర కొరియా	10	16	9	35
థాయ్‌లాండ్	10	14	27	51
బహ్రెయిన్	10	2	5	17
ఇరాన్	8	17	17	42


నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

సూపర్ సౌరవ్...

వరుసగా ఐదో ఆసియా క్రీడల్లో పతకం



దీపిక పల్లికల్   హరీందర్



సౌరవ్ ఘోషాల్

భారత స్క్వాష్ స్టార్ సౌరవ్ ఘోషాల్ వరుసగా ఐదో ఆసియా క్రీడల్లోనూ పతకంతో మెరిశాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో 37 ఏళ్ల సౌరవ్ 11–9, 9–11, 5–11, 7–11తో ఇయన్ యో ఎన్జీ (హాంకాంగ్) చేతిలో ఓడిపోయి రజత పతకం దక్కించుకున్నాడు. 2006 దోహా ఆసియా క్రీడల్లో అరంగేట్రం చేసి కాంస్యం నెగ్గిన సౌరవ్.. ఆ తర్వాత 2010లో కాంస్యం, 2014లో రజతం, 2018లో కాంస్యం సాధించాడు. తొలిసారి ప్రవేశపెట్టిన మిక్స్‌డ్ డబుల్స్‌లో దీపిక పల్లికల్–హరీందర్‌పాల్ జోడీ (భారత్) స్వర్ణ పతకం గెలిచింది. ఫైనల్లో దీపిక–హరీందర్‌పాల్ ద్వయం 11–10, 11–10తో ఐఫా బింతి అజ్మన్–కమాల్ (మలేసియా) జంటపై నెగ్గింది.

రెజ్లర్ అంతిమ్‌కు కాంస్యం



మహిళల రెజ్లింగ్‌లో భారత రైజింగ్ స్టార్ అంతిమ్ పంఘాల్ కాంస్య పతకం గెలిచింది. 53 కేజీల విభాగం కాంస్య పతక బౌట్‌లో 19 ఏళ్ల అంతిమ్ 3–1తో టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత బొలోర్‌తుయా బత్‌ఒచిర్ (మంగోలియా)పై సంచలన విజయం సాధించింది. భారత్‌కే చెందిన పూజా గెహ్లోత్ (50 కేజీలు) కాంస్య పతక బౌట్‌లో 2–9తో కెయునిమ్‌జేవా (ఉజ్బెకిస్తాన్) చేతిలో... మాన్సి అహ్లావత్ కాంస్య పతక బౌట్‌లో 70 సెకన్లలో సాబిరోవా (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయారు. మరోవైపు భారత మహిళల హాకీ జట్టు సెమీఫైనల్లో 0–4 గోల్స్ తేడాతో చైనా జట్టు చేతిలో ఓడిపోయింది. శనివారం జరిగే కాంస్య పతక మ్యాచ్‌లో జపాన్‌తో భారత్ ఆడుతుంది. పురుషుల మారథాన్ రేసులో (42.195 కిలోమీటర్లు) భారత అథ్లెట్లు మాన్ సింగ్ ఎనిమిదో స్థానంలో (2గం:16ని:59 సెకన్లు), అప్పచంగడ బెలియప్ప (2గం:20ని:52 సెకన్లు) 12వ స్థానంలో నిలిచారు.

41 ఏళ్ల నిరీక్షణకు తెర



సాత్విక్, చిరాగ్



విజయానంతరం ప్రణయ్ భావోద్వేగం

- ఆసియా క్రీడల బ్యాడ్మింటన్‌లో భారత్‌కు రెండు పతకాలు ఖాయం
- 1982 తర్వాత పురుషుల సింగిల్స్, డబుల్స్‌లో సెమీస్ చేరిన భారత క్రీడాకారులు
- ప్రణయ్, సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ ఘనత

ఈ సీజన్‌లో తమ అద్భుతమైన ప్రదర్శనను కొనసాగిస్తూ... 41 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.... భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్... సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ ఆసియా క్రీడల్లో పతకాలను ఖాయం చేసుకున్నారు. న్యూఢిల్లీ వేదికగా 1982లో జరిగిన ఆసియా క్రీడల్లో చివరిసారి బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో భారత్‌కు పతకాలు లభించాయి. 1982 ఆసియా క్రీడల పురుషుల సింగిల్స్‌లో దివంగత సయ్యద్ మోడీ... పురుషుల డబుల్స్‌లో లెరాయ్ ఫ్రాన్సిస్–ప్రదీప్ గాంధె సెమీఫైనల్లో ఓడిపోయి కాంస్య పతకాలు గెలిచారు. ఆ తర్వాత తొమ్మిదిసార్లు ఆసియా క్రీడలు జరిగినా పురుషుల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో భారత క్రీడాకారులెవరూ సెమీఫైనల్ దశకు చేరుకోలేకపోయారు. చైనా గడ్డపై ఎట్టకేలకు ఈ నిరీక్షణకు ప్రణయ్, సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ముగింపు పలికారు. సింగిల్స్‌లో ప్రణయ్... డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 21–16, 21–23, 22–20తో లీ జి జియా (మలేసియా)పై గెలుపొందాడు. 78 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో కేరళకు చెందిన 31 ఏళ్ల ప్రణయ్ రెండో గేమ్‌లోనే గెలవాల్సింది. తొలి గేమ్‌ను సొంతం చేసుకొని, రెండో గేమ్‌లో 20–18తో ఆధిక్యంలో నిలిచిన ప్రణయ్ రెండు మ్యాచ్ పాయింట్లను వదులుకున్నాడు. స్కోరును సమం చేసిన లీ జి జియా అదే జోరులో రెండో గేమ్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక మూడో గేమ్ కూడా నువ్వా నేనా అన్నట్లు సాగింది. చివరకు ప్రణయ్ 18–20తో ఓటమి అంచుల్లో నిలిచాడు. అయితే సంయమనం కోల్పోకుండా ఆడిన ప్రపంచ ఏడో ర్యాంకర్ ప్రణయ్ వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా)తో ప్రణయ్ ఆడతాడు. ముఖాముఖి రికార్డులో ప్రణయ్ 3–0తో లీ షి ఫెంగ్‌పై ఆధిక్యంలో ఉన్నాడు.

డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ద్వయం 21–7, 21–9తో ఎన్జీ జూ జియి–జాన్ ప్రజోగో (సింగపూర్) జంటపై గెలిచి సెమీఫైనల్ చేరింది. నేడు జరిగే సెమీఫైనల్లో ఆరోన్ చియా–సూ వుయ్ యిక్ (మలేసియా) జంటతో సాత్విక్–చిరాగ్ ద్వయం తలపడుతుంది.

సింధుకు నిరాశ



సింధు

మరోవైపు మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ పీవీ సింధు పోరాటం ముగిసింది. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో ఫైనల్లో ఓడి రజత పతకం సాధించిన సింధు ఈసారి మాత్రం క్వార్టర్ ఫైనల్ దాటలేకపోయింది. క్వార్టర్ ఫైనల్లో సింధు 16–21, 12–21తో ప్రపంచ ఐదో ర్యాంకర్ హి బింగ్జియావో (చైనా) చేతిలో ఓడిపోయింది.

సాక్షి బిజినెస్
శుక్రవారం
6-10-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్‌ ▲	405	65,632
నిఫ్టీ ▲	110	19,546

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్‌	13,160	▽	76
డోజోన్స్‌	33,044	▽	125
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,452	▲	39
డాక్స్‌	15,070	▽	30
షాంఘై (గత గురువారం ముగింపు)	3,110	▲	3
నికాయ్‌	31,075	▲	548

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,555	▽	98
బంగారం (99.5 స్వచ్ఛత)	56,329	▽	97
వెండి (కేజీ)	67,204	▽	242

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఒకటి	82.47	84.14
£	బ్రిటన్‌ పౌండ్‌	ఒకటి	98.87	102.21
€	యూరో	ఒకటి	85.63	88.70
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఒకటి	54.95	56.65
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఒకటి	51.46	53.74
S$	సింగపూర్‌ డాలర్‌	ఒకటి	59.65	61.57
SAR	సౌదీ రియాల్‌	కామన్‌ఫిక్‌	21.29	22.82
UAE D	యూఏఈ దిర్హామ్‌	కామన్‌ఫిక్‌	21.69	23.50
¥	చైనా యువాన్‌	కామన్‌ఫిక్‌	10.25	12.29

ఎస్‌బీఐ చీఫ్‌ దినేష్‌ ఖారా పదవీకాలం పొడిగింపు!



న్యూఢిల్లీ: భారత్‌ బ్యాంకింగ్‌ దిగ్గజం స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఎస్‌బీఐ) చైర్మన్‌ దినేష్‌ ఖారా పదవీకాలాన్ని వచ్చే ఏడాది ఆగస్టు వరకు పొడిగించేందుకు ప్రభుత్వం గురువారం ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 2023 అక్టోబర్‌ 6తో (శుక్రవారం) ఆయన మూడేళ్ల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఈ ఆమోదం లభించింది. నియామకపు వ్యవహారాల కేబినెట్‌ కమిటీ (ఏసీసీ) ఆదేశాల ప్రకారం ఎస్‌బీఐ చైర్మన్‌ తన 63 సంవత్సరాల వయస్సు వరకూ పదవిలో ఉండవచ్చని అత్యున్నత వర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాది ఆగస్టులో ఖారాకు 63 ఏళ్లు నిండుతాయి. కాగా, 2024 జనవరి 27 తర్వాత రెండు సంవత్సరాల పాటు మేనేజింగ్‌ డైరెక్టర్‌గా అశ్విని కుమార్‌ తివారీ పదవీకాలాన్ని పొడిగించడానికి కూడా ఏసీసీ ఆమోదముద్ర వేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

భారత్‌లో నోకియా 6జీ ల్యాబ్‌

ప్రారంభించిన కేంద్ర మంత్రి వైష్ణవ్‌



న్యూఢిల్లీ: టెలికం పరికరాల తయారీ సంస్థ నోకియా భారత్‌లో తమ 6జీ ల్యాబ్‌ను నెలకొల్పింది. కేంద్ర టెలికం మంత్రి అశ్విని వైష్ణవ్‌ దీన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. భారత్‌ను నూతన ఆవిష్కరణల హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షల సాధన దిశగా ఇది మరో ముందడుగని ఆయన తెలిపారు. సురక్షితమైన రవాణా, ఆరోగ్య సంరక్షణ, విద్య తదితర విభాగాలకు ఉపయోగపడగలిగే 6జీ టెక్నాలజీ ఆధారిత నవకల్పనలపై ఈ ల్యాబ్‌ పనిచేయనున్నట్లు మంత్రి వివరించారు. బెంగళూరులోని తమ గ్లోబల్‌ రీసెర్చ్‌, డెవలప్‌మెంట్‌ సెంటర్‌లో నోకియా దీన్ని ఏర్పాటు చేసింది. భారత్‌ ఇప్పటికే 6జీ టెక్నాలజీలో 200 పైచిలుకు పేటెంట్లు దక్కించుకుంది.

సైబర్‌ బీమాకు డిమాండ్‌

- భారత్‌లో 60 మిలియన్‌ డాలర్ల మార్కెట్‌
- భవిష్యత్తులో ఏటా 27 శాతం వృద్ధి
- డెలాయిట్‌ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా సైబర్‌ బీమాకు గణనీయంగా డిమాండ్‌ పెరుగుతోంది. రాబోయే రోజుల్లో సైబర్‌ ఇన్సూరెన్స్‌ మార్కెట్‌ ఏటా 27–30% వృద్ధి చెందనుంది. కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్‌ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం ప్రస్తుతం భారత్‌లో సైబర్‌ బీమా మార్కెట్‌ పరిమాణం 50–60 మిలియన్‌ డాలర్ల (దాదాపు రూ.500 కోట్లు) స్థాయిలో ఉంది. గత మూడేళ్లుగా 27–30% మేర చక్రగతిన వృద్ధి చెందుతోంది. 'సైబర్‌ ఇన్సూరెన్స్‌ అవసరంపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో వచ్చే 3–5 ఏళ్లలో ఇదే స్థాయి వృద్ధి కొనసాగే అవకాశం ఉంది' అని నివేదికలో పేర్కొంది. ఐటీ, ఫార్మా, తయారీ రంగాలతో పాటు సరఫరా వ్యవస్థ, రిటైల్‌, ఫైనాన్స్‌ వంటి డిజిటైజేషన్‌ అధికంగా ఉండే విభాగాలు సైబర్‌ క్రిమినల్స్‌కు లక్ష్యాలుగా ఉంటున్నట్లు తెలిపింది. కాబట్టి, మిగతా రంగాలతో పోలిస్తే సైబర్‌ బీమాను తీసుకోవడంలో ఈ విభాగాలు ముందుంటాయని పేర్కొంది. పలువురు చీఫ్‌ ఇన్ఫర్మేషన్‌ సెక్యూరిటీ ఆఫీసర్ల (సీఐఎస్‌వో)తో నిర్వహించిన సర్వే ఆధారంగా డెలాయిట్‌ ఈ నివేదికను రూపొందించింది. ప్రస్తుతం మార్కెట్లో ఒడిదుడుకులు, అనిశ్చితి నెలకొన్నప్పటికీ వచ్చే దశాబ్ద కాలంలో సైబర్‌ బీమా గణనీయంగా వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని డెలాయిట్‌ ఇండియా పార్ట్‌నర్‌ (రిస్క్‌ అడ్వైజరీ) ఆనంద్‌ వెంకట్రామన్‌ తెలిపారు. విక్రేతలు, కొనుగోలుదారుల అవసరాల మేరకు పాలసీలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

నివేదికలోని మరిన్ని అంశాలు..

- రాబోయే మూడేళ్లలో డిజిటల్‌ మౌలిక సదుపాయాలకు రక్షణ కల్పించుకునేందుకు సర్వేలో పాల్గొన్న సీఐఎస్‌వోల్లో 70% మంది మరింత ఎక్కువ వ్యయం చేయడానికి మొగ్గు చూపారు.
- గణనీయంగా వినియోగదారుల డేటాబేస్‌లు ఉన్న కొన్ని పెద్ద కంపెనీలు తమ డిజిటల్‌ ఇన్‌ఫ్రా బడ్జెట్లను పెంచుకునే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. డిజిటల్‌ మౌలిక సదుపాయాల భద్రతను మెరుగుపర్చుకునేందుకు మరింత ఇన్వెస్ట్‌ చేయడానికి బదులు బీమా కవరేజీని పెంచుకోవడంపై ఆసక్తిగా ఉన్నట్లు 60 శాతం సంస్థలు పేర్కొన్నాయి.
- దేశీయంగా సైబర్‌ ఇన్సూరెన్స్‌ మార్కెట్‌ వృద్ధి గతి ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉండనుంది. కంపెనీలు డిజిటల్‌ పరిపక్వతను సాధించే వేగం, డిజిటైజేషన్‌ .. కఠినతరమైన సైబర్‌ చట్టాల అమలుకు ప్రభుత్వం తీసుకునే చర్యలు, సంప్రదాయేతర సంస్థలైన టెక్నాలజీ కంపెనీల్లాంటివి కూడా సైబర్‌ ఇన్సూరెన్స్‌ మార్కెట్లోకి ప్రవేశించడం వీటిలో ఉండనున్నాయి.
- సైబర్‌ బీమాను ఒక వ్యయంగా కాకుండా పెట్టుబడిగా చూసే ధోరణి పెరగాలి. డిజిటైజేషన్‌ వేగవంతమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తగు స్థాయిలో సైబర్‌ ఇన్సూరెన్స్‌ కవరేజీని తీసుకోవడం తప్పనిసరి అనేది కంపెనీలు గుర్తించాలి.
- సమగ్ర రిస్కుల నిర్వహణలో సైబర్‌ రిస్కులు ప్రధానమైనవని గుర్తించి బోర్డులు, సీఈవోలు సైబర్‌సెక్యూరిటీ విషయంలో తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది.
- బీమా పాలసీలను సరళతరం చేయడంతో పాటు వివిధ కవరేజీల గురించి కొనుగోలుదార్లలో అవగాహన పెంచేందుకు బీమా కంపెనీలు కృషి చేయాలి.
- పౌరుల గోప్యతకు భంగం వాటిల్లకుండా పటిష్టమైన డేటా రక్షణ వ్యవస్థను నిర్వహించడంలో ప్రభుత్వం కీలకపాత్ర పోషించాలి.

కొత్త విక్రేతలకు అమెజాన్‌ ప్రోత్సాహకాలు



హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో: పండుగ సీజన్‌ నేపథ్యంలో కొత్తగా తమ ప్లాట్‌ఫాంలో చేరే విక్రేతలకు ఈ–కామర్స్‌ దిగ్గజం అమెజాన్‌ ఇండియా ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తోంది. వారికి రిఫరల్‌ ఫీజులో 50 శాతం రాయితీనిస్తున్నట్లు గురువారమిక్కడ విలేకరుల సమావేశంలో కంపెనీ డైరెక్టర్‌ అమిత్‌ నందా తెలిపారు. ఆగస్టు 27న ప్రారంభమైన ఈ ఆఫర్‌ నవంబర్‌ 4 వరకు ఉంటుందని తెలిపారు. విక్రేతలు చేరినప్పటి నుంచి 60 రోజుల పాటు ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు. అలాగే ''గ్రేట్‌ ఇండియన్‌ రిఫరల్‌ ఆఫర్‌'' ప్రోగ్రాం కింద అమెజాన్‌ ప్లాట్‌ఫాంపై విక్రయించేందుకు తమ స్నేహితులను రిఫర్‌ చేసే విక్రేతలకు రూ. 11,500 విలువ చేసే ప్రయోజనాలు కల్పించనున్నట్లు నందా చెప్పారు. అక్టోబర్‌ 27 వరకు ఈ ఆఫర్‌ ఉంటుంది. ప్రస్తుతం అమెజాన్‌లో దేశవ్యాప్తంగా 14 లక్షల మంది సెల్లర్లు ఉండగా, తెలంగాణలో ఈ సంఖ్య 50,000గా ఉన్నట్లు నందా చెప్పారు. గతేడాది ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా 650 మంది పైచిలుకు విక్రేతలు అమెజాన్‌లో రూ. కోటికి పైగా విలువ చేసే అమ్మకాలు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అన్‌క్లెయిమ్డ్‌ డిపాజిట్లు తెలుసుకోవడం సులభం

ఉద్గమ్‌ పోర్టల్‌పైకి 30 బ్యాంక్‌లు



ముంబై: బ్యాంకుల్లో డిపాజిట్లు చేసి, గడువు ముగిసినప్పటికీ, వెనక్కి తీసుకోని వాటి (అన్‌ క్లెయిమ్డ్‌ డిపాజిట్లు) వివరాలను తెలుసుకునే ఉద్గమ్‌(యూడీజీఏఎం) పోర్టల్‌పైకి 30 బ్యాంక్‌లు చేరాయి. ఈ వివరాలను ఆర్‌బీఐ గురువారం ప్రకటించింది. ఈ పోర్టల్‌ సాయంతో తమ, తమవారి అన్‌క్లెయిమ్డ్‌ డిపాజిట్ల వివరాలను ఏ బ్యాంకుల్లో ఉన్నదీ తెలుసుకోవచ్చు. ఆగస్ట్‌ 17 నుంచి ఈ పోర్టల్‌ను ఆర్‌బీఐ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆరంభంలో ఏడు బ్యాంక్‌లకు సంబంధించిన వివరాలే ఈ పోర్టల్‌పై అందుబాటులో ఉన్నాయి. సెప్టెంబర్‌ 28 నాటికి 30 బ్యాంక్‌లకు సంబంధించిన డిపాజిట్ల వివరాలు తెలుసుకునే విధంగా అప్‌గ్రేడ్‌ చేసినట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. అన్‌క్లెయిమ్డ్‌ డిపాజిట్లలో 90 శాతం ఈ 30 బ్యాంక్‌ల కస్టమర్లకు చెందినవి కాగా, ప్రస్తుతం ఆ డిపాజిట్లు డిపాజిటర్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ అవేర్‌నెస్‌ ఫండ్‌ (డీఈఏ) రూపంలో ఉండడం గమనార్హం. అన్ని ప్రముఖ బ్యాంక్‌లు ఈ పోర్టల్‌తో అనుసంధానమయ్యాయి. 2023 ఫిబ్రవరి నాటికి ఎలాంటి క్లెయిమ్‌ రాని రూ.35,000 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా ఎస్‌బీఐ కస్టమర్లకు చెందినవే రూ.8,086 కోట్లు ఉన్నాయి. ఆ తర్వాత పీఎన్‌బీ నుంచి రూ.5,340 కోట్లు, కెనరా బ్యాంక్‌ నుంచి రూ.4,558 కోట్లు, బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా నుంచి రూ.3,904 కోట్ల చొప్పున ఉన్నాయి. నిబంధనల కింద గడువు తీరి పదేళ్లు అయినా క్లెయిమ్‌ రాని డిపాజిట్లను, బ్యాంక్‌లు డీఈఏకి బదిలీ చేయాల్సి ఉంటుంది.

రెండు రోజుల తర్వాత లాభాలు

- ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ ప్రభావం
- సెన్సెక్స్‌ లాభం 405 పాయింట్లు
- 110 పాయింట్లు పెరిగిన నిఫ్టీ



ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీతో దేశీయ స్టాక్‌ మార్కెట్‌ రెండు రోజుల వరుస నష్టాలకు ముగింపు పడింది. క్రూడాయిల్‌ ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. అమెరికా ట్రెజరీ బాండ్ల రాబడులు గణనీయంగా తగ్గాయి. భారత సేవారంగ వృద్ధి సెప్టెంబర్‌లో రికార్డు స్థాయిలో తొమ్మిదేళ్ల గరిష్టానికి చేరింది. ఈ పరిణామాలు సూచీలను లాభాలవైపు నడిపాయని ట్రేడర్లు తెలిపారు. బ్యాంకింగ్‌, ఫైనాన్స్‌, ఐటీ షేర్లు రాణించడంతో సెన్సెక్స్‌ 405 పాయింట్లు బలపడి 65,632 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 110 పాయింట్లు ర్యాలీ చేసి 19,546 వద్ద నిలిచింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు కొంత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే సానుకూల జాతీయ, అంతర్జాతీయ సంకేతాలతో సూచీలు పుంజుకోగలిగాయి. ఈ క్రమంలో సెన్సెక్స్‌ 527 పాయింట్లు పెరిగి 65,753 వద్ద, నిఫ్టీ 141 పాయింట్లు బలపడి 19,577 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. క్యాపిటల్‌ గూడ్స్‌, సర్వీసెస్‌, పారిశ్రామిక, కన్జూమర్‌, టెక్‌, ఆటో రంగాల్లోని చిన్న తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. మరోవైపు మెటల్‌, ఫార్మా, ప్రభుత్వరంగ బ్యాంకుల రంగాలకు చెందిన మధ్య తరహా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా ట్రెజరీ బాండ్లపై రాబడులు తాజాగా 16 ఏళ్ల గరిష్టం నుంచి దిగిరావడంతో పాటు, క్రూడాయిల్‌ ధరల అనూహ్య పతనంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో సంగతులు

- భారీగా ఆర్డర్లు దక్కించుకోవడంతో ఎల్‌అండ్‌టీ షేరు 2% లాభపడి రూ. 3,097 వద్ద స్థిరపడింది.
- గేమింగ్‌ మార్కెటింగ్‌ ఏజెన్సీ 'పబ్లిష్‌మీ'ని 2 మిలియన్‌ డాలర్లకు చేజిక్కించుకోవడంతో నజరా టెక్నాలజీస్‌ 6% ఎగసి రూ.870 వద్ద ముగిసింది.
- రెండో క్వార్టర్‌లో రికార్డు స్థాయి విక్రయాలు జరిగినట్లు కంపెనీ తెలపడంతో రియల్టీ సంస్థ శోభ ఏడుశాతం ఎగసి రూ.709 వద్ద స్థిరపడింది.
- ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం మారికో షేరు 5% పతనమైన రూ.543 వద్ద నిలిచింది. గ్రామీణ స్థాయిలో రికవరీ బలహీనంగా ఉండటంతో రెండో త్రైమాసిక ఆదాయం తగ్గినట్లు కంపెనీ తెలపడం షేరు పతనానికి కారణమైంది.

సినిమా



• 'గేమ్‌ చేంజర్‌'లో రామ్‌చరణ్‌
• 'పుష్ప–2'లో అల్లు అర్జున్‌
• 'సలార్‌'లో ప్రభాస్‌
• 'దేవర'లో ఎన్టీఆర్‌

సంక్రాంతికి సైంధవ్‌



• వెంకటేశ్‌

సంక్రాంతికి సై అన్నారు సైంధవ్‌. వెంకటేశ్‌ హీరోగా శైలేష్‌ కొలను దర్శకత్వంలో వెంకట్‌ బోయనపల్లి నిర్మించిన చిత్రం 'సైంధవ్‌'. హిందీ నటుడు నవాజుద్దీన్‌ సిద్ధిఖీ, తమిళ నటుడు ఆర్య, హీరోయిన్లు శ్రద్ధా శ్రీనాథ్‌, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, బాల నటి సారా కీలక పాత్రల్లో నటించారు. కాగా 'సైంధవ్‌'ను సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్‌ అధికారికంగా వెల్లడించి, కొత్త పోస్టర్స్‌ను రిలీజ్‌ చేసింది. ''సైంధవ్‌ షూటింగ్‌ పార్ట్‌ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్‌ ప్రొడక్షన్‌ పనులు జరుగుతున్నాయి. అన్ని దక్షిణాది భాషలతో పాటు హిందీలోనూ ఈ సినిమాను విడుదల చేస్తున్నాం'' అని యూనిట్‌ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్‌ నారాయణన్‌, కెమెరా: ఎస్‌. మణికందన్‌, సహ–నిర్మాత: కిషోర్‌ తాళ్లూరు.

కట్‌ చేస్తే కథ వెనక్కి!

ప్రతి చిత్రానికి ఓ కథ ఉంటుంది. ఆ కథలో ఇంకో కథ కూడా ఉండొచ్చు. అదే ఫ్లాష్‌బ్యాక్‌. కొన్ని చిత్రాలకు ఈ ఫ్లాష్‌బ్యాక్‌ ప్రధానాంశంగా ఉంటుంది. అలా 'కట్‌ చేస్తే.. కథ వెనక్కి' అంటూ ఫ్లాష్‌బ్యాక్‌ ఓ ప్రధానాంశంగా ప్రస్తుతం కొన్ని చిత్రాలు రూపొందుతున్నాయి. ఆ విశేషాలు తెలుసుకుందాం.

మలి భాగంలో ఫ్లాష్‌బ్యాక్‌

ప్రభాస్‌ కెరీర్‌లో రూపొందుతున్న మరో యాక్షన్‌ ఫిల్మ్‌ 'సలార్‌'. రెండు భాగాలుగా రిలీజ్‌ కానున్న ఈ సినిమా తొలి భాగం 'సలార్‌: సీజ్‌ ఫైర్‌' ఈ ఏడాది డిసెంబరు 22 విడుదల కానుంది. ఈ చిత్రంలో మెకానిక్‌గా, అతని తండ్రిగా ప్రభాస్‌ రెండు పాత్రల్లో కనిపిస్తారట. తొలి భాగం మొత్తం కొడుకు పాత్రతో సాగుతుందని, తండ్రి పాత్ర పరిచయంతో సినిమా ముగిసి, మలి భాగంలో ఫ్లాష్‌బ్యాక్‌గా 'సలార్‌' కథ కొనసాగుతుందని టాక్‌. ప్రశాంత్‌ నీల్‌ దర్శకత్వంలో విజయ కిరగందూర్‌ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రుతీ హాసన్‌ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

పగ.. ప్రతీకారం

దేశంలో విస్మరణకు గురైన తీర ప్రాంతాలు, అక్కడ నివశించే ప్రజల నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'దేవర'. ఎన్టీఆర్‌ హీరోగా, జాన్వీ కపూర్‌ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సైఫ్‌ అలీఖాన్‌ విలన్‌. ఇందులో తండ్రీ కొడుకులుగా ఎన్టీఆర్‌ ద్విపాత్రాభినయం చేస్తున్నారని, ఇంట్రవెల్‌ తర్వాత తండ్రి పాత్రలో ఎన్టీఆర్‌ గెటప్‌, ఆ సన్నివేశాలు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఈ చిత్రదర్శకుడు కొరటాల శివ తీస్తున్నారని టాక్‌. అలాగే తండ్రిగా ఎన్టీఆర్‌ నటించే ఫ్లాష్‌బ్యాక్‌ సీన్స్‌, యాక్షన్‌ సీక్వెన్స్‌ ఓ హైలైట్‌గా ఉంటాయట. రెండు భాగాలుగా ఈ చిత్రం విడుదల కానుంది. కల్యాణ్‌ రామ్‌, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్‌ నిర్మిస్తున్న 'దేవర' తొలి భాగం ఏప్రిల్‌ 5న రిలీజ్‌ కానుంది.

ఇటు ఆఫీసర్‌.. అటు ఆటగాడు

ఐఏఎస్‌ ఆఫీసర్‌ విధులు, రాజకీయ రంగంలో వారి ప్రాధాన్యత వంటి అంశాల నేపథ్యంలో రామ్‌చరణ్‌ హీరోగా నటిస్తున్న చిత్రం 'గేమ్‌ చేంజర్‌'. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని దర్శకుడు శంకర్‌ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో తండ్రీ కొడుకులుగా రామ్‌చరణ్‌ కనిపిస్తారని తెలుస్తోంది. కథ ప్రకారం సినిమాలో 1920 నేపథ్యంలో సాగే కొన్ని సన్నివేశాలు ఉన్నాయట. ఈ సీన్స్‌లో ఓ రాజకీయ పార్టీ క్రియాశీల నేతగా రామ్‌చరణ్‌ కనిపిస్తారని, ఈ పాత్రకు జోడీగా అంజలి కనిపిస్తారని, ఇదంతా 'గేమ్‌ చేంజర్‌'లోని ఫ్లాష్‌బ్యాక్‌ ఎపిసోడ్‌గా ఉంటుందని ఫిల్మ్‌నగర్‌ భోగట్టా. ఇక ఓ ఐఏఎస్‌ ఆఫీసర్‌గా రాజ్యాంగం ప్రకారం తన విధులు నిర్వర్తిస్తూనే, తండ్రికి అన్యాయం చేసిన కొందరు రాజకీయ నాయకులను దెబ్బతీసేలా రామ్‌చరణ్‌ వేసే గేమ్‌ చేంజింగ్‌ ప్లాన్‌ సినిమాలో హైలైట్‌ అట. 'దిల్‌' రాజు, శిరీష్‌ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఆగస్టులో విడుదల కానుందనే ప్రచారం సాగుతోంది. అలాగే రామ్‌చరణ్‌ హీరోగా బుచ్చిబాబు సన దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇదొక స్పోర్ట్స్‌ ఫిల్మ్‌ అని, ఇందులో అన్నదమ్ములుగా రామ్‌చరణ్‌ నటిస్తారని, ఓ ఆట కోసం దివ్యాంగుడైన అన్న కలను నెరవేర్చే తమ్ముడిగా.. ఇలా రెండు పాత్రల్లో కనిపిస్తారనే టాక్‌ వినిపిస్తోంది. ఫిబ్రవరిలో ఈ సినిమా షూటింగ్‌ ఆరంభం కానుందని సమాచారం.

పుష్ప జీవితంలో ఏం జరిగింది?

ఎర్ర చందనం స్మగ్లింగ్‌ నేపథ్యంలో రూపొందిన కల్పిత కథ 'పుష్ప'. అల్లు అర్జున్‌ హీరోగా సుకుమార్‌ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ఇది. ఈ సినిమాలో పుష్పరాజ్‌గా అల్లు అర్జున్‌ నటిస్తున్నారు. 'పుష్ప' చిత్రంలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్‌' ఇప్పటికే విడుదలై సూపర్‌హిట్‌గా నిలిచింది. ఇందులో ఎర్ర చందనం స్మగ్లింగ్‌ సిండికేట్‌ హెడ్‌గా పుష్పరాజ్‌ కనిపిస్తారు. 'పుష్ప: ది రైజ్‌'కు కొనసాగింపుగా 'పుష్ప: ది రూల్‌' రానున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా టీజర్‌ విడుదలైంది. 'పుష్ప ఏం చేసి దుడ్డు సంపాదిస్తున్నాడో సెప్తాండారు గానీ.. సంపాదించిన దుడ్డు ఏం సేస్తన్నాడో సెప్తన్నారా?', 'నా కొడుక్కి గుండె ఆపరేషన్‌ అంటే పుష్పనే దుడ్డు పంపించినాడక్క.. అందుకే అక్క వీడు బతికున్నాడు', 'నా పిల్ల పెళ్లికి పుష్పానే సాయం సేసినాడు..' అనే డైలాగ్స్‌ 'పుష్ప: ది రూల్‌' సినిమాలో ఉన్నాయి. అంటే.. స్మగ్లర్‌లా సంపాదించిన డబ్బుని పుష్ప ఎందుకు దానం చేస్తున్నాడు? పుష్ప ఇలా చేయడానికి అతని జీవితంలో ఎలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి? అనే సన్నివేశాలు 'పుష్ప: ది రూల్‌'లో ఫ్లాష్‌బ్యాక్‌ ఎపిసోడ్స్‌గా వస్తాయని సమాచారం. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నవీన్‌ ఎర్నేని, వై. రవిశంకర్‌ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది.

ఇలా ఫ్లాష్‌బ్యాక్‌ ప్రధానాంశంగా సాగే చిత్రాలు మరికొన్ని ఉన్నాయి.

మేడమ్‌ తుస్సాడ్స్‌లో...



• అల్లు అర్జున్‌

దుబాయ్‌లోని మేడమ్‌ తుస్సాడ్స్‌లో అల్లు అర్జున్‌ మైనపు బొమ్మ ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి మేడమ్‌ తుస్సాడ్స్‌ ప్రతినిధులు అల్లు అర్జున్‌ కొలతలను తీసుకున్నారు. దాదాపు 200 కొలతలు తీసుకున్నారట. ''ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకున్న తొలి తెలుగు నటుడు అల్లు అర్జున్‌ బొమ్మను ఏర్పాటు చేయబోతున్నాం. ఈ మైనపు బొమ్మ ఆవిష్కరణ వచ్చే ఏడాది ఉంటుంది'' అంటూ అల్లు అర్జున్‌ కొలతలు తీసుకుంటున్న వీడియోను షేర్‌ చేశారు నిర్వాహకులు. కాగా, దుబాయ్‌లోని మేడమ్‌ తుస్సాడ్స్‌లో తెలుగు నుంచి ప్రదర్శితం కానున్న తొలి మైనపు బొమ్మ అల్లు అర్జున్‌దే కావడం విశేషం.

ఏప్రిల్‌లో సెట్స్‌కి...



• ప్రశాంత్‌ నీల్‌, ఎన్టీఆర్‌

వరుస సినిమాలతో మరింత బిజీ కానున్నారు ఎన్టీఆర్‌. ప్రస్తుతం 'దేవర' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. రెండు భాగాలుగా రిలీజ్‌ కానున్న ఈ సినిమా తొలి పార్ట్‌ షూటింగ్‌ డిసెంబరు కల్లా పూర్తవుతుందని, అప్పట్నుంచి అయాన్‌ ముఖర్జీ దర్శకత్వంలోని 'వార్‌ 2' సినిమా సెట్స్‌లో ఎన్టీఆర్‌ జాయిన్‌ అవుతారని తెలుస్తోంది. ఈ చిత్రంలో హృతిక్‌ రోషన్‌ మరో హీరో. అలాగే ప్రశాంత్‌ నీల్‌ దర్శకత్వంలో ఎన్టీఆర్‌ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్‌, ఎన్టీఆర్‌ ఆర్ట్స్‌ కలిసి ఓ సినిమాను నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్‌ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభం కానుందని యూనిట్‌ వెల్లడించింది.

భలేగా బ్యాలెన్స్‌!



• వరలక్ష్మి

సినిమాలను, వెబ్‌ సిరీస్‌లను భలేగా బ్యాలెన్స్‌ చేస్తున్నారు వరలక్ష్మీ శరత్‌కుమార్‌. కథను బట్టి మెయిన్‌ లీడ్‌గా, క్యారెక్టర్‌ ఆర్టిస్ట్‌గా చేస్తుంటారు. ఇప్పటికే తెలుగు ఆంథాలజీ సిరీస్‌ 'అద్దం'తో డిజిటల్‌ వ్యూయర్స్‌కు దగ్గరైన వరలక్ష్మి తాజాగా మరో తెలుగు వెబ్‌ సిరీస్‌ 'మాన్షన్‌ 24'లో మెయిన్‌ లీడ్‌ రోల్‌ చేశారు. హారర్‌ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ సిరీస్‌లో అవికా గోర్‌, బిందు మాధవి, నందు, మానస్‌, అయ్యప్ప పి. శర్మ, రావు రమేష్‌ ఇతర పాత్రధారులు. 'రాజుగారి గది' ఫ్రాంచైజీ ఫేమ్‌ ఓంకార్‌ ఈ వెబ్‌ సిరీస్‌కు దర్శకత్వం వహించారు. ''ఒకవైపు సినిమాల్లో నెగటివ్‌, పాజిటివ్‌ షేడ్స్‌ ఉన్న పాత్రలు చేస్తున్నాను. వెబ్‌ సిరీస్‌లలో కూడా మంచి పాత్రలు చేస్తున్నాను'' అన్నారు వరలక్ష్మి.

మాకు మంచి సింక్‌ కుదిరింది

– రత్నం కృష్ణ



కిరణ్‌ అబ్బవరం, నేహా శెట్టి జంటగా రత్నం కృష్ణ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'రూల్స్‌ రంజన్‌'. మురళీ కృష్ణ వేమూరి, దివ్యాంగ్‌ లవానియా నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రదర్శకుడు రత్నం కృష్ణ మాట్లాడుతూ– ''రూల్స్‌ రంజన్‌' కథను నవీన్‌ పొలిశెట్టికి చెప్పాలనుకున్నాను. కుదరక పోవడంతో కిరణ్‌ అబ్బవరంకు వినిపించాను. కిరణ్‌కు కథ నచ్చడంతో ఈ సినిమాను ఆరంభించాం. కథా చర్చల్లో భాగంగా కిరణ్‌ మంచి క్రియేటర్‌ అని అర్థం అయ్యింది. మా ఇద్దరికీ మంచి సింక్‌ కుదిరింది. ఈ చిత్రం ఫస్టాఫ్‌ క్లాస్‌గా, సెకండాఫ్‌ మాస్‌గా ఉంటుంది. యూత్‌ఫుల్‌గా మొదలై, సెకండాఫ్‌లో ఫ్యామిలీ టర్న్‌ తీసుకుంటుంది. ఈ సినిమా రషెస్‌ను నాన్నగారి (ప్రముఖ నిర్మాత ఏయం రత్నం)తో పాటు, నా శ్రేయోభిలాషులు, కిరణ్‌ సన్నిహితులు చూసి, హాయిగా నవ్వుకున్నారు. ప్రేక్షకులను కూడా మెప్పిస్తుందనే నమ్మకం ఉంది. దర్శకత్వం అంటే నాకు ఆసక్తి. అయితే నాన్నగారి ప్రొడక్షన్‌ వ్యవహారాలు చూస్తుంటాను కాబట్టి డైరెక్షన్‌కి గ్యాప్‌ వచ్చింది. ఇక నా తమ్ముడు రవికృష్ణ నటించిన '7/జీ బృందావన కాలనీ' సినిమా రీ రిలీజ్‌కు మంచి స్పందన వచ్చింది. వచ్చే నెలలో ఈ సినిమా సెకండ్‌ పార్ట్‌ షూటింగ్‌ ఆరంభిస్తాం'' అని అన్నారు.

మ్యాడ్‌ బ్లాక్‌బస్టర్‌ అవుతుంది

– దుల్కర్‌ సల్మాన్‌



• 'మ్యాడ్‌' ఈవెంట్‌లో దుల్కర్‌ సల్మాన్‌, సిద్ధు, శ్రీ లీలతో యూనిట్‌

సంగీత్‌ శోభన్‌, నార్నే నితిన్‌, రామ్‌ నితిన్‌, శ్రీ గౌరీ ప్రియా రెడ్డి, అనంతిక సనీల్‌కుమార్‌, గోపికా ఉద్యాన్‌ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మ్యాడ్‌'. సూర్యదేవర హారిక నిర్మాతగా పరిచయం అవుతూ, సాయి సౌజన్య సహ–నిర్మాతగా కల్యాణ్‌ శంకర్‌ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్‌ వేడుకకు ఓ ముఖ్య అతిథిగా హాజరైన దుల్కర్‌ సల్మాన్‌ మాట్లాడుతూ– ''మ్యాడ్‌' ట్రైలర్‌ నిజంగానే మ్యాడ్‌గా, చాలా ఫన్నీగా ఉంది. నటీనటులు ఎవరూ కొత్త వాళ్లలా లేరు. 'మ్యాడ్‌' చిత్రం బ్లాక్‌ బస్టర్‌ అవుతుంది'' అన్నారు. మరో అతిథి సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ– ''మ్యాడ్‌' స్టోరీ లైన్‌ నాకు తెలుసు. సినిమాను ప్రేక్షకులు బాగా ఎంజాయ్‌ చేస్తారు'' అన్నారు. ''గుంటూరు కారం' సెట్స్‌లో 'మ్యాడ్‌' ప్రస్తావన విన్నాను. 'మ్యాడ్‌' చిత్రం 'మ్యాడ్‌'గా ఉంటుందట'' అన్నారు శ్రీ లీల. 'నా ఫ్రెండ్‌ అనుదీప్‌ లేకపోతే నేను లేను'' అన్నారు కల్యాణ్‌ శంకర్‌.

క్లుప్తంగా...

కాలేయ వ్యాధి బాధిత బాలుడికి రూ.18 లక్షలు

మరోసారి తన పెద్దమనసు చాటుకున్న సీఎం వైఎస్ జగన్



బాలుడిని చూసి చలించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి పెద్ద మనసు చాటుకున్నారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలేనికి చెందిన నాలుగు నెలల అన్విత్ మహి ఆరోగ్యం విషయంలో వెంటనే స్పందించారు. ఈ చిన్నారి కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. బాలుడి తండ్రి బుల్లిరాజు వ్యవసాయ కూలి. తన బిడ్డకు వచ్చిన కష్టాన్ని బుల్లిరాజు ఇటీవల రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన బుధవారం బాలుడిని సీఎం వైఎస్ జగన్ వద్దకు తీసుకెళ్లి సమస్యను వివరించారు. అనారోగ్యంతో తల్లి మానస ఒడిలో ఉన్న అన్విత్‌మహిని చూసి సీఎం చలించిపోయారు. వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.18 లక్షలు మంజూరు చేశారు. బాలుడి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అజయ్ జైన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అజయ్‌జైన్‌కు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలను (ఎఫ్ఏసీ) అప్పగించింది. ఈ నెల 13 వరకు ఎంటీ కృష్ణబాబు సెలవులో ఉన్నందున అప్పటి వరకు అజయ్‌జైన్‌కు ఎఫ్ఏసీ ఇస్తూ సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులిచ్చారు.

పండుగల వరకు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దసరా, దీపావళి పండుగల దృష్ట్యా ఇప్పటికే నడుస్తోన్న పలు స్పెషల్ వీక్లీ ట్రైన్స్‌ను పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. సోమవారం నడిచే బెంగళూరు-విశాఖ(08544) రైలు ఈ నెల 16 నుంచి నవంబర్ 27 వరకు పొడిగించారు. మంగళవారం నడిచే తిరుపతి-హిసార్ (09716) రైలు ఈ నెల 10 నుంచి నవంబర్ 28 వరకు, సోలాపూర్-ముంబై (01435) రైలు ఈ నెల 10 నుంచి డిసెంబర్ 26 వరకు, బుధవారం నడిచే ముంబై-సోలాపూర్ (01436) రైలు ఈ నెల 11 నుంచి డిసెంబర్ 27 వరకు, గురువారం నడిచే సోలాపూర్-తిరుపతి (01437) రైలు ఈ నెల 5 నుంచి డిసెంబర్ 28 వరకు, శుక్రవారం నడిచే నర్సాపూర్-బెంగళూరు (07153) రైలు ఈ నెల 13 నుంచి నవంబర్ 24 వరకు, తిరుపతి-సోలాపూర్ (01438) రైలు ఈ నెల 6 నుంచి డిసెంబర్ 29 వరకు పొడిగించినట్లు వివరించారు. శనివారం నడిచే బెంగళూరు-నర్సాపూర్ (07154) రైలు ఈ నెల 14 నుంచి నవంబర్ 25 వరకు, హిసార్-తిరుపతి (09715) రైలు ఈ నెల 7 నుంచి నవంబర్ 25 వరకు పొడిగించనట్లు పేర్కొన్నారు. ఆదివారం నడిచే విశాఖ-బెంగళూరు (08543) రైలు ఈ నెల 15 నుంచి నవంబర్ 26 వరకు పొడిగించారు.

'జియాలజీ'లో మెండుగా ఉపాధి అవకాశాలు

జీఎస్ఐ సౌత్ రీజియన్ హెడ్, అడిషనల్ డీజీ వెంకటేశ్వరరావు



ఏఎన్‌యూ: జియాలజీ రంగంలో మెండుగా ఉపాధి అవకాశాలున్నాయని జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సౌత్ రీజియన్ హైదరాబాద్ హెడ్, అడిషనల్ డైరెక్టర్ జనరల్ సీహెచ్ వెంకటేశ్వరరావు చెప్పారు. సీనియర్ జియాలజిస్ట్ రాహుల్ రీమన్, జియాలజిస్ట్ టి.మల్లికార్జునరావులతో కలిసి ఆయన గురువారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీని సందర్శించారు. వీసీ పి.రాజశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జియాలజీ విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ.. ఈ రంగానికి సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాల కంటే చాలా తక్కువ సంఖ్యలో పట్టభద్రులు ఉన్నారని పేర్కొన్నారు. పోటీ తక్కువ ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. జియాలజీ విభాగాధిపతి ఆచార్య పీజే రత్నాకర్ మాట్లాడుతూ.. జియాలజీ విద్యార్థులకు కోర్సు బోధనతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో నైపుణ్య శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. తద్వారా విద్యార్థులు తగిన పరిజ్ఞానాన్ని పొందుతున్నారని చెప్పారు. సమావేశంలో అధ్యాపకులు డా.సీహెచ్ ఇజ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.



డబ్బుల సంగతేమో కానీ ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా 114 మిలియన్ల యూ ట్యూబ్ చానళ్లు ఉన్నాయి. అంటే 11 కోట్లకు పైగానే. ఈ విశ్వంలోని సుమారు 800 కోట్ల జనాభాలో సగటున ప్రతి 72 మందికి ఒక చానల్ అన్నమాట. ఇటీవల విడుదలైన రజనీకాంత్ సినిమా 'జైలర్'లో రజనీ ఐదేళ్ల మనవడు రుత్విక్ కూడా ఓ చానల్ నడుపుతుంటాడు. వీడియో చిత్రీకరణకు తాత రజనీ సాయం తీసుకుంటుంటాడు. 'ఏదో ఒక వీడియో తీసేసి అప్‌లోడ్ చేసెయ్..' అని తాత సలహా ఇస్తే.. 'బాగోలేని వీడియోలకు సంబంధించి కామెంట్స్‌లో జనం ఎలా గడ్డి పెడతారో చూడు' అని సమాధానం చెప్పడం ఆకట్టుకుంటుంది. ఆయా రంగాల్లో రాణిస్తున్న వారు తమ గురించి, తమకు తెలిసింది ప్రజలకు తెలియజేసి, వారి మెప్పు పొందాలని ఉబలాట పడుతుండటం ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. ఇలా నిర్ణయించుకున్న మరుక్షణమే యూ ట్యూబ్ చానల్ పెట్టేస్తున్నారు. ఇలా ఆవిర్భవించిన చానళ్ల ద్వారా వంటింట్లో వంటలు మొదలు రాకెట్ తయారీ వరకు ఎవరికి ఏ సందేహం వచ్చినా ఇట్టే సమాధానం దొరుకుతోంది. ఏ చానల్‌కు సంబంధించిన వీడియోను ఎంత ఎక్కువ మంది చూస్తారో ఆ చానల్ పెట్టిన వాళ్లకు అంతగా డబ్బులొస్తాయి. ఇదంతా ఎవరు ఏ అంశానికి అత్యంత ప్రభావితమవుతారన్న దానిపై ఆధారపడి ఉంటుంది. ఇటీవలి కాలంలో మన ఇండియన్స్, ప్రత్యేకించి పలువురు తెలుగు యూ ట్యూబర్స్ కూడా లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా చానళ్లు, వీడియోలు వీక్షిస్తున్న వారి అభిరుచుల్లో వచ్చిన మార్పులు ఆశ్చర్యంగొలుపుతున్నాయి.

– వీఏవీ రంగాచార్యులు, ఏపీ సెంట్రల్ డెస్క్

అవధుల్లేని ఆనందం

ప్రపంచంలో టాప్-10 యూట్యూబ్ చానల్స్ సబ్‌స్క్రైబర్లు (మిలియన్లలో)

టి-సిరీస్	250
మిస్టర్ బీస్ట్	187
కోకోమెలన్	166
సోనీ టెలివిజన్	163
కిడ్స్ డయానా షో	114
ప్యూడీపై	111
లైక్ నాస్త్యా	107
వ్లాడ్ అండ్ నికీ	101
జీ మ్యూజిక్ కంపెనీ	100
డబ్ల్యూడబ్ల్యూఈ	97.4



➤ ఇలా విద్యార్థుల స్క్రీన్ టైమ్ పెరగడం వల్ల పాఠ్యాంశాల పట్ల అటెన్షన్ స్పాన్ తగ్గిపోతోంది.

ఈ సమస్యలన్నింటికీ స్వీయ నియంత్రణే మార్గం అని నిపుణులు చెబుతున్నారు.

అభిరుచుల్లో మార్పు

- ➤ ప్రపంచాన్ని అన్వేషించడం అనేది ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. కొత్త విషయాలను తెలుసుకోవడంతో పాటు వారి వారి అభిరుచులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవ్వడం కోసం చాలా మంది సామాజిక మాధ్యమాలను ఫాలో అవుతున్నారు.
- ➤ ఈ విషయంలో ఇప్పటిదాకా యూ ట్యూబ్ అతిపెద్ద ప్లాట్‌ఫాం. ఈ స్థానాన్ని ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ ఆక్రమించేస్తోంది. యువతరం అంతా ఇన్‌స్టాలోనే మునిగి తేలుతోంది.
- ➤ 40–50 శాతం యువత స్క్రీన్ టైమ్ సగటున రోజూ 4 నుంచి 10 గంటలు ఉంటోంది. ఇంత సమయం స్క్రీన్ కోసం కేటాయించడం మంచిది కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో ఇది న్యూరో, కంటి, మానసిక సమస్యలకు దారితీయవచ్చని హెచ్చరిస్తున్నారు.
- ➤ యువ దంపతుల దాంపత్య జీవితంలోనూ ఇది చిచ్చు రేపే ప్రమాదం ఉందని చెబుతున్నారు. నెగెటివ్ అంశాల పట్ల మనసు మళ్లడం సహజమే అయినా అస్తమానం అదే అలవాటుగా మారి అనుకరించే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

కోట్లాది మందికి యూ ట్యూబ్ పిచ్చి

- చిత్ర, విచిత్ర పోకడలకు జనం పెద్దపీట
- తొలి స్థానం మాత్రం ఎంటర్‌టైన్‌మెంట్‌దే
- సగం మంది యువత స్క్రీన్ టైమ్ 4-10 గంటలు
- సంపాదనలో వరల్డ్ నంబర్ 1 మిస్టర్ బీస్ట్



యూ ట్యూబ్/ఇన్‌స్టా వీక్షకులు ప్రతి 100 మందిలో టాప్ ప్రయారిటీ (శాతంలో)

రీల్స్	92
మ్యూజిక్/కామెడీ	87
ఎంటర్‌టైన్‌మెంట్	85
సెక్స్	68
ఇంటర్వ్యూలు	64
హౌటు అండ్ ట్యుటోరియల్	63
ప్రొడక్ట్	61
ఎక్స్‌ప్లెయినింగ్	58
రివ్యూ అండ్ ట్రావెలింగ్	54
వ్లాగ్స్	53

కొందరికి ఖేదం.. మరికొందరికి మోదం

యూ ట్యూబ్ చానల్ స్టార్ట్ చేసి.. కొందరేమో లక్షలు, కోట్లకు పడగలెత్తుతుంటే మరికొందరు మాత్రం నెలలు, ఏళ్ల తరబడి కష్టపడుతున్నా, కనీసం మానిటైజేషన్‌కు నోచుకోవడం లేదు. ఎలాగోలా మానిటైజేషన్ అయినా వారు అప్‌లోడ్ చేసే వీడియోలు వైరల్ కావడం లేదంటూ వాపోతుంటారు. ఇందుకు వారు యూ ట్యూబ్ ఆల్గారిథమ్ ఫాలో కాకపోవడమే. ఏ తరహా కంటెంట్‌ను జనం కోరుకుంటున్నారనేది గమనించి.. వీడియోలు రూపొందించుకోవాలి.



ఒక్కోసారి సీరియస్ అంశాలు సైతం వైరల్ అవుతుంటాయి. అయితే అది ప్రజల అవసరాన్ని బట్టి ఉంటుంది. ఉదాహరణకు స్పోకెన్ ఇంగ్లిష్‌కు సంబంధించి మన తెలుగు కుర్రాడు స్టార్ట్ చేసిన 'వశిష్ట 360' చానల్ విశేష ఆదరణ పొందింది. ఆ వీడియోల ఆధారంగా ప్రచురించిన పుస్తకాల ద్వారా అతను కోట్లాది రూపాయలు ఆర్జించాడు.

వరల్డ్ నంబర్ వన్



మిస్టర్ బీస్ట్ అనే యువకుడు (అసలు పేరు జిమ్మి డొనాల్డ్‌సన్) తన 13వ ఏట చానల్ స్టార్ట్ చేశాడు. మొదట్లో 'ఐ పుట్ 100 మిలియన్ ఆర్బీజ్ ఇన్ మై ఫ్రెండ్స్ బ్యాక్ యార్డ్' అనే వీడియోకు 100 మిలియన్ వ్యూస్ వచ్చాయి. ప్రతి వీడియోకు సగటున 150 మిలియన్ వ్యూస్ ఉన్నాయి. సముద్రంలో ఒంటరిగా ఏడు రోజులు గడపడం, షోల రీ క్రియేషన్, ఒక డాలర్ నుంచి ఒక మిలియన్ డాలర్స్ వరకు హోటల్ గదులు.. ఇలా ప్రతి వీడియో కొత్తదనంతో, విచిత్రంగా ఉండటం విశేషం. ఉదాహరణకు.. పెద్ద మాల్‌లోకి వెళ్లి.. 15 నిమిషాల్లో ఎవరేం కావాలన్నా కొనుక్కుని బిల్లింగ్ కోసం లైన్‌లో నిలుచుంటే ఆ బిల్లు తానే చెల్లిస్తానని చెప్పడం.. నిజంగానే చెల్లించడం. ఇతడి ప్రతి వీడియో రియాలిటీతో స్ట్రెయిట్‌గా సబ్జెక్ట్‌లోకి వెళ్తుంది. ఎక్కడా సుత్తి ఉండదు. ఒక్కో వీడియో షూటింగ్‌కు వారం పది రోజులు కష్టపడినా, తుదకు ఆ వీడియో నిడివి కేవలం 15–20 నిమిషాలే ఉంటుంది. ఇతను తన వీడియోల ద్వారా వచ్చే మొత్తంలో చాలా వరకు పేద ప్రజల కోసమే వెచ్చిస్తాడు. పాతికేళ్ల ఈ యువకుడు గత ఏడాది యూ ట్యూబ్ ద్వారా అత్యధికంగా సంపాదించిన వ్యక్తిగా రికార్డు సృష్టించాడు. ఏకంగా 82 మిలియన్ డాలర్లు సంపాదించారు. మన భారతీయ కరెన్సీలో సుమారు రూ.700 కోట్లు పైమాటే. అంటే రోజుకు దాదాపు రూ.2 కోట్లు. ఫోర్బ్స్ 2023 టాప్ క్రియేటర్స్ ఇన్ వరల్డ్ లిస్ట్‌లో అగ్రస్థానంలో నిలిచాడు.

అది డోపమైన్ ఎఫెక్ట్



జనరేషన్, జనరేషన్‌కు ప్రజల అభిప్రాయాలు, అభిరుచులు మారుతుంటాయి. ఇందుకు సహజంగా 15 ఏళ్లు పడుతుంది. అయితే ఇటీవలి కాలంలో టెక్నాలజీలో మార్పుల ప్రభావం వల్ల రెండేళ్లలోనే అభిరుచులు మారిపోతున్నాయి. ఇదివరకు బాగా కష్టపడే వాళ్లు మాత్రమే డబ్బు సంపాదించే వారు. మనం ఇన్నాళ్లు చెత్తా, చెదారం అనుకున్న కంటెంట్‌తో కూడా రూ.లక్షలు, కోట్లు సంపాదించేస్తున్నారు. యాలకలు, లవంగాలు అంటూ చేస్తున్న వీడియోలకు కూడా లక్షల్లో లైక్‌లు వస్తున్నాయి. ఇదంతా 'హ్యాపీనెస్' అనే సూత్రం. ఉదాహరణకు ఒక రోజంతా కష్టపడి ఒక పుస్తకం చదివితే ఎంత ఆనందం వస్తుందో.. ఒక నిమిషం పాటి రీల్/షాట్ చూస్తే అంతే ఆనందం వస్తుంది. కొన్ని పిచ్చి పనులను చూసినప్పుడు కూడా కొందరి మనసు అలానే స్పందించి డోపమైన్ అనే న్యూరోట్రాన్స్‌మీటర్ హార్మోన్ రిలీజ్ అవుతోంది. ఈ తరహా డోపమైన్‌కు జనం అలవాటు పడిపోయారు. – విశేష్, సైకాలజిస్ట్

మేలు జాతి పశువుల పునరుత్పత్తికి ప్రత్యేక చర్యలు

- ఏపీ బొవైన్ బ్రీడింగ్ పాలసీని అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం
- అధిక పాల ఉత్పత్తే లక్ష్యంగా చర్యలు
- నాసిరకం వీర్యోత్పత్తికి అడ్డుకట్ట




సాక్షి, అమరావతి: మేలు జాతి పశువుల పునరుత్పత్తి.. అధిక పాల దిగుబడి లక్ష్యంగా బొవైన్ బ్రీడింగ్ (జంతు ప్రజనన) పాలసీ–2023ని తీసుకొచ్చింది. నాసిరకం పశు వీర్యోత్పత్తి, అనైతిక పద్ధతుల్లో పశు సంపర్కానికి పాల్పడే వారికి అడ్డుకట్ట వేస్తూ దేశీయ మేలు జాతి పశు సంతతిని భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో తీసుకొచ్చిన ప్రత్యేక పాలసీ గురువారం నుంచి అమలులోకి వచ్చింది. అధిక పాల ఉత్పత్తే లక్ష్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, డెన్మార్క్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల నుంచి దిగుమతి చేసుకున్న పశువుల వీర్యంతో దేశీయ పశువుల పునరుత్పత్తి చేసేవారు. హైబ్రీడ్ జాతులతో సంపర్కం చేయడం వల్ల ఉత్పత్తి పెరిగింది. అయితే, పశువులు ముందెన్నడూ లేని వ్యాధుల బారినపడటం, ఇతర దుష్పరిణామాలు వెలుగు చూశాయి. మరోవైపు కొంత మంది స్వార్థపరుల చర్యల వల్ల మేలుజాతి పశువులు అంతరించిపోవడంతోపాటు పాల దిగుబడి గణనీయంగా పడిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ పరిస్థితికి చెక్ పెట్టాలన్న లక్ష్యంతో ప్రత్యేకంగా ఏపీ బొవైన్ బ్రీడింగ్ యాక్ట్–2021 ప్రభుత్వం గురువారం నుంచి అమల్లోకి తీసుకొచ్చింది.

ఈ పద్ధతులు పాటించాల్సిందే

బొవైన్ బ్రీడింగ్ పాలసీ–2023 ప్రకారం ఇకపై ఏ జాతి పశువుల వీర్యాన్ని ఆ జాతి పశువులకే వాడాలి. జాతి గేదెలను అప్‌గ్రేడ్ చేయాలంటే ముర్రా జాతి పశు వీర్యాన్ని మాత్రమే వాడాలి. సంకర జాతి పశువులను గిర్, సాహివాల్, కాంక్రీజ్, హర్యానా వంటి జాతి పశువులతోనే సంకరపర్చాలి. ఓపెన్ న్యూక్లియస్ బ్రీడింగ్ సిస్టమ్‌ను అవలంబించడం ద్వారా అదే జాతికి చెందిన స్వచ్ఛమైన వీర్యం ఉపయోగించి ఈ జాతులను సంరక్షించి భవిష్యత్ తరాలకు అందించే అవకాశం ఏర్పడుతుంది. ఒకవేళ ఎవరైనా బ్రీడ్స్‌ను అభివృద్ధి చేయాలన్నా, పశు సంపర్కానికి సంబంధించిన సేవలు అందించాలన్నా కచ్చితంగా ప్రభుత్వ అనుమతి పొందాల్సిందే. వీర్యోత్పత్తి కోసం ఇళ్ల వద్ద, ఫామ్స్ వద్ద సొంతంగా దున్నపోతులు, ఎద్దులను నిర్వహించుకోవాలంటే వాటికి జన్యుపరమైన లోపాలు లేవనే విషయాన్ని అధికారికంగా నిర్ధారించుకోవాలి. వాటి వీర్యం సంపర్కానికి మంచిదేనని స్థానిక పశువైద్యుల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందాల్సి ఉంటుంది. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉన్న సంకర జాతి పశు జాతులను (జెర్సీ క్రాస్, హెచ్ఎఫ్)లను మాత్రమే అనుమతిస్తారు. ఇష్టమొచ్చిన రీతిలో నాసిరకం పశు వీర్యాన్ని ఉత్పత్తి చేయడం, అమ్మడం, ఎద కట్టించడం వంటి అనైతిక చర్యలకు పాల్పడే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. మరోవైపు పాలసీలో భాగంగా దేశంలోని ఇతర ప్రాంతాల వ్యాపారులకు ఉపయోగపడేలా డేటా బేస్‌ను రూపొందిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న అన్నిరకాల పశువులు, గేదెల కోసం ఎలైట్ బుల్ సెమెన్ బ్యాంక్‌ను ఏర్పాటు చేస్తారు.

పేదలకు రుణాలిస్తే విషం చిమ్ముతారా?

- ఈనాడుపై కర్నూలు డీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ధ్వజం



కర్నూలు(అగ్రికల్చర్): పేద మధ్య తరగతి మహిళల జీవనోపాధి మెరుగుపరిచేందుకు మానవత్వంతో సహకార కేంద్రబ్యాంకు ద్వారా రుణాలు ఇస్తుంటే ప్రోత్సహించాల్సింది పోయి.. విషం చిమ్ముతారా అంటూ కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఈనాడుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సుజనాచౌదరి, సీఎం రమేశ్‌తో పాటు ఎంతో మంది టీడీపీకి చెందిన పారిశ్రామిక వేత్తలు వేలాది కోట్ల రూపాయలు రుణాలు తీసుకొని బ్యాంకులను ముంచారన్నారు. చిత్తశుద్ధి ఉంటే అలాంటి వారిపై వార్తలు రాయాలని ఈనాడుకు సూచించారు. పేదలకు ఒక్కొక్కరికీ రూ. 25 వేల చొప్పున రుణాలు ఇస్తుంటే తప్పుడు కథనం రాయడం ఏమిటని ప్రశ్నించారు. గురువారం ఈనాడు పత్రికలో 'సహకార పంథా.. ముందస్తు ఓట్ల దందా' శీర్షికన ప్రచురితమైన కథనాన్ని వారు ఖండించారు. కేడీసీసీబీ చైర్మన్ చాంబర్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ.. నలుగురు సభ్యులతో జాయింట్ లయబిలిటీ గ్రూప్ (జేఎల్‌జీ)గా ఏర్పడిన గ్రూపునకు రుణాలు ఇచ్చే ప్రక్రియ 2018–19 నుంచే అమలులో ఉందన్నారు. ఇది 100 శాతం పారదర్శకంగా, బోర్డు ఆమోదంతోనే రుణాలు ఇస్తున్నామన్నారు. ఒక్క జేఎల్‌జీ గ్రూపులకే కాకుండా రైతులకు కూడా పెద్దఎత్తున రుణాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎల్లోమీడియా కథనానికి ఎలాంటి విశ్వసనీయత లేదని చైర్‌పర్సన్ విజయమనోహరి స్పష్టం చేశారు. కర్నూలు ప్రజలకు తమపై అభిమానం ఉందని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి చెప్పారు. రుణాలకు కర్నూలు ఎమ్మెల్యే సీటుకు సంబంధం ఏమిటని నిలదీశారు. విలేకర్ల సమావేశంలో డీసీసీబీ సీఈవో రామాంజనేయులు పాల్గొన్నారు.

పురుగు.. పిట్టా.. పంట..

కనుమరుగు!



చిరు ప్రాణులపై తీవ్ర ప్రభావం చూపుతున్న వాతావరణ మార్పులు

- 1989–2016 మధ్య 75 శాతం అంతరించిపోయిన కీటకాలు
- 2022లో కీటకాల బయోమాస్‌లో పెరుగుదల కనిపించినా.. బహుస్వల్పమే
- కీటకాలు, పక్షి జాతుల తగ్గుదలతో పంటలపై తీవ్ర ప్రభావం
- జర్మనీ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడి

సాక్షి, అమరావతి: వాతావరణ మార్పులు కీటకాలపై ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా వాటి జనాభా తగ్గుతోంది. ముఖ్యంగా రక్షిత ప్రాంతాల్లోని కీటకాల సంతతి అత్యంత వేగంగా తగ్గిపోవడమే కాకుండా పెరుగుదల కూడా భారీగా పడిపోయిందని జర్మనీలోని యూనివర్సిటీ ఆఫ్ వర్జ్‌బర్గ్ బయో సెంటర్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జోర్గ్ ముల్లర్ వెల్లడించారు. ఈ నెలలో విడుదలైన నేచర్ మ్యాగజైన్‌లో ఆయన రాసిన కథనం పర్యావరణవేత్తలను కలవరపెడుతోంది. 1989 నుంచి 2016 మధ్యకాలంలో జర్మనీలోని రక్షిత ప్రాంతాల్లో కీటకాల జీవం 75 శాతం కంటే ఎక్కువగా తగ్గిపోయిందని ముల్లర్ పేర్కొన్నారు. 2005లో అత్యంత వేగంగా పతనమైందని.. ఆ తర్వాత సంవత్సరాల్లో వాటి పెరుగుదల కోలుకోలేదని అధ్యయనం నిరూపించిందని స్పష్టం చేశారు. ముల్లర్ 2022లో చేసిన అధ్యయనంలో కీటకాల బయో మాస్‌లో కొంత పెరుగుదల కనిపించింది. అయితే, గతంలో తగ్గినంత వేగంగా ఈ పెరుగుదల లేదని ఆయన పేర్కొన్నారు. ముల్లర్ బృందం 2016, 2019, 2020, 2022లో పచ్చిక భూములు, వ్యవసాయ యోగ్యమైన పొలాలు సహా అనేక బహిరంగ ఆవాసాలలో పురుగుల బయో మాస్ పెరుగుదలపై పరిశోధనలు చేసింది.

వాతావరణ మార్పులు.. ఆవాసాల నష్టం

పర్యావరణ పరిరక్షణలో ఎంతో కీలకమైన కీటకాల క్షీణత మానవాళి జీవనంపైనా పెద్ద ప్రభావం చూపుతుందని ప్రొఫెసర్ ముల్లర్ పేర్కొన్నారు. వీటి జాతి తగ్గిపోవడానికి వాతావరణ మార్పులు ప్రధాన పాత్ర పోషిస్తుండగా.. ఆవాసాల నష్టం, పట్టణీకరణ, కాలుష్యం, సింథటిక్ పురుగు మందులు, ఎరువుల వినియోగం కూడా కారణమని తేల్చారు. వీటితోపాటు జీవ సంబంధ కారకాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా 1989 నుంచి 2016 మధ్య కీటకాల బయో మాస్‌లో 75 శాతానికి పైగా క్షీణత నమోదైనట్టు.. 2005 తర్వాత వాతావరణ ప్రభావాలు కీటకాలకు ప్రతికూలంగా మారినట్టు గుర్తించారు. ఉష్ణోగ్రతలు కీటకాల జీవన చక్రంలోని వివిధ దశల్లో వాటి జనాభాను ప్రభావితం చేస్తాయని, వీటి మనుగడ శీతాకాల పరిస్థితులు, వేసవి వంటి చివరి



వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని ముల్లర్ తన అధ్యయనంలో పేర్కొన్నారు. శీతాకాలంలో చాలా వెచ్చగాను పొడిగాను ఉండటం, వేసవిలో చల్లగాను తడిగాను మారడంతో ఆ పరిస్థితులను తట్టుకోలేక కీటకాలు అంతరించిపోయినట్టు తేల్చారు. కీటకాల నాశనం ఆహార గొలుసును చిక్కుల్లో పడేస్తోందని.. దీనివల్ల కీటకాలను తినే పక్షులకు ఆహారం లభించక మరణిస్తున్నాయని మ్యూనిచ్ టెక్నికల్ యూనివర్సిటీలో ఎకో క్లైమటాలజీ ప్రొఫెసర్ అన్నెట్ మెన్జెల్ తెలిపారు. దీనివల్ల పంటలు నాశనం అవుతున్నట్టు తేల్చారు. ముఖ్యంగా ఈ తగ్గుదల 2005 నుంచి 2019 మధ్య బాగా తగ్గినట్టు గుర్తించారు.

20 నుంచి 30% తగ్గిన పంటలు



ఆహార గొలుసులో కీటకాలు తగ్గిపోవడంతో పక్షులకు ఆహారం దొరకక చనిపోతున్నాయని, వీటిలో సముద్ర పక్షులు అధికంగా ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ప్రభావం జర్మనీతో పాటు సమీప యూరోపియన్ దేశాల్లోనూ కనిపించినట్టు తేల్చారు. ఆహారం కొరతతో వలస పక్షులు సైతం రావడం లేదని, స్థానిక పక్షులు సైతం తగ్గిపోతున్నాయని, ఉన్నవి పంటలపై దాడులు చేస్తున్నాయని గుర్తించారు. ఈ క్రమంలో 2005–2019 మధ్య పంట దిగుబడులు 30% వరకు తగ్గినట్టు అంచనా వేశారు. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న గ్రీన్ హౌస్ వాయువుల్ని తగ్గించాలని, సమతుల వాతావరణ పరిస్థితులను కాపాడేందుకు అడవులను పెంచాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. లేకపోతే ఆసియా, అమెరికా దేశాలకూ ఇదే ముప్పు తప్పదని హెచ్చరిస్తున్నారు.

తెలంగాణ

పారదర్శకంగా.. ప్రలోభాలకు తావు లేకుండా..

- స్వేచ్ఛాయుత వాతావరణంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తాం
- సీఈసీ రాజీవ్‌కుమార్ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా నిర్వహించడానికి కట్టుబడి ఉన్నామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ స్పష్టం చేశారు. అన్ని రకాల ప్రలోభాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని ప్రకటించారు. ఎన్నికల్లో ధనం, మద్యం, ఇతర కానుకలు, మాదకద్రవ్యాల ప్రవాహాన్ని పూర్తిగా నియంత్రించాలని, వీటిపట్ల అత్యంత అప్రమత్తంగా ఉంటూ కఠినంగా వ్యవహరించాల్సిందిగా కేంద్ర, రాష్ట్రాల ఎన్నికల యంత్రాంగాన్ని ఆదేశించామని తెలిపారు. వారు కఠిన చర్యలు తీసుకునేలా తాము చేస్తామని చెప్పారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేయడం, వాటికి ఫైనాన్స్ చేయడం, నిర్మూలించాల్సిన బాధ్యతల్లో ఉండి అవకాశం కల్పించడం నేరమేనని, ఐపీసీలోని పలు సెక్షన్లతో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం కింద శిక్షార్హులని రాజీవ్‌కుమార్ స్పష్టం చేశారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సన్నద్ధతను పరిశీలించడానికి మూడు రోజుల రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆయన.. గురువారం చివరిరోజు సహచర ఎన్నికల కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులన్నింటిపై విచారణ జరిపి వారికి సమాధానం ఇవ్వాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించామని తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి సాధారణ పరిశీలకులు, పోలీసు పరిశీలకులు, వ్యయ పరిశీలకులను నియమిస్తామన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలు, ఇతర అక్రమాలపై 'సీ-విజిల్' యాప్ ద్వారా అక్కడికక్కడే ఫోటోలు తీసి పంపిస్తే 100 నిమిషాల్లోగా చర్యలు తీసుకుంటామన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.